www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'సోషల్' ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ అరెస్టు

'ఆపరేషన్ సిందూర్'పై స్పందించని బాలీవుడ్ నటులపై అనుచిత పోస్టు

తీవ్ర విమర్శలతో డిలీట్ చేసి క్షమాపణ

అయినా ఆమెపై కోల్‌కతా పోలీసుల కేసు

గురుగ్రామ్‌లో అదుపులోకి.. కోర్టులో హాజరు

రెండు వారాలు జ్యుడీషియల్ కస్టడీ



2



మరి వారి మాటేంటి?

సనాతన ధర్మాన్ని 'కలుషిత ధర్మం' అన్న వారిపై చర్యలు తీసుకోలేదేం?

వారి క్షమాపణలేవీ: పవన్ కల్యాణ్

సోమవారం | 2-6-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 47 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: సప్తమి రా.8:36 తదుపరి అష్టమి, నక్షత్రం: మఖ రా.10:56 తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.10:16-11:57, దుర్ముహూర్తం: మ.12:39-1:31, మ.3:15-4:06, అమృతఘడియలు:: రా.8:24-10:05, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 5:43, సూర్యాస్తమయం: 6:42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మా వాడే.. వదిలేయండి!

అవినీతిపరులకు నేతల అండ!

ప్రాసిక్యూషన్ వద్దంటూ లేఖలు

శాఖాపరమైన విచారణకు సిఫారసులు

జగన్ జమానాలో తప్పులు చేసిన వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు

ఉత్తరాంధ్ర మంత్రి వరుస లేఖలు

మరో మంత్రి ప్రత్యేక కౌంటర్

సిఫారసు లేఖలు తెచ్చుకుంటేనే పరిష్కరిస్తానంటున్న ఇంకో మంత్రి

వారి బాటలోనే మరి కొందరు నేతలు



జగన్ ప్రభుత్వంలో అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడిన వారిపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకునేందుకు సన్నద్ధమవుతుంటే.. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అక్రమార్కులను కాపాడేందుకు లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. వారిపై ఏ చర్యలూ తీసుకోకుండా అడ్డుపడుతున్నారు. ప్రాసిక్యూషన్ చేయాలని ఏసీబీ సిఫారసు చేసిన కేసులను కూడా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దీని వెనుక నేతల 'సొంత ఆర్థిక ప్రయోజనాలు' ఉన్నాయని అధికార వర్గాలే చెబుతున్నాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఒక అధికారి... తహశీల్దార్‌గా పనిచేసిన కాలంలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుతోపాటు లెక్కలేనంత డబ్బుతో ఏసీబీకి దొరికిపోయారు. ఆయన్ను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనని ఏసీబీ కోరగా... 'వద్దే వద్దు' అంటూ ఒక మంత్రి రంగప్రవేశం చేశారు. శాఖాపరమైన విచారణతో సరిపెట్టాలంటూ అధికారికంగానే లేఖ రాసేశారు. అవినీతి నిరోధక చట్టం, ఇతర చట్టాల పరిధిలోని

మిగతా 12వ పేజీలో...

ఉద్యోగుల బదిలీలకు మరోవారం గడువు

9వ తేదీ వరకు పెంపునకు సీఎం ఆమోదం

3

వర్షాకాలాన్ని తలపించిన మే

రికార్డు స్థాయిలో వర్షపాతం



3

రాష్ట్రంలో సాధారణం కంటే 148 శాతం అధికం

అత్యధికంగా గుంటూరు జిల్లాలో 421 శాతం

అన్ని జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

మేలో అధిక వర్షాలు అరుదంటున్న నిపుణులు



మళ్లీ భగభగ

పెరిగిన ఎండ తీవ్రత

జంగమహేశ్వరపురంలో 41 డిగ్రీలు నమోదు

● తెల్లవారుజామునే చేతిలో సొమ్ము



నంద్యాల జిల్లా మీర్జాపురంలో శనివారం (మే 31) ఉదయం 5:30 గంటలకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

'సేవలకు సమాధి కట్టేస్తున్నారు'... అని విపక్ష నేత జగన్ తెగ వాపోయారు! వలంటీర్లను పక్కన పెట్టేశారని... రేషన్ బండ్లను మూలకు నెట్టారని ఆక్రోశించారు. వలంటీర్లు లేకుంటే ప్రపంచమంతా తలకిందులైపోతుందన్నది వైసీపీ వాదన మాత్రమే! కానీ... వారు లేకున్నా పింఛన్ల పంపిణీ ఆగలేదు. ఎలాంటి ఇబ్బందీ తలెత్తలేదు. ఏడాదిగా ప్రతినెలా ఠంచనుగా లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పెన్షను అందుతోంది.



పింఛన్, రేషన్ పంపిణీ

వైసీపీ హయాంలో ఇంటింటికీ సరుకుల పంపిణీ ఒక మిథ్యే! సరుకుల బండి ఆగేది... వీధి మలుపు చివరే! లబ్ధిదారులను నడి రోడ్డుపై క్యూలో నిలబెట్టిన ఘనత జగన్‌దే! ఇప్పుడు డీలర్ల ద్వారా సరుకుల పంపిణీతో ఈ కష్టం తీరుతోంది. ముడుపులు పిండుకునేందుకే అప్పట్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టారు. వాటిని తొలగించడం వల్ల వేలమందికి ఉపాధి పోయిందట! వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలిచ్చి జనం సొమ్మునే జీతాలుగా పంచారు. ఇప్పుడు వారిని తొలగించడమూ తప్పేనట! గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో ఏ ఒక్కరినీ కూటమి సర్కారు తొలగించలేదు. సచివాలయాలను హేతుబద్ధీకరించడం ద్వారా ఉద్యోగుల సేవలను సమర్థంగా వినియోగించుకోవడంపైనే దృష్టి పెట్టింది. దానిని జగన్ వక్రీకరించారు. '33వేల శాశ్వత ఉద్యోగాలకు సమాధి కట్టారు' అని తప్పుడు ఆరోపణలు చేశారు.

ఇప్పుడే బాగుంది

1నే.. ఇంటి వద్దకే

ప్రతినెలా ఠంచనుగా పింఛను

సెలవు దినమైతే ముందురోజే పంపిణీ

వలంటీర్లు లేకపోయినా ఆగని సేవలు

ప్రభుత్వానికి ఏటా 1200 కోట్లు ఆదా

ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పినట్టుగా పెన్షన్ 4 వేలకు పెంపు

వలంటీర్లు లేకపోతే పెన్షన్లు ఇవ్వలేరన్న జగన్ మాటలు ఒట్టివే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'కూటమి సర్కారు వస్తే వలంటీర్లను తీసేస్తుంది. అప్పుడు పింఛన్ల పంపిణీ ఆగిపోతుంది'... అంటూ ఎన్నికల ముందు వైసీపీ గగ్గోలు పెట్టింది. కూటమి ప్రభుత్వమే వచ్చింది. వలంటీర్లను పక్కన పెట్టింది. కానీ... పింఛన్ల పంపిణీ మాత్రం ఆగలేదు. వలంటీర్లు లేకపోయినా ఏడాదిగా పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. ఇంకా చెప్పాలంటే

మిగతా 11వ పేజీలో...

● నడిరోడ్డుపై ఈ పడిగాపులకు చెల్లు



జగన్ ప్రభుత్వంలో రేషన్ కోసం మండుటెండలో రేషన్ బండి వద్ద బారులుదీరిన జనం (ఫైల్)

రేషన్ తిప్పలు తప్పాయి

ఇకపై రేషన్ డీలర్ల వద్దే సరుకుల పంపిణీ

నెలలో 15 రోజులు.. ఎప్పుడైనా తీసుకోవచ్చు

దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వారికి ఇళ్ల వద్దకే!

నాడు పేరుకే 'ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ'

వీధి చివర్లోనే ఆగిన సరుకుల బండి

నడిరోడ్లపై క్యూ కష్టాలకు సర్కారు చెల్లుచీటీ

ఎండీయూ డ్రైవర్లు నష్టపోకుండా చర్యలు

బ్యాంకు రుణ బకాయిలు 200 కోట్లు చెల్లించనున్న ప్రభుత్వం

డ్రైవర్లకు సొంతం కానున్న బండ్లు

11

పండుగలా ప్రారంభం

తొలిరోజే సరుకులు తీసుకున్న 15 లక్షలకుపైగా కార్డుదారులు

రేషన్ దుకాణాల్లో సీసీ కెమెరాలు

ఫిర్యాదు చేసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ కూడా..

ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు

కొత్తగా 7 లక్షల దరఖాస్తులు: మంత్రి నాదెండ్ల


కొత్త జిల్లాలు.. పాత పద్ధతులు

కొత్త జిల్లాల పేర్లను రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చని కేంద్రం

పాత జిల్లాల కేంద్రంగానే కార్యకలాపాలు... కొత్త జిల్లాల ప్రజలకు ఇబ్బందులు

నియామకాలు, ప్రవేశాలు, బదిలీల్లో దక్కని లబ్ధి.. మూడున్నరేళ్లుగా పెండింగ్

నాటి జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఒకవైపు.. కేంద్ర ప్రభుత్వ స్పందనా రాహిత్యం మరోవైపు! వెరసి 'కొత్త' జిల్లాల కష్టాలు ఇప్పటికీ తీరడంలేదు. నాడు అనాలోచితంగా, అశాస్త్రీయంగా 26 జిల్లాలను ఏర్పాటు చేసేశారు. కానీ.. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో వాటిని చేర్చే దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఉద్యోగ నియామకాలు, బదిలీలు, విద్యాలయాల్లో ప్రవేశాల్లో కొత్త జిల్లాల ప్రజలు లబ్ధి పొందలేకపోతున్నారు. నేటికి పాత జిల్లాలే యూనిట్‌గా ఆయా ప్రక్రియలు సాగుతున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడి 38 నెలలవుతున్నా ఇదే పరిస్థితి.



కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని లేఖలు రాస్తున్నా స్పందన శూన్యం

మరో లేఖ రాసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గత జగన్ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 3వ తేదీన కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. లోక్‌సభ స్థానాలను ప్రామాణికంగా తీసుకొని 13గా ఉన్న ఉమ్మడి జిల్లాలను పునర్వ్యవస్థీకరించి 26గా విభజించింది. ఇందులో కొన్ని జిల్లాలు, వాటి కేంద్రాలు, రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటు పూర్తిగా వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగిందన్న విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలను ఏర్పాటు చేసిన తర్వాత వాటిని 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చాలి. రాష్ట్ర విభజన సమయంలో 2014 నాటికి ఏపీకి 13 జిల్లాలున్నాయి. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను ఆ మేరకు సవరించారు. ఇప్పుడు ఈ ఉత్తర్వు ఆధారంగానే ఉద్యోగ నియామకాలు, బదిలీలు, విశ్వవిద్యాలయ ప్రవేశాలు, ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అంటే, ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగానే అన్నీ అమలవుతున్నాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసి మొత్తం 26 ఏర్పాటు చేసినప్పుడు ఆ విషయాన్ని తిరిగి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చాలి. దీనికోసం జగన్ ప్రభుత్వం కేంద్రానికి

మిగతా 11వ పేజీలో...



రష్యా ఎయిర్‌బేస్‌లో కాలిపోతున్న విమానం

రష్యా గడ్డ మీది నుంచే రష్యాపై భీకర దాడులు

ఎయిర్‌బేస్‌లే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ల బీభత్సం

41 రష్యన్ యుద్ధ విమానాల ధ్వంసం

4 వేల కిలోమీటర్ల దూరంలోని సైబీరియాలోనూ లక్ష్యాలను ఛేదించిన డ్రోన్లు

ఏ-50 అవాక్స్‌పైనా విధ్వంసక దాడి

18 నెలలుగా వ్యూహాత్మక ఆపరేషన్

ట్రక్కుల్లో ఎఫ్‌పీవీ డ్రోన్లను పంపిన ఉక్రెయిన్

పార్క్ చేసిన ట్రక్కులు, ఇళ్లపైన మోహరింపు

రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసిన ఎస్‌బీయూ

ఉక్రెయిన్‌పై రష్యా ప్రతీకార దాడులు

12 మంది ఉక్రెయిన్ సైనికుల మృతి

రష్యాలో కూలిన 2 రైలు వంతెనలు

గూడ్స్, ప్రయాణికుల రైళ్లకు ప్రమాదం

ఉక్రెయిన్ పనేనని అనుమానం

కీవ్, జూన్ 1: ఉక్రెయిన్‌ను వారంరోజుల్లో చుట్టేస్తామంటూ మూడేళ్ల క్రితం యుద్ధానికి దిగిన రష్యాకు ఆదివారం పెద్ద దెబ్బే తగిలింది. ఈ యుద్ధం 1,192వ రోజుకు చేరుకోగా.. 'ఆపరేషన్ వెబ్' పేరుతో రష్యా గడ్డ మీది నుంచే ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడుల్లో రష్యాలోని నాలుగు ఎయిర్‌బేస్‌లు టార్గెట్ అయ్యాయి. 18 నెలలుగా ఆ ఆపరేషన్‌ను వ్యూహాత్మకంగా కొనసాగించి, ట్రక్కుల్లో రష్యాకు డ్రోన్లను పంపిన ఉక్రెయిన్.. మోడ్రన్ వార్‌ఫేర్‌లో తనదైన ముద్రవేస్తూ.. రిమోట్ కంట్రోల్‌తో ఆకస్మిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 41 రష్యా యుద్ధ విమానాలను బుల్లి(ఎఫ్‌పీవీ కామికాజి) డ్రోన్లు తుత్తునియలు చేశాయి. ఉక్రెయిన్ సరిహద్దుల నుంచి 700 కిలోమీటర్లు మొదలు.. 4వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే నాలుగు ఎయిర్‌బేస్‌లు-- బెలాయా, డియాగిలెవ్, ఒలేన్యా, ఇవానోవోపై ఆదివారం ఉదయం ఉక్రెయిన్ ముప్పేట

మిగతా 2వ పేజీలో...

సుఖోయ్ చక్రాలపై జగన్నాథుడు



» కోల్‌కతాలోని ఆలయ రథానికి యుద్ధ విమానం టైర్లు

కోల్‌కతా, జూన్ 1: కోల్‌కతాలోని జగన్నాథ ఆలయ రథానికి సుఖోయ్ యుద్ధ విమానం కోసం తయారు చేసిన టైర్లను వాడనున్నారు. ఈ నెల 27న కోల్‌కతాలో జరిగే జగన్నాథ రథయాత్ర కోసం రథాన్ని సరికొత్తగా సిద్ధం చేశారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత జగన్నాథ రథానికి బోయింగ్ విమానం టైర్ల స్థానంలో సుఖోయ్ కోసం తయారు చేసిన టైర్లు వచ్చాయి. ఇంతకు ముందు బోయింగ్ 747 విమానం టైర్లను రథానికి వాడేవారు. టైర్లను మార్చాలని 2005లో రథయాత్ర నిర్వాహక సంస్థ ఇస్కాన్ నిర్ణయించింది. కొత్త చక్రాల కోసం 20 ఏళ్లు అన్వేషించామని ఇస్కాన్ (కోల్‌కతా) ఉపాధ్యక్షుడు రాధారామ్ దాస్ వెల్లడించారు. 9టన్నుల బరువున్న రథానికి పలు కంపెనీల టైర్లు పరిశీలించినా కుదరలేదన్నారు. సుఖోయ్ టైర్ల కోసం 2018లో తయారీ సంస్థ ఎంఆర్‌ఎఫ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించామని, గతేడాది ఆ సంస్థ ప్రతినిధులు అందుబాటులోకి వచ్చారని చెప్పారు. భారత వాయుసేనకు మాత్రమే ఈ టైర్లను సరఫరా చేస్తామని తొలుత వారు చెప్పారని వివరించారు. సమస్యను తెలియజేయడంతో టైర్లు ఇవ్వడానికి అంగీకరించారన్నారు. క్రితం నాలుగు టైర్లను డెలివరీ చేశారని, వాటి ధర 1.80 లక్షల రూపాయలని రాధారామ్ వెల్లడించారు.

ప్రియుడి లాటరీ సొమ్ము
30 కోట్లతో ప్రియురాలు పరారీ

కొత్త ప్రియుడితో వెళ్లిపోయిన మహిళ

కెనడా, జూన్ 1: కెనడాకు చెందిన ఓ వ్యక్తి లాటరీలో జాక్‌పాట్ కొట్టాడు. 3.6 మిలియన్ డాలర్లు అంటే దాదాపుగా రూ.30 కోట్లు గెలిచాడు. కానీ, ఏం లాభం.. ఆ డబ్బుతోపాటు ప్రాణంగా ప్రేమించిన ప్రియురాలిని ఒకేసారి కోల్పోయాడు. ఆ ప్రియురాలేం చనిపోలేదు.. ఉన్న ప్రియుడికి హ్యాండిచ్చి ఆ రూ.30 కోట్లు తీసుకుని కొత్త ప్రియుడితో చెక్కేసింది. దీంతో ప్రియురాలి అసలు రంగు బయటపడగా లబోదిబోమంటున్న బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తనను మోసం చేసిన మహిళ నుంచి తన డబ్బు తనకి ఇప్పించమని కోరాడు. కెనడాలోని వెన్నిపెగ్‌కు చెందిన లారెన్స్ కాంపెల్ 2024లో కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌కు రూ.30 కోట్ల ప్రైజ్‌మనీ వచ్చింది. గుర్తింపు వివరాలు, బ్యాంకు ఖాతా లేక పోవడంతో లారెన్స్. లాటరీ సంస్థ సూచనల మేరకు బహుమతి సొమ్మును ఏడాదిన్నరగా తనతో కలిసి ఉంటున్న ప్రియురాలు మెక్‌కే ఖాతాలో జమ చేయించాడు. ఆ తర్వాత ఆమె మొత్తం డబ్బు తీసుకుని మరొక ప్రియుడితో పరారైంది.



తిరువణ్ణామలై ఆలయం వద్ద ఘర్షణ

» ఆంధ్ర, కర్ణాటక భక్తుల పరస్పర దాడులు

» 20 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

చెన్నై, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయం వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఘర్షణలో 20 మందికి పైగా గాయపడ్డారు. ఆదివారం కావడంతో.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఈ ఆలయానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో.. దుయం ఉన్నామలై అమ్మన్ సన్నిధి వద్ద తోపులాట జరిగి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకకు చెందిన భక్తుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘర్షణలో 20 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని పోలీసులు తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తిది ఏ రాష్ట్రమో గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఆర్మీలో క్రమశిక్షణే ముఖ్యం.. మతం కాదు

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూన్ 1: సైనిక దళాలు వాటి యూనిఫారం ద్వారా కలిసి ఉంటాయే తప్ప మతం కారణంగా విడిపోవని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రతివారం రెజిమెంట్‌లో నిర్వహించే మతపర పరేడ్‌లో ఆ దళ సభ్యులు అందరూ పాల్గొనడం విధుల్లో భాగమేనని, దాన్ని ఉల్లంఘించడం క్రమశిక్షణరాహిత్యం కిందకే వస్తుందని తెలిపింది. మతపర పరేడ్‌లో పాల్గొనడానికి ఇష్టపడని ఓ క్రైస్తవ ఆర్మీ అధికారిని విధుల నుంచి తొలగించడం సబబేనని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శైలీందర్ కౌర్‌తో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. ఆ అధికారి విధులు నిర్వర్తించే రెజిమెంట్‌లో గురుద్వారా, మందిరం ఉన్నాయి. విధుల్లో భాగంగా జవాన్లు ప్రతివారం ఆ గుడిలోకి వెళ్లి పూజలు చేసి, మతపర పరేడ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ట్రూప్ లీడర్‌గా ఆ అధికారే తన కింద పనిచేసే జవాన్లను గుడికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే తాను క్రిస్టియన్‌ను అయినందున అలాంటి పూజలు చేయలేనని, తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారులు నిరాకరించారు. 2021 మార్చి 3న ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

ఉపాధ్యాయుడు మందలించడం.. ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూన్ 1: ఉపాధ్యాయుడు విద్యార్థిని మందలించడం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు తమిళనాడులో ఒక టీచర్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. ఓ పాఠశాల హాస్టల్ ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు మరో విద్యార్థి ఫిర్యాదు మేరకు బాధిత విద్యార్థిని మందలించాడు. ఈ ఘటన అనంతరం ఆ విద్యార్థి గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్రాస్ హైకోర్టు ఉపాధ్యాయుడిపై ఆత్మహత్యకు ప్రేరేపించిన ఆరోపణలను కొట్టివేయడానికి నిరాకరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ పీకే మిశ్రా బెంచ్ హైకోర్టు తీర్పును పక్కన పెట్టింది.

నాసా చీఫ్ ఎంపికలో ట్రంప్ యూటర్న్

వాషింగ్టన్, జూన్ 1: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) చీఫ్ పదవికి స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాపార సహచరుడు, బిలియనీర్, ప్రైవేట్ వ్యోమగామి జేర్డ్ ఐజాక్‌మన్‌ను నామినేట్ చేస్తూ తాను గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. గతంలో ఐజాక్‌మన్‌కు ఇతర సంస్థలతో ఉన్న సంబంధాలను సమగ్రంగా సమీక్షించిన తరువాత తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. త్వరలోనే నూతన నామినీని ప్రకటిస్తానని ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు.

థాయ్‌లాండ్‌లో బలవంతపు
వ్యభిచారం బాధాకరం

» అక్కడి మహిళలకు సమానత్వం కోసం కృషి చేస్తా

» 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్-2025 ఓపల్ సుచాత



హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలను ప్రచారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మిస్ వరల్డ్ వంటి గొప్ప కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిందని, ఇలాంటి ప్రచారమే థాయ్‌లాండ్‌లో చేయాల్సి ఉందని మిస్ వరల్డ్-2025 ఓపల్ సుచాత షుంగ్‌సిరి అన్నారు. తాను కోరుకున్న టైటిల్ సొంతమైందని, ఇప్పుడు దేశమే తన ప్రాధాన్యమని స్పష్టం చేశారు. థాయ్‌లాండ్‌లో తన సోదరీమణులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తెలుసని చెప్పారు. ప్రస్తుతం మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నానని, ఇక నుంచి తన ప్రాధాన్యాలు మరింత పెరగనున్నాయని స్పష్టం చేశారు. స్వదేశానికి వెళ్లిన వెంటనే అక్కడి మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేయాల్సి ఉందని తెలిపారు. మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న అనంతరం సుచాత తన ప్రాధాన్యాల గురించి 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు

పర్యాటకులు అందుకే వస్తున్నారు..: దాదాపు ఏడున్నర కోట్ల జనాభా ఉన్న థాయ్‌లాండ్‌లో సెక్స్ ట్రాఫికింగ్(బలవంతపు వ్యభిచారం) అతిపెద్ద సమస్య. 15-25 ఏళ్ల అమ్మాయిల అక్రమ రవాణా కొన్ని దశాబ్దాలుగా సాగుతోంది. బాలికలను బలవంతంగా వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారు. మా దేశానికి వచ్చే పర్యాటకులు సైతం అందుకోసమే వస్తున్నారు. వారి ఆలోచన మారాలి. హైదరాబాద్ విమానాశ్రయంలో అడుగు పెట్టినప్పటి నుంచి నేను గమనించిన కీలక విషయం పోలీసింగ్. ఇక్కడ పురుషులతో సమానంగా మహిళలున్నారు. 25 రోజులుగా నాకు భద్రతగా మహిళలే ఉండటం చాలా సంతోషం. థాయ్‌లాండ్‌లో ఇలాంటి పరిస్థితి లేదు. అక్కడ మహిళలకు సమాన హక్కులు లేవు. పాఠశాల రోజుల నుంచి రాజకీయాలంటే నాకు ఆసక్తి. ఈ పోటీల్లోకి రాకుంటే తప్పకుండా రాజకీయాల్లో ఉండేదాన్ని. ఇప్పుడు రాజకీయ సంస్కరణల కోసం నా విజయాన్ని అవకాశంగా ఉపయోగించుకుంటా. గత నాలుగేళ్లలో రెండుసార్లు మిస్ యూనివర్స్ పోటీలకుగా ఎంపికయ్యా. 2022లో మూడో రన్నరప్‌గా నిలవగా.. గతేడాది మొదటి రన్నరప్‌గా నిలిచా. రెండుసార్లు అవకాశం కోల్పోయినా.. మిస్ వరల్డ్ లాంటి గొప్ప అవకాశం సాధిస్తానన్న నమ్మకం ఉండేది. ఇందులో పాల్గొనాలంటే మిస్ యూనివర్స్ రన్నరప్‌గా గతేడాది లభించిన అవకాశాలన్నీ వదులుకోవాలి. అయినప్పటికీ గెలుస్తానన్న నమ్మకంతోనే ఇక్కడికి వచ్చా. ఫినాలేలో నాకెంతో ఇష్టమైన మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్‌ను కలిశాను. అలాగే మాజీ ప్రపంచ సుందరి ప్రియాంక చోప్రా అంటే నాకు చాలా ఇష్టం. 'బాహుబలి' చిత్రం గురించి విన్నాను. కానీ చూడలేదు. పోటీలు పూర్తయ్యాక ఆ సినిమా చూడాలని నాకు నేను ప్రామిస్ చేసుకున్నా. మరోసారి ఇక్కడికి వచ్చేటప్పటికి ఆ సినిమాపై తప్పకుండా రివ్యూ ఇస్తా. అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాల్లో నటించడానికి సిద్ధం.

రష్యా గడ్డ మీది నుంచే రష్యాపై
భీకర దాడులు



ఉక్రెయిన్ దాడిలో ధ్వంసమైన రష్యాలోని ఓ ఎయిర్‌బేస్

మొదటి పేజీ తరువాయి)

దాడులు చేసింది. వీటిల్లో బెలాయా ఎయిర్‌బేస్ ఉక్రెయిన్ సరిహద్దులకు 4 వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే ఇర్కుట్స్క్ రీజియన్‌లో ఉండడం గమనార్హం.! "రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణుల, డ్రోన్లను ఉపయోగించుకోవచ్చు" అంటూ పాశ్చాత్య దేశాల నుంచి అనుమతి వచ్చిన వెంటనే.. రష్యా అవాక్కయ్యేలా ఉక్రెయిన్ క్షిపణులతో కాకుండా.. ఆ దేశ గడ్డ మీద నుంచే చిన్న డ్రోన్లతో దాడులు జరపడం గమనార్హం.! ఈ దాడులను ఉక్రెయిన్ అధికారిక వార్తాసంస్థ 'ఉక్రిఇన్ఫాం'తోపాటు.. రష్యా వార్తా సంస్థ ఏఎఫ్‌పీ, ఆర్టీ కూడా నిర్ధారించాయి. ఇర్కుట్స్క్ గవర్నర్ ఐగర్ కొబ్జెవ్‌తోపాటు.. రియాజన్, ముర్మన్స్క్ రీజియన్ల అధికారులు కూడా ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిగిన విషయాన్ని అంగీకరించారు. పైన పేర్కొన్న ఎయిర్‌బేస్‌లలో.. డ్రోన్ దాడుల తర్వాత కాలిపోతున్న రష్యన్ యుద్ధ విమానాల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'ఆపరేషన్ వెబ్'తో ఒక ఏ-50 (అవాక్స్) విమానం సహా.. టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్ విమానాలు.. మొత్తం 41 యుద్ధ విమానాలు బుగ్గిపాలయ్యాయి. బెలయా ఎయిర్‌ఫీల్డ్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఒక్కో టీయూ-22ఎం3 బాంబర్ ధర రూ.2,505 కోట్లు, టీయూ-95 బాంబర్ ధర రూ.1,361 కోట్లుగా ఉంటుందని అంచనా. దీన్ని బట్టి.. ఉక్రెయిన్ దాడుల్లో రష్యాకు రూ. వేల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు స్పష్టమవుతోంది. ఈ ఆపరేషన్‌ను ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్(ఎస్‌బీయూ) నిర్వహించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

రష్యా ప్రతీకార దాడులు..

ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రగిలిపోయిన రష్యా.. ఆదివారం ఉదయం నుంచి ఉక్రెయిన్‌పై 83 సార్లు వేర్వేరు దాడులు జరిపింది. ఖార్కివ్, కుపియాంక్, లైమన్, టోరెట్స్క్, క్రామాటోర్స్క్, పోక్రోవ్స్క్, నోవోపావ్లివ్కాల్లో మధ్యాహ్నం నుంచి పలు విడతలుగా డ్రోన్, క్షిపణి దాడులు జరిపింది. ఈ మూడేళ్ల యుద్ధంలో రష్యా ఒక్కరోజే 472 డ్రోన్లతో దాడి చేయడం ఇదే మొదటి సారి అని ఉక్రెయిన్ వైమానిక దళం చెప్పింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు 300కు పైగా డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఖార్కివ్, పిహోల్కివ్కా ప్రాంతాల్లో ఉక్రెయిన్, రష్యా పదాతిదళాల మధ్య భీకరంగా కాల్పులు జరుగుతున్నట్లు జనరల్ స్టాఫ్ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం సాయంత్రం నుంచి రష్యా దాడుల తీవ్రత పెరిగినట్లు 'ఉక్రిఇన్ఫాం' వరుస బ్రేకింగ్‌లు ఇచ్చింది. రాత్రి సుమారు అరగంట పాటు రాజధాని నగరం కీవ్‌లో సైరన్ల మోత వినిపించిందని, కుపియాంక్, స్టెపోవా, నోవోసెలివ్కా, నోవా క్రుగ్లియాకివ్కా ప్రాంతాల్లో ఆరుకుపైగా క్షిపణి దాడులు జరిగినట్లు వివరించింది. ఆదివారం ఉదయం రష్యా సరిహద్దులకు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉండే సుమీ రీజియన్‌లోని ఒలెక్సివ్కాలోని ఉక్రెయిన్ గ్రౌండ్ ఫోర్సెస్‌పై దాడులు జరిగాయని పేర్కొంది. ఈ దాడుల్లో 12 మంది సైనికులు మృతిచెందగా.. మరో 60 మంది క్షతగాత్రులైనట్లు తెలిపింది.



రష్యాలోని ఓ ప్రాంతంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి

రష్యాలో కూలిన రెండు రైలు వంతెనలు

ఉక్రెయిన్ పనేనని అనుమానం

మాస్కో, జూన్ 1: రష్యాలో 24 గంటల వ్యవధిలో రెండు వంతెనలు కూలి రైలు ప్రమాదాలు జరగడం అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం గూడ్సు రైలు ప్రయాణిస్తున్న సమయంలోనే ఓ వంతెన కూలింది. శనివారం కూడా ప్రయాణికుల రైలు వెళ్తున్న సమయంలోనే మరో వంతెన కుప్పకూలింది. ఇందుకు ఉక్రెయినే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉక్రెయిన్‌కు సరిహద్దులో ఉన్న కుర్స్క్ ప్రాంతంలో గూడ్సు రైలు ప్రమాదం జరిగింది. రైలులోని కొంత భాగం కిందనున్న రోడ్డుపై పడింది. డ్రైవర్ గాయపడ్డట్టు సమాచారం అందింది. పేలుడు కారణంగానే ఈ బ్రిడ్జి కూలినట్టు రష్యాకు చెందిన ఇంటర్‌ఫ్యాక్స్ ఏజెన్సీ తెలిపింది. శనివారం రాత్రి బ్రైన్స్క్ ప్రాంతంలో కూడా వంతెన కుప్పకూలడంతో అదే సమయంలో దానిపై నుంచి వెళ్తున్న మాస్కో- క్లిమోవ్ రైలు ప్రమాదానికి గురయి పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించగా, 69 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో రైలు డ్రైవరు కూడా ఉన్నారు. చీకట్లో ప్రయాణికులు ఒకరినొకరు సహాయం చేసుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఉక్రెయిన్ ఉగ్రవాదులకు నిలయంగా మారిందని, అందుకే వంతెనలను పేల్చివేస్తోందని రష్యాకు చెందిన సీనియర్ సెనేటర్ ఒకరు ఆరోపించారు.

దాడులకు ఉక్రెయిన్ 18 నెలల కార్యాచరణ

ఉక్రెయిన్ వద్ద అధునాతన దీర్ఘశ్రేణి క్షిపణులున్నాయి. అయితే.. వాటిని రష్యా భూభాగంపై ప్రయోగించకూడదని పాశ్చాత్య దేశాలు ముందుగానే షరతు విధించాయి. దీంతో.. రష్యా గడ్డ మీది నుంచే ఆ దేశాన్ని దెబ్బతీయాలని ఎస్‌బీయూ నిర్ణయించింది. 18 నెలల క్రితమే 'ఆపరేషన్ వెబ్'కు శ్రీకారం చుట్టింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు/ సుప్రీం కమాండర్-ఇన్-చీఫ్ జెలెన్‌స్కీ ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తూ వచ్చారు. వేర్వేరు దేశాల నుంచి రష్యాకు వెళ్లే ట్రక్కులనే డ్రోన్లను చేరవేయడానికి ఎస్‌బీయూ పథకం పన్నింది. రష్యాలో.. ఉక్రెయిన్‌కు సుదూరంగా ఉండే ఎయిర్‌బేస్‌ల వరకు వాటిని తరలించింది. రష్యా ఫెడరల్ భూభాగంలో ట్రక్కులపైన రిమోట్‌తో తెరుచుకునే చెక్క పెట్టెల్లో.. ఇళ్ల పైకప్పులపైన మోహరించింది. అందుకే గతంలో ఉక్రెయిన్ సైన్యం 'లాజిస్టిక్ కోణంలో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను నిర్వహిస్తాం' అని ప్రకటించింది. ఎఫ్‌పీవీ డ్రోన్లు సైజులో చిన్నగా ఉన్నా.. దాడి జరిగే వరకు టార్గెట్ల వీడియోను స్పష్టంగా చిత్రీకరిస్తాయి. ఉక్రెయిన్ ఎస్‌బీయూ కమాండ్ కంట్రోల్‌కు సమాచారాన్ని చేరవేస్తాయి. కమాండ్ కంట్రోల్ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా దాడులు జరపడమేకాకుండా.. టార్గెట్‌పై ఆత్మాహుతి దాడి చేస్తాయి. ఆదివారం రిమోట్ ద్వారా డ్రోన్ల పైకప్పులను తొలగించిన ఎస్‌బీయూ.. ఏకకాలంలో వాటిని ప్రయోగించి, రష్యాకు చెందిన నాలుగు వైమానిక స్థావరాలకు కోలుకోలేని దెబ్బ కొట్టింది.

పెళ్లాడి, గర్భవతిని చేసి
ముఖం చాటేసి

» వీసా ఇప్పిస్తానని హైదరాబాద్ యువతిని యూఏఈలో మోసం చేసిన పాక్ వ్యక్తి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విజిట్ వీసాపై యూఏఈ వెళ్లిన హైదరాబాద్ యువతిపై అక్కడ పాకిస్థాన్ యువకుడు కన్నేశాడు. ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకుని ఆమెను గర్భవతిని చేశాడు. వీసా గడువు ముగియడంతో ఆమెను హైదరాబాద్‌కు పంపి అతడు ముఖం చాటేశాడు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని టోలిచౌకికి చెందిన... దోమలగూడకు చెందిన 22 ఏళ్ల యువతి గత ఏడాది విజిట్ వీసాపై యూఏఈకి వచ్చింది. అబుదాబీలోని సూపర్ మార్కెట్‌లో పని చేసే ఆమెకు పాకిస్థాన్ యువకుడు(30) పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. తల్లిదండ్రులు లేని ఆమె పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు రెగ్యులర్ వీసాను ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి ఆమెను అబుదాబీ న్యాయ స్థానంలో పెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలల కాపురం అనంతరం ఆమె గర్భం దాల్చింది. అయితే, ఆమె విజిట్ వీసాను రెన్యువల్ చేయకుండా యువకుడు తప్పుదారి పట్టించాడు. తాను శాశ్వత వీసా పంపిస్తానని మభ్యపెట్టి ఆమెను హైదరాబాద్‌కు పంపించాడు. నెలలు గడుస్తున్నా యువతికి వీసా రాలేదు. యువకుడిని గట్టిగా నిలదీయడంతో ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో ఆమె మోసపోయానని గ్రహించింది. అదే సమయంలో తాను గర్భవతినని తెలుసుకుని ఆందోళనకు గురైంది. శతవిధాలుగా ప్రయత్నాలు చేసిన అనంతరం యువకుడు అందుబాటులోకి వచ్చాడు. విజిట్ వీసా గడువు ముగిసిన తర్వాత వెళ్లినందున మళ్లీ యూఏఈకి రావడానికి నిబంధనలు ఒప్పుకోవని, పొరుగున ఉన్న ఖతార్‌కు వస్తే తాను కలుస్తానని చెప్పాడు. దీంతో ఆమె హైదరాబాద్ నుండి రెండు రోజుల వీసాపై ఖతార్ వచ్చింది. యువకుడికి ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో మళ్లీ మోసపోయానని గ్రహించింది. సహాయం కోసం భారత ఎంబసీకి పరిగెత్తింది. అధికారుల సూచనతో ఆ యువతి శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లిపోయింది.

'సోషల్' ఇన్‌ఫ్లుయెన్సర్
శర్మిష్ఠ పనోలీ అరెస్టు



» 'ఆపరేషన్ సిందూర్'పై స్పందించని బాలీవుడ్ నటులపై అనుచిత పోస్టు

» తీవ్ర విమర్శలతో డిలీట్ చేసి క్షమాపణ

» అయినా ఆమెపై కోల్‌కతా పోలీసుల కేసు

» గురుగ్రామ్‌లో అదుపులోకి..

గురుగ్రామ్/కోల్‌కతా, జూన్ 1: సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలీ(22)ని కోల్‌కతా పోలీసులు అరెస్టుచేశారు. పాకిస్థాన్, దాని ప్రేరిత ఉగ్రవాదులపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై నోరువిప్పని బాలీవుడ్ నటులపైన, మహమ్మద్ ప్రవక్తపైన ఆమె గత నెల 14న అనుచితంగా పోస్టు పెట్టారు. పాక్ పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారని బాలీవుడ్ సెలబ్రిటీలు, యూట్యూబర్ రణవీర్ అల్లాబాదియాపై అందులో దూషించారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఆ పోస్టుతోపాటు తన ఇన్‌స్టా అకౌంట్‌లోని కంటెంట్ మొత్తాన్నీ మర్నాడే ఆమె డిలీట్ చేశారు. అయినా కోల్‌కతా పోలీసులు ఆమెపై కేసు నమోదుచేశారు. సమాజంలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచడం., మత భావనలను రెచ్చగొట్టడం.. ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతికి భంగం కలిగించడం వంటి అభియోగాలు మోపారు. శుక్రవారం రాత్రి హరియాణాలోని గురుగ్రామ్‌లో అరెస్టు చేశారు. ట్రాన్సిట్ రిమాండ్‌పై ఆమెను శనివారం కోల్‌కతా కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆమెకు రెండు వారాలు అంటే జూన్ 13 దాకా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పుణే న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం 'లా' విద్యార్థిని అయిన శర్మిష్ఠకు 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్‌లో 1,75,000 మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆమె అరెస్టుపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మమతా బెనర్జీ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులపై బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్, బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ తదితరులు తీవ్ర విమర్శలు చేశారు. అయితే అరెస్టులో తాము చట్టప్రక్రియను పాటించామని కోల్‌కతా పోలీసులు ఆదివారం వివరణ ఇచ్చారు.

మరి వారి మాటేంటి?

» మరి సనాతన ధర్మాన్ని 'కలుషిత ధర్మం' అన్న వారిపై చర్యలు తీసుకోలేదేం?: పవన్


శర్మిష్ఠ పనోలీ అరెస్టును ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆక్షేపించారు. లౌకికవాదం అనేది రెండు వైపులా రాకపోకలు సాగించే రోడ్డులా ఉండాలని 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 'న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ వాడిన భాష, మాటలు విచారకరం. కొందరికి మనస్తాపం కలిగించేలా ఉన్నాయి. ఆమె తన తప్పు తెలుసుకుని పోస్టును డిలీట్ చేసి.. బహిరంగ క్షమాపణ చెప్పారు. అయితే బెంగాల్ పోలీసులు వేగంగా స్పందించి ఆమెపై చర్య తీసుకున్నారు. మరి సనాతన ధర్మాన్ని అవహేళన చేసి కోట్ల మంది మనసులను టీఎంసీ ఎంపీలు, ఎన్నికైన నేతలు గాఢంగా గాయపరచినప్పుడు వారు ఏం చేశారు? మన ధర్మాన్ని కలుషిత ధర్మమని (మమతా బెనర్జీ) వ్యాఖ్యానించినప్పుడు ఇంత గగ్గోలు పెట్టలేదేం? వాళ్ల క్షమాపణలేవీ? సత్వర అరెస్టులేవీ' అని నిలదీశారు. 'దైవ నింద ఎల్లప్పుడూ ఖండనార్హం. అయితే లౌకికవాదం అనేది కొందరికి రక్షణ కవచంలా, ఇంకొందరిపై ఖడ్గంలా ఉండకూడదు. పశ్చిమ బెంగాల్ పోలీసులూ.. అందరి పట్లా న్యాయంగా వ్యవహరించండి' అని సూచించారు. ఆయన పోస్టును బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి 'ఎక్స్'లో షేర్ చేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై వ్యాసరచన పోటీలు

ఎంట్రీలను ఆహ్వానించిన రక్షణశాఖ.. ముగ్గురు విజేతలకు రూ.10 వేల నగదు బహుమతి

న్యూఢిల్లీ, జూన్ 1: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై రక్షణశాఖ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ఈ నెల ఒకటో తేదీ (ఆదివారం) నుంచి 30 వరకూ ఆసక్తి గల వారు ఈ వ్యాస రచన పోటీల్లో పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో విజేతలైన ముగ్గురికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతితోపాటు వారికి ఆగస్టు 15న ఎర్రకోట వద్ద జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం ఉంటుంది. 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ విధానాన్ని పునర్నిర్వచించిన ఆపరేషన్ సిందూర్' అనే పేరుతో ప్రతి ఒక్కరూ ఒక్క ఎంట్రీ మాత్రమే పంపాల్సి ఉంటుందన్న రక్షణశాఖ.. హిందీ లేదా ఇంగ్లీష్‌లో మాత్రమే వ్యాసం రాయాల్సి ఉంటుందని ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. పోటీదారులు తమ ఎంట్రీలను రక్షణ మంత్రిత్వశాఖ లేదా మైగవ్ ఇండియా వెబ్‌సైట్‌లకు పంపాల్సి ఉంటుంది.

ప్రతీ పదంపై నిఘా..
5 నిమిషాలకో స్క్రీన్‌షాట్



» ప్రజలు ఏ యాప్ చూస్తున్నదీ, ఏమేం చేస్తున్నదీ అధికారులకు తెలిసిపోయేలా రహస్య ఏర్పాట్లు

» ఉత్తర కొరియా నుంచి స్మగుల్ అయిన స్మార్ట్‌ఫోన్‌ను పరిశీలించి బీబీసీ కథనం

న్యూఢిల్లీ, జూన్ 1: మన ఫోన్‌లో ఏదైనా మన వ్యక్తిగతం.. సోషల్ మీడియా మొదలు అంతర్జాతీయ వెబ్‌సైట్ల దాకా అందులో ఏం చూసేదీ మనిష్టం. కానీ ఉత్తరకొరియాలో మాత్రం ఫోన్ అంటే ఓ నిఘా సాధనం. ఫోన్‌లో ఏం చూస్తున్నదీ, ఏం చేస్తున్నదీ క్షణక్షణం ప్రభుత్వానికి తెలిసిపోతుంది. చివరికి ఫోన్‌లో టైప్ చేసే పదాలపైనా నిఘా ఉంటుంది. ఆ పదాలు ఆటోమేటిగ్గా వేరే పదాల కింద మారిపోతాయి. ఉత్తరకొరియా నుంచి బయటికి స్మగ్లింగ్ చేసిన ఒక స్మార్ట్ ఫోన్‌ను క్షుణ్నంగా పరిశీలించిన బీబీసీ ఆ వివరాలతో ఓ కథనం ప్రచురించింది. ఉత్తర కొరియాలో స్మార్ట్‌ఫోన్లన్నీ ప్రత్యేకంగా ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయి. సమాచారం ఏదైనా ఆటోమేటిగ్గా సెన్సార్ అవుతుంది. ముఖ్యంగా దక్షిణ కొరియాకు చెందిన భాష, సంస్కృతి, ఇతర అంశాలపై నిషేధం ఉంటుంది. ఉదాహరణకు ఫోన్‌లో దక్షిణ కొరియా అని టైప్ చేస్తే.. దానంతట అదే 'పప్పెట్ స్టేట్ (తోలుబొమ్మ దేశం)' అని మారిపోతుంది. అమెరికా చెప్పినట్టల్లా ఆడే పప్పెట్ స్టేట్ దక్షిణ కొరియా అని ఉత్తరకొరియా నియంతృత్వ పాలకుడు కిమ్‌జోంగ్ ఉన్ తరచూ విమర్శిస్తుంటారు. ఇక దక్షిణ కొరియాలో మగ స్నేహితులను పిలిచే 'ఒప్పా' అనే పదం టైప్ చేస్తే.. 'కామ్రేడ్'గా మారిపోతుంది. 'తోటివారిని పిలిచేందుకు కేవలం ఈ పదం మాత్రమే వాడాలి' అనే హెచ్చరిక కూడా కనిపిస్తుంది. అంతేకాదు.. ప్రతి ఐదు నిమిషాలకోసారి ఫోన్ దానంతట అదే స్క్రీన్‌షాట్ తీసుకుని, రహస్య ఫోల్డర్‌లో సేవ్ చేస్తుంది. ఫోన్ వాడేవారు వాటిని చూడలేరు. కేవలం ప్రభుత్వ అధికారులకు మాత్రమే యాక్సెస్ ఉంటుంది.


ప్రభుత్వం అనుమతించిన సమాచారమే దిక్కు..

ఉత్తర కొరియాలో ఫోన్లతోపాటు రేడియోలు, టీవీలు కూడా కేవలం ప్రభుత్వం అనుమతించిన కంటెంట్ మాత్రమే అందేలా ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయి. ఫోన్లలో పరికరాలను మార్చడానికి వీలు లేకుండా సీల్ చేస్తారు. దీనిని మార్చడానికిగానీ, విదేశాల కంటెంట్‌ను చూడటానికి గానీ ప్రయత్నిస్తే తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. దక్షిణ కొరియాకు చెందిన కె-పాప్ వీడియోలు, సినిమాలను చూసినందుకు, ఇతరులకు పంపినందుకు ఇటీవల ఓ 22 ఏళ్ల యువకుడిని అధికారులు బహిరంగంగా కాల్చిచంపారు. ఈ నియంత్రణలతో ఉత్తర కొరియా ప్రజలకు బయటి ప్రపంచంలో ఏం జరుగుతోందో, పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలిసే అవకాశం ఉండదు.



ప్రమాదంలో గోరుకల్లు రిజర్వాయర్!

గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రాతిపరుపు జారిపోయిన దృశ్యం



గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 3.26 కి.మీల వద్ద కుంగిపోయిన రాతిపరుపు

- నీటిలోకి కుంగుతున్న కీలకమైన రాతిపరుపు
- నాలుగు చోట్ల గుర్తింపు.. పెరుగుతున్న విస్తీర్ణం
- వైసీపీ ప్రభుత్వంలో రెండుచోట్ల కుంగిన మట్టికట్ట
- నాడు తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చిన వైనం
- బ్యాలెన్స్ పనులు, మరమ్మతులకు 58 కోట్లు అవసరం
- సీడీవో బృందం తనిఖీ.. పలు సూచనలు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమ జలనాడి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉంది. కీలకమైన మట్టి ఆనకట్ట రాతి పరుపు (స్టోన్ రివెట్‌మెంట్) కుంగిపోతోంది. నాలుగు చోట్ల రాతిపరుపు నీటిలోకి జారిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మట్టి ఆనకట్ట పనులను అసంపూర్తిగా వదిలేశారు. రాతి పరుపు, మట్టి మధ్యలో వర్షపు నీరు చేరుతుండడంతో శాండ్ ఫిల్టర్ మీడియా దెబ్బతిని (వాష్‌అవుట్) స్టోన్ రివెట్‌మెంట్ జారిపోతోందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఈ నెల 13న సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ శివశంకర్‌రెడ్డి బృందం రిజర్వాయర్‌ను తనిఖీ చేసింది. మట్టికట్ట బ్యాలెన్స్ పనులు, అప్‌టెక్ స్లూయిస్, జలాశయం డౌన్ స్ట్రీమ్ డ్రైన్ నిర్మాణం తక్షణమే చేపట్టాలని పలు సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో బ్యాలెన్స్ మట్టికట్ట, అప్‌టెక్ (ఓటీ) నిర్మాణం, శాశ్వత మరమ్మతులకు ఇంజనీర్లు రూ.58 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక మరమ్మతులకు నంద్యాల కలెక్టర్ జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి రూ.2.50 కోట్ల నిధులు ఇచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాలని రాయలసీమ సాగునీటి రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

కుంగుతున్న మట్టికట్ట రాతిపరుపు


గోరుకల్లు రిజర్వాయర్ లైవ్ కెపాసిటీ 10.29 టీఎంసీలు కాగా.. డెడ్ స్టోరేజ్ కెపాసిటీ 2.15 టీఎంసీలు. గరిష్ఠ నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) 261 మీటర్లు. ఆనకట్ట పొడవు 3.46 కిలోమీటర్లు కాగా, 1.90 కిలోమీటర్లు మట్టి ఆనకట్ట, 1.56 కిలోమీటర్లు సిమెంట్ కాంక్రీట్ ఆనకట్ట నిర్మించారు. ఆనకట్ట ఎత్తు గరిష్ఠంగా 45 మీటర్లు కాగా.. 4.6 మీటర్ల ఎత్తులో మట్టి ఆనకట్ట నిర్మాణం, రాతి పరుపు, అప్‌టెక్ స్లూయిస్, డ్రైన్.. వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ హయాంలో ఐదేళ్లు బాలెన్స్ పనులను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఫలితంగా కీలకమైన రాతిపరుపు నీటిలోకి జారిపోతోందని, ఆనకట్ట కుంగిపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2,600 మీటర్లు నుంచి 3,400 మీటర్ల మధ్యలో నాలుగు చోట్ల 150-200 మీటర్లకు పైగా రాతిపరుపు జారిపోయిందని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. రోజురోజుకూ ఈ విస్తీర్ణం పెరుగుతోంది. 2023 మేలో మట్టికట్ట రెండు చోట్ల కుంగిపోవడాన్ని తొలిసారి గుర్తించారు. నాడు తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చారు. వైసీపీ హయాంలో శాశ్వత మరమ్మతులు, బ్యాలెన్స్ పనుల జోలికి వెళ్లకపోవడం రైతులకు శాపంగా మారింది.

రూ.58.6 కోట్లతో ప్రతిపాదనలు

రాతి పరుపు శాశ్వత మరమ్మతులు, మట్టికట్ట సహా మెకానికల్ బ్యాలెన్స్ పనుల నిర్మాణం కోసం ఫేజ్-1 కింద తక్షణమే రూ.58.6 కోట్ల నిధులు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే రాతిపరుపు మరమ్మతులకు నంద్యాల కలెక్టర్ రాజకుమారి డీఎంఎఫ్ కింద రూ.2.50 కోట్లు ఇచ్చారు. ఇంజనీర్లు టెండర్లు పిలిచారు. అయితే శాశ్వత మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. గోరుకల్లు రిజర్వాయర్ స్టోన్ రివెట్‌మెంట్ నాలుగు చోట్ల జారిపోయిందని తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన నిధులతో తక్షణ మరమ్మతుల చేపడతామని చెప్పారు. బ్యాలెన్స్ పనులు, శాశ్వత మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు చేపడతామన్నారు.

'గోరుకల్లు' బహు కీలకం

రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన కర్నూలు, కడప, చిత్తూరుతో పాటు నెల్లూరులో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 5 లక్షల జనాభాకు తాగునీరు అందించాలన్న ప్రధాన ఆశయంతో గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు చేపట్టారు. నంద్యాల జిల్లాలో ఎస్సార్బీసీ, అవుకు జలాశయం కింద 1.95 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. శ్రీశైలం జలాశయం పైభాగంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 38 టీఎంసీల కృష్ణా వరద జలాలు తీసుకునేందుకు వీలుగా ఈ ప్రాజెక్టును నిర్మించారు. జీఎన్ఎస్ఎస్‌లో భాగంగా నంద్యాల జిల్లా పాణ్యం మండలం గోరుకల్లు గ్రామం వద్ద 12.44 టీఎంసీల సామర్థ్యంతో గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. దీని నుంచే కడప జిల్లా కొండాపురం మండలంలో నిర్మించిన గండికోట జలాశయానికి 26.85 టీఎంసీలు, పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం రిజర్వాయర్‌కు 6 టీఎంసీలు, చిత్రావతి జలాశయానికి 10 టీఎంసీలు, కమలాపురం నియోజకవర్గంలోని వామికొండ రిజర్వాయర్‌కు 1.6 టీఎంసీలు, సర్వరాయసాగర్ జలాశయానికి 3.06 టీఎంసీలను గాలేరు-నగరి వరద కాలువ (జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్) ద్వారా మళ్లించాల్సి ఉంది. ఆయా జలాశయాలకు కృష్ణా వరద జలాలు మళ్లించే అత్యంత కీలకమైన గోరుకల్లు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. తాజా పరిస్థితుల దృష్ట్యా 11 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయలేమని ఇంజనీర్లు అంటున్నారు.



అసంపూర్తిగా ఓటీ స్లూయిస్ పనులు

అమెరికాలో మెరిసిన 'కృష్ణా' ఆడపడుచు

- మిసెస్ తెలుగు యూఎస్ఏ విజేతగా అట్లూరి మౌనిక
- స్వగ్రామం పామర్రు మండలం ఐనంపూడి

గుడివాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో జరిగిన మిసెస్ తెలుగు యూఎస్ఏ విజేతగా గుడివాడకు చెందిన అట్లూరి మౌనిక నిలిచారు. మే 26న జరిగిన మిస్ అండ్ మిసెస్ తెలుగు యూఎస్ఏ పోటీల్లో పాల్గొన్న 25 మందిలో మౌనిక ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మౌనికకు గత విజేత శ్రేయ బొప్పన కిరీటాన్ని అలంకరించారు. మౌనిక బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చేసి, హైదరాబాదులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో వివాహం అనంతరం అమెరికా వెళ్లిపోయారు. ప్రస్తుతం అమెరికాలోని సేల్స్‌ఫోర్స్‌లో శాశ్వత ఉద్యోగిగా ఉన్నారు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. మౌనిక తండ్రిదండ్రులు అట్లూరి కృష్ణప్రసాద్, శైలజ. వీరి స్వగ్రామం పామర్రు మండలం ఐనంపూడి కాగా, ప్రస్తుతం గుడివాడలో నివాసముంటున్నారు.



తన ఇద్దరు చిన్నారులతో మిసెస్ యూఎస్ఏ మౌనిక

జమ్మూకు ఒక న్యాయం...విశాఖకు మరో న్యాయమా?

- వైజాగ్ రైల్వేజోన్ ఎందుకివ్వరు?
- దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు శంకర్రావు

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ రైల్వే డివిజన్ ఏర్పాటుకు డీపీఆర్ రెడీ కావటంతో పాటు ఏకంగా పరిపాలనను ప్రారంభిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం...విశాఖ రైల్వేజోన్ విషయంలో ఎందుకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేకపోతోందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శంకర్రావు ప్రశ్నించారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌లో ఏపీకి ప్రత్యేక రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపై రిపోర్టు ఇవ్వటానికి పార్లమెంట్‌లో ఆమోదం లభించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత డీపీఆర్ కూడా ఆమోదం పొందిందని, ఇప్పటికి పదేళ్లు గడిచినా జోన్ ఏర్పాటు కాలేదన్నారు. 2025-జనవరిలో ప్రకటించిన జమ్మూ రైల్వే డివిజన్‌కు 6 నెలల్లోపే డీపీఆర్ తయారు చేయించారని, వెంటనే ఆమోదం కూడా పొందిందన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటంతో పాటు జూన్ 1 నుంచి పరిపాలన కూడా ప్రారంభమైందన్నారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌పై ఎందుకు కేంద్ర ప్రభుత్వం సవతిప్రేమ చూపిస్తోందని ప్రశ్నించారు. భూమి ఇవ్వలేదన్న పేరుతో కొన్నేళ్లుగా కాలయాపన చేశారని, . చంద్రబాబు అధికారంలోకి రాగానే భూములను అప్పగించి కొత్త భవనాల శంకుస్థాపనకు చర్యలు చేపట్టార ని, కేంద్రం ఎందుకు జీవో ఇవ్వట్లేదని నిలదీశారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు విశాఖ రైల్వేజోన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రధానితో మాట్లాడి కేంద్ర ప్రభుత్వం ద్వారా జీవో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రముఖ సాహితీవేత్త చిరంజీవినీకుమారి అస్తమయం



కాకినాడ రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, కాకినాడలోని ఐడీఎల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి(94) ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. కాకినాడలోని ఆమె స్వగృహంలో గుండెపోటుతో మరణించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. 1931, మార్చి 30న జన్మించిన చిరంజీవినీకుమారి కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలుగా కొంతకాలం సేవలందించారు. డాక్టర్ పీవీఎన్ రాజుతో కలిసి 1970లో కాకినాడలో ఐడీఎల్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అనంతరం డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించారు. చిరంజీవినీకుమారి మహిళల హక్కుల పరిరక్షణకు పాటుపడ్డారు. కాకినాడ కేంద్రంగా సాహితీరంగానికి ఆమె ఎనలేని సేవలందించారు. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహాకవి శ్రీశ్రీ సప్తతి, వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వేడుకలు, డాక్టర్ గరికపాటి నరసింహారావు మొదటి సహస్రావధానం మొదలైన కార్యక్రమాలను ఐడీఎల్ విద్యాసంస్థల ద్వారా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా చరిత్ర, సంస్కృతి, జిల్లా సాహిత్య చరిత్ర గ్రంథాల రచనకు సారథ్యం వహించి జనవిజ్ఞానవేదికకు సేవలందించారు. చిరంజీవినీకుమారి మృతి ఐడీఎల్ విద్యాసంస్థలకు, తెలుగు భాషకు తీరని లోటని పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు, సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు కాలినడకన వచ్చే శ్రీవారి మెట్టు మార్గంలో ఆదివారం చిరుత సంచారం కలకలం రేపింది. మార్గంలోని 500 మెట్టు వద్ద ఉన్న పొదల్లో ఓ చిరుత కనిపించినట్టు కొందరు భక్తులు సమీపంలోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో ఫారెస్ట్ సిబ్బందితో కలిసి వారు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అయితే ఆ ప్రదేశంలో చిరుత జాడలేమి కనిపించలేదు. అయినప్పటికీ చిరుత ఉంటే అడవిలోకి వెళ్లిపోయేలా సైరన్లు వేశారు. అలాగే కాలినడక భక్తులను అప్రమత్తం చేసి, తిరుమలకు పంపారు. చిన్నపిల్లలను ఒంటరిగా విడిచిపెట్టవద్దంటూ సూచనలు చేశారు. శనివారం సాయంత్రం కూడా శిలాతోరణానికి సమీపంలోని మూర్తినాయన చెరువు సమీపంలో ఓ చిరుత సంచరించినట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జనసంచారంలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు.

ఉద్యోగుల బదిలీలకు మరోవారం గడువు

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించారు. ఈమేరకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఇందుకనుగుణంగా అప్పటి వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. జూన్ 10వ తేదీ నుంచి మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. గత నెల 15వ నుంచి జూన్ 2వ తేదీ వరకు బదిలీలకు ఆర్థికశాఖ అనుమతిచ్చింది. ఆ గడువు జూన్ 2తో ముగుస్తుండటంతో తాజాగా మరో వారం రోజులు పొడిగించారు.

ఎస్సీటీ కానిస్టేబుల్ రాత పరీక్షకు 37,600 మంది హాజరు

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన స్టయిపండరీ క్యాడెట్ ట్రైనీ(ఎస్సీటీ) కానిస్టేబుల్ సివిల్ రాత పరీక్షకు 37,600 మంది హాజరైనట్లు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ రాజీవ్ కుమార్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతిలలో జరిగిన తుది రాత పరీక్షకు 38,555 మంది అభ్యర్థులకుగానూ 37600 (97.52 శాతం) మంది హాజరయ్యారు. ఆన్సర్ కీ కూడా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు రాజీవ్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులకు ఈ ప్రశ్నపత్రాలపై ఏవైనా అభ్యంతరాలుంటే 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు slprba-p.obj@gmail.com కు తగు ఫార్మాట్‌లో పంపించాలని కోరారు.

ఇంటర్‌లో డ్యూయల్ సర్టిఫికెట్

- ఉపాధి, ఉద్యోగాలకు మరింత ఊతం
- 2025-26 నుంచి ఒకేషనల్ కోర్సుల్లో అమలు
- డ్యూయల్ విధానానికి ఎన్‌సీవీఈటీ ఆమోదం
- త్వరలో మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం
- డ్యూయల్ సర్టిఫికెట్‌తో అదనపు ప్రయోజనాలు
- ఈవీ, సోలార్ తరహా కొత్త కోర్సులు

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుల్లో డ్యూయల్ సర్టిఫికేషన్ విధానానికి ఆమోదం లభించింది. రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రతిపాదనకు జాతీయ వృత్తి విద్య, శిక్షణ మండలి(ఎన్‌సీవీఈటీ) అంగీకరించింది. త్వరలో మంత్రి లోకేశ్ సమక్షంలో ఇంటర్ బోర్డు, ఎన్‌సీవీఈటీ ఒప్పందం చేసుకోనున్నాయి. ఆ వెంటనే నూతన విధానం అమల్లోకి వస్తుంది. ఫలితంగా 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో చేరేవారికి డ్యూయల్ సర్టిఫికేషన్ లభిస్తుంది. అంటే ఇంటర్ బోర్డు జారీచేసే సర్టిఫికెట్‌లోనే ఎన్‌సీవీఈటీ ఆమోదం కూడా కనిపిస్తుంది. రాష్ట్రంలో ఒకేషనల్ కోర్సులు చదువుతున్నవారు సుమారు 90 వేల మంది ఉన్నారు. వారికి మొదటి నుంచీ రాష్ట్ర ఇంటర్ బోర్డే సర్టిఫికెట్లు జారీచేస్తోంది. కానీ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో బయటి రాష్ట్రాల్లో ఉద్యోగాలకు, రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీల ఉద్యోగాలకు ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్ అవసరం అవుతోంది.

జాతీయ స్థాయి గుర్తింపు

ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే ఉద్యోగావకాశాలు పొందాలనుకునేవారే ఒకేషనల్‌లో చేరుతుంటారు. అలాంటివారికి రాష్ట్ర బోర్డు జారీచేసే సర్టిఫికెట్ కంటే ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్‌తో అదనపు ప్రయోజనాలుంటాయి. కేంద్ర ప్రాయోజిత పథకాల్లోనూ లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. దీనికోసం ఇంటర్ బోర్డు ఎన్‌సీవీఈటీతో కలిసి పనిచేస్తుంది. కరిక్యులమ్, బోధనా విధానం, శిక్షణ అంశాల్లో సహకారం తీసుకుంటుంది. ఎన్‌సీవీఈటీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది. విద్యార్థుల నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా పెంపొందిస్తారు. రెండేళ్ల కోర్సు అనంతరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కూడా లభిస్తుంది.

త్వరలో కొత్త కోర్సులు

డ్యూయల్ సర్టిఫికేషన్‌తో పాటు కొత్త కోర్సులు కూడా ప్రవేశపెట్టాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన కోర్సు, సోలార్ విద్యుత్ కోర్సును తీసుకురానున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 23 ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, లైవ్ స్టాక్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఎక్కువ మంది చేరుతున్నారు. టూరిజం ట్రావెల్ టెక్నీషియన్, హోటల్ ఆపరేషన్స్, ఫ్యాషన్-గార్మెంట్ మేకింగ్ కోర్సులకు ఆదరణ తగ్గిపోతోంది. దీంతో డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది.

లెవెల్‌తో సర్టిఫికెట్

డ్యూయల్ సర్టిఫికేషన్ ఖచ్చితత్వంతో ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉదాహరణకు ఈవీ రంగంలో ఆ విద్యార్థి ఏ దశలో పనిచేయగలడు అనేది నిర్దేశించేలా 'లెవెలింగ్' సర్టిఫికెట్‌లో పొందుపరుస్తారు. ఇంటర్ ఒకేషనల్ పూర్తిచేసిన విద్యార్థులకు 3.5 లేదా 4 లెవెలింగ్‌తో సర్టిఫికెట్లు జారీ అవుతాయి. ఆ లెవెల్ శిక్షణ పొందినవారు ఏ దశలో పని చేయగలుగుతారనే అంచనా ఉంటుంది. దానివల్ల పరిశ్రమలు ఖచ్చితంగా ఫలానా స్థాయి సర్టిఫికేషన్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసుకునే వీలుంటుంది.

వర్షాకాలాన్ని తలపించిన.. మే

- రికార్డు స్థాయిలో వర్షపాతం
- రాష్ట్రంలో సాధారణం కంటే 148 శాతం అధికం
- అత్యధికంగా గుంటూరు జిల్లాలో 421 శాతం
- అన్ని జిల్లాల్లోనూ విస్తారంగా వర్షాలు
- మేలో అధిక వర్షాలు అరుదు అంటున్న నిపుణులు

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది మే నెలలో వర్షాకాలాన్ని తలపించేలా మంచి వర్షాలు కురిశాయి. ఐదు రోజుల క్రితం రాయలసీమ, దక్షిణ కోస్తా, ఆ తర్వాత కోస్తాలో మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించడం, ఇంకా బంగాళాఖాతంలో వాయుగుండం వర్షాలు ఎక్కువగా కురవడానికి దోహదపడ్డాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కలిపి మే నెలలో 55.3 మి.మీ. కురవాల్సి ఉండగా 137.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 148 శాతం ఎక్కువ అన్నమాట. ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 25 జిల్లాల్లో సాధారణం కంటే అత్యధిక వర్షం కురిసింది. కోస్తాలో 58.4 మి.మీ.కుగాను 152 (సాధారణం కంటే 160 శాతం ఎక్కువ), రాయలసీమలో 50.8 మి.మీ.కు 120.5 మి.మీ.(137 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. జిల్లాలవారీగా చూస్తే గుంటూరులో 46.5 మి.మీ.కు 242.5 (421 శాతం ఎక్కువ), కృష్ణాలో 52.7కి 248.4 మి.మీ. (371 శాతం అధికం), బాపట్లలో 49.4కి 226.1 మి.మీ.(358% ఎక్కువ), అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 53.3 కి 241.6 మి.మీ.(353% ఎక్కువ) వర్షపాతం నమోదైంది. పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, తిరుపతి జిల్లాల్లో సాధారణం కంటే 100 నుంచి 200 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 75.1కి 125.6 మి.మీ. (67 శాతం ఎక్కువ) నమోదైంది. మార్చి నుంచి మే నెల వరకు మూడు నెలల కాలాన్ని రుతుపవన ముందస్తు కాలంగా పరిగణిస్తారు. మార్చి తర్వాత ఎండలు పెరిగి వాతావరణ అనిశ్చితితో పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురుస్తుంటాయి. ఈ ఏడాది మార్చిలో ఎండలు పెరిగినా వర్షాలు కురవలేదు. ఏప్రిల్‌లో కొద్ది ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ రెండో వారం వరకూ దాదాపు అదే పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాత వర్షాలు పలు జిల్లాలకు విస్తరించడంతో ఆ నెలలో 21.9 మి.మీ.కు 35.1 మి.మీ. (సాధారణం కంటే 60 శాతం ఎక్కువ) వర్షపాతం కురిసింది. అయినా పలు జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం పడడంతో ఎండ తీవ్రత కొనసాగింది. మే నెలలో ఎండల కారణంగా వాతావరణ అనిశ్చితి నెలకొని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. హిందూ మహాసముద్రంలో వర్షాలు కురిసే మేఘాలు ఎక్కువగా ఆవరించడంతో అటు నుంచి తేమగాలులు దక్షిణ భారతదేశం వరకు వ్యాపించాయి. నైరుతి రుతుపవనాలు ముందుగా రావడానికి, రాష్ట్రంలో వర్షాలు పెరగడానికి అవి కూడా కారణమని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. మే నెలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడం అరుదుగా జరుగుతుందని పేర్కొన్నారు.

మళ్లీ భగభగ.. పెరిగిన ఎండ తీవ్రత

- జంగమహేశ్వరపురంలో 41 డిగ్రీలు నమోదు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి) నైరుతి రుతుపవనాల విస్తరణ తర్వాత రెండు, మూడు రోజులు కురిసిన వర్షాలు ఆదివారం తగ్గుముఖం పట్టడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా మారింది. దీనికితోడు పడమర దిశ నుంచి పొడిగాలులు వీయడంతో ఒక్కసారిగా ఎండ, వేడి వాతావరణం పెరిగింది. పలుచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమహేశ్వరపురంలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

నేడు తేలికపాటి వర్షాలు..

రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని, ఎండతీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా, సోమవారం అల్లూరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.



కర్నూలు నగరంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

పారిశ్రామిక హబ్‌గా ఏపీ: మంత్రి టీజీ భరత్

- కర్నూలులో కాపు భవన్ నిర్మాణానికి రూ. కోటి

కర్నూలు కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక హబ్‌గా రాష్ట్రం శరవేగంగా దూసుకుపోతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు జిల్లా కేంద్రంలో కాపు భవన్ నిర్మాణానికి రూ.కోటి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం బలిజ సంఘం ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పది, ఇంటర్‌లలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ బీసీలు, మైనార్టీలతో పాటు కాపుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెనక్కు వెళ్లిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనతి కాలంలోనే అనేక పరిశ్రమలు తీసుకువచ్చామన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు తన వద్దే పరిశ్రమల శాఖను ఉంచుకుని స్వయంగా పర్యవేక్షించారని, అలాంటి కీలక శాఖను తనపై నమ్మకంతో ఇచ్చారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మంత్రి టీజీ భరత్‌ను బలిజ(కాపు) సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్వా రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మా అమ్మ ఊగుతోంది..

- బిడ్డల కళ్లముందే ఉరేసుకున్న తల్లి
- బయటకు వచ్చి చెప్పిన చిన్నారులు
- చిన్న సంసారంలో చిచ్చుపెట్టిన ఆన్‌లైన్ బెట్టింగ్, తాగుడు వ్యసనం
- భార్యాభర్తల ఘర్షణ...క్షణికావేశంలో భార్య ఆత్మహత్య
- అనంతపురం జిల్లా యాడికిలో ఘటన





తల్లి మృతదేహం వద్ద అమాయకంగా చూస్తున్న చిన్నారులు, ధనలక్ష్మి (ఫైల్)

యాడికి, జూన్1(ఆంధ్రజ్యోతి): ఎదురుగా ముద్దులొలికే కన్నబిడ్డలు ఇద్దరూ ఆడుకుంటున్నారు...అయితే, ఆ తల్లికి ఎంత కష్టమొచ్చిందో ఏమో..పిల్లలు ఏమైపోతారో అని కూడా ఆలోచించకుండా వారి కళ్ల ముందే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఏం చేస్తోందో తెలియని పిల్లలు 'మా అమ్మ ఇంట్లో ఊగుతోంది' అని బయటకు వచ్చి చెప్పడంతో చుట్టుపక్కల వారు వచ్చిచూసినా ఫలితం లేకపోయింది. ఆమె అనంతలోకాలకు వెళ్లిపోయింది. అనంతపురం జిల్లా యాడికిలోని చౌడేశ్వరికాలనీలో పామిశెట్టి తిరుపతయ్య, ధనలక్ష్మి (26) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు శ్రీహాస్ (6), కుమార్తె లాస్య (4) ఉన్నారు. తిరుపతయ్య కూలి మగ్గం నేసే పని, ధనలక్ష్మి పట్టుచీరల దుకాణంలో కూలి పని చేస్తుంటారు. ఈ చిన్న సంసారంలో వ్యసనం చిచ్చుపెట్టింది. తిరుపతయ్య ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ విషయమై ఆదివారం ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం తిరుపతయ్య బయటకు వెళ్లిపోయాడు. క్షణికావేశానికి లోనైన ధనలక్ష్మి పిల్లల ఎదుటే ఇంట్లో ఉరేసుకుంది. ధనలక్ష్మి ఉరేసుకుని, విలవిల్లాడుతున్నా అభం శుభం తెలియని బిడ్డలు అక్కడే ఆడుకుంటుండడం గమనార్హం. 'మా అమ్మ ఇంట్లో ఊగుతోంద'ని చిన్నారులు చెప్పడంతో స్థానికులు చూసి కిందికి దింపి, యాడికి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె మృతిచెందినట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


సోమవారం 2 జూన్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



ఆదిమ జాతుల అస్తిత్వ పెనుకేక

కెన్యాలో బ్రిటిష్ వలస పాలనకు, వలస పాలన అనంతరం పాలించిన స్వదేశీ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, చింతనాపరుడు, సామాజిక శాస్త్రవేత్త, విప్లవ రచయిత గూగీ వా థియాంగో మే 28న అమెరికా లోని జార్జియాలో కన్ను మూసాడు. ఐరోపా కేంద్రీకృత చర్చల ఆధిపత్య ధోరణులను తమ రచనలతో, మేధా సంపత్తితో తుత్తునియలు చేసిన వారిలో ఎడ్వర్డ్ సయీద్, గూగీ వా థియాంగో ముందు వరసలో ఉంటారు. సయీద్ 1935లో పాలస్తీనాలో, గూగీ 1938లో కెన్యాలో పుట్టారు. విషాదం ఏమిటంటే, ఇద్దరూ పుట్టిన నేల మీద రక్షణ లేక, దశాబ్దాల పాటు ప్రవాసులు గానే బతికారు. 'ఓరియంటలిజం' రచనతో ఎడ్వర్డ్ సయీద్, 'డీకాలనైజింగ్ ద మైండ్', 'మూవింగ్ ద సెంటర్' రచనలతో గూగీ తమవైన మేధా తాత్త్విక మార్గాల్ని రహదారులుగా వేసారు. ఈ ఇద్దరి ప్రస్తావనా లేకుండా ఆధునిక సామాజిక శాస్త్రాలు అసంపూర్ణం.

మూల వాసుల మౌఖిక గాథలను పారవశ్యంతో ప్రపంచ యవనిక మీద నిలబెట్టిన సాహసి గూగీ. తండ్రి థియాంగో 'గికుయు' తెగకు చెందిన ఒక విస్థాపితుడు, ఇద్దరు అన్నలు 1950ల్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన మౌ మౌ సాయుధ పోరాటంలో అమరులు. గూగీ బాల్యం ఈ సాయుధ పోరాటం నేపథ్యంగా గడిస్తే, యవ్వనం స్వీయపాలన వచ్చాక కొన సాగిన నియంతల పాలన నేపథ్యంగా గడిచింది. ఆంగ్ల సాహిత్యం చదువుకుని నైరోబి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా వృత్తి జీవితం మొదలుపెట్టాడు. అధ్యాపకుడిగా ఉన్న కాలంలోనే ఆయనపై రాజ్యం కన్నెర్ర చేసింది. దీనికి కారణం వలస పాలన అనంతరం కెన్యా పాలకుల దాష్టీకాలపై ఆయన చేసిన రచనలు. మొదట 'జేమ్స్ గూగీ' పేరుతో ఇంగ్లీషులో రచనలు చేసిన గూగీ తదనంతరం కాలంలో వలసవాద చిహ్నమైన 'జేమ్స్'ను తన పేరు నుండి తొలగించుకున్నాడు. ఇంగ్లీషును వదిలి మాతృభాషలైన 'గికుయు', 'స్వాహిలి' భాషలలో రాయటం మొదలుపెట్టాడు. ఈ నిర్ణయం తోనే ఆయన సాహిత్య రాజకీయ కార్యాచరణ మొదలైంది. ఆ క్రమంలో స్థానిక భాషలకు మౌఖిక సాహిత్యం ఎంత ముఖ్యమో బలంగా వాదించాడు. ఒక దశలో ఇంగ్లీష్ డిపార్టుమెంటులను రద్దు చేయాలి అనేదాకా పోయాడు.

పంతొమ్మిది వందల యాభైలలో సాయుధ రాజకీయాల తర్వాత, కెన్యా వలస పాలన నుంచి విముక్తం అయ్యాక, డెబ్బయ్యవ దశకంలో తన సహచర నాయకులు పాలకులుగా మారడం మూలంగా, గూగీ బలవంతపు ప్రవాసిగా మారాల్సి వచ్చింది. మాతృదేశాన్ని వదిలిన తర్వాత దశాబ్దాలపాటు ప్రవాసిగానే బతికాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో తులనాత్మక సాహిత్యం – అనువాద విభాగానికి అధిపతిగా పనిచేశాడు.

పూర్వీకులు వారసత్వంగా కాపాడుకున్న అపారమైన జానపద కథలు, ఇతిహాసాలతోపాటు, కెన్యా సాయుధ పోరాటం భూమికగా పనిచేసిన గెరిల్లా వీరుల సాహస గాథలే గూగీ రచనల సారం. కెన్యా దేశంపై వలస పాలన తెచ్చిమోపిన ఆంగ్ల విద్య ఎలా స్థానిక భాషలను, సంస్కృతులను ధ్వంసం చేసిందో ఆయన ప్రతి రచన లోనూ చూడగలం. వలసవాద అణచివేతను ఆయనతోపాటు ఆయన సృష్టించిన పాత్రలూ ఎదుర్కోవటం ఒక విశేషం. 'మాటిగిరి' అనే నవలలో మాటిగిరి పాత్ర మీద పోలీసులు లుక్ అవుట్ నోటీసు కూడా ఇచ్చారు! ఆయన రచనల్లోని పాత్రలు కూడా పాలకులను వణికించాయంటే వాటి బలాన్ని, ప్రాసంగికతను అర్థం చేసుకోవచ్చు.

'వీప్ నాట్, చైల్డ్', 'ద రివర్ బిట్వీన్', 'అ గ్రైన్ ఆఫ్ వీట్', 'పెటల్స్ ఆఫ్ ద బ్లడ్', 'డెవిల్ ఆన్ ద క్రాస్', 'మాటిగిరి', 'విజార్డ్ ఆఫ్ క్రౌ' వంటి నవలలతో బాటు కథలు, నాటకాలు, 'డి కాలనైజింగ్ ద మైండ్', 'పెన్ పాయింట్స్ అండ్ గన్ పాయింట్స్', 'బారెల్ ఆఫ్ పెన్', 'మూవింగ్ ద సెంటర్' వంటి నాన్ ఫిక్షన్, జైలు డైరీ, యుద్ధకాలం నాటి జ్ఞాపకాలు... మొదలైనవి గూగీ ప్రసిద్ధ రచనలు. "చరిత్రలో భాష సంస్కృతులనేవి ప్రజల సామూహిక జ్ఞాపకాల నిధి" అంటాడు గూగీ. పూర్వీకులు వారసత్వ సంపదగా కాపాడుకుంటూ వచ్చిన ఆ నిధిని పాశ్చాత్య వలసవాదం, భాషా సామ్రాజ్యవాదం కబళిస్తున్నాయి అంటూ, ఆంగ్ల భాషా సాహిత్యాల స్థానే అంతరించిపోతున్న స్థానిక మూలవాసుల భాషలను అధ్యయనం చేయాలి అని బలంగా వాదించాడు.

వలస వాదం తెచ్చిన క్రైస్తవ మతం, పాశ్చాత్య విద్య స్థానిక తెగల మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలను, సాంస్కృతిక వైరుధ్యాలను పెంచి పోషిస్తున్నాయో, ఆ రెండు సమాజాల మధ్య పారుతున్న నది సజీవమైన జీవన విధానాన్ని ఎలా కాపాడుకుంటూ వస్తున్నదో 'ద రివర్ బిట్వీన్' నవలలో చూడగలం. ఇది కెన్యా దేశ కథ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అంతరించి పోతున్న జాతులు, వారి బాషా సంస్కృతుల వలపోత. ఈ ప్రపంచంలో నల్లవాడిని తెల్లవాడు, స్త్రీని పురుషుడు, కూలీని రైతు క్రమానుగతంగా దోపిడీ చేస్తున్నారు; వీరందరిలోనూ నల్ల జాతి స్త్రీ వ్యవసాయ కూలీ అత్యంత వ్యవస్థీకృత హింసకు బలవుతున్నారు అంటాడు 'విజార్డ్ ఆఫ్ క్రౌ' నవలలో.



భాషా సామ్రాజ్య వాద పెత్తనం, యూరో సెంట్రిక్ ఆలోచనల శవ పేటికకు కొట్టిన మేకులు గూగీ వా థియాంగో రచనలు. స్వాభిమాన, ప్రతిఘటన పోరాటాలు ఉన్న ప్రతి చోటా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. లక్షలాది అభిమానులకు, వేలాదిమంది పరిశోధకులకు కరదీపికగా మారాయి. ఆయన పరంపరకు వేలాదిమంది వారసులు పుట్టుకొచ్చారు. ఆయన స్ఫూర్తితో ఛిద్రమైన తమ మూలాలను, కోల్పోయిన పూర్వీకుల జాడలను అక్షరీకరిస్తున్నారు.

ఇరవై తొమ్మిదేళ్ళ కిందట హైదరాబాద్‌లో అఖిల భారత విప్లవ సాంస్కృతిక సంస్థ జాతుల సమస్య మీద నిర్వహించిన సదస్సులో పాల్గొనటానికి గూగీ ఈ దేశం వచ్చాడు. హుస్నాబాద్‌లో అమరుల స్మృతిలో నిర్మించుకున్న ఆసియాలోనే అతిపెద్దదైన స్థూపాన్ని పారవశ్యంతో చూసాడు. "మీకు కనీసం అమరుల జ్ఞాపకాలను నిలబెట్టుకునే స్వేచ్ఛ అయినా ఉంది," అని సంతోష పడ్డాడు. ఆనాటికే తాను కెన్యా విడిచి అమెరికాలో ప్రవాసిగా బ్రతుకుతున్న వైనాన్నీ, పుట్టిన నేల మీద 'మౌ మౌ' సాయుధ పోరాట కాలంలో ప్రాణాలను కోల్పోయిన సహచరులనూ యాది చేసుకున్నాడు. మళ్ళీ ఏడేళ్ళ క్రితం 2018లో హైదరాబాద్ వచ్చాడు. అప్పుడు తన బాల్య యాది చద్దిమూటను వెంట పెట్టుకుని వచ్చాడు. గూగీ కథ వింటుంటే బస్తర్ అడవుల్లోని ఆదివాసీ గూడేల్లో, తెలంగాణ మారుమూల పల్లెల్లో నీకూ నాకూ ఎదురైన ఆకలి, అవమానం, పీడన అంతా అద్దం ముందు నిలబడినట్టు ఉంటుంది.

భాషా సామ్రాజ్య వాద పెత్తనం, యూరో సెంట్రిక్ ఆలోచనల శవ పేటికకు కొట్టిన మేకులు గూగీ రచనలు. స్వాభిమాన, ప్రతిఘటన పోరాటాలు ఉన్న ప్రతిచోటా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. లక్షలాది అభిమానులకు, వేలాదిమంది పరిశోధకులకు కరదీపికగా మారాయి. ఆయన పరంపరకు వేలాదిమంది వారసుల పుట్టుకొచ్చారు. ఆయన స్ఫూర్తితో ఛిద్రమైన తమ మూలాలను, కోల్పోయిన పూర్వీకుల జాడలను అక్షరీకరిస్తున్నారు. అంతేకాదు, ఆయన నలుగురు పిల్లలు కూడా రచనలను ప్రచురించారు. ఆయన కొడుకు ముకోమా వా థియాంగో పేరు మోసిన అకడమిక్. ఆఫ్రికన్ నవలా వికాసం, అస్తిత్వ రాజకీయాల మీద సాధికారత కలిగిన బుద్ధిజీవి.

"నిన్ను నీవు సజీవంగా ఉంచుకోవటానికి ప్రతిఘటన ఉత్తమమైన మార్గం. అన్యాయాన్ని తిరస్కరించటమనే చిన్నపాటి రూపంలోనైనా సరే ప్రతిఘటించాలి. నీ మార్గం సరైనదని నువ్వు నమ్మితే, నీ నమ్మకాలపై నువ్వు స్థిరంగా నిలబడితే, అవే నీ ఉనికిని కాపాడతాయి," అని గూగీ బలంగా నమ్మాడు. ప్రపంచవ్యాప్తంగా పోరాడే జనుల పక్షాన తన రచనలను ఒక మద్దతు వాక్యంగా నిలబెట్టాడు. బాధిత స్వరంలో ఆయన రాజేసిన కొలిమి కెన్యన్ వాడల నుంచి బస్తర్ అడవుల దాకా సజీవం గానే ఉంది.

■ గుఱ్ఱం సీతారాములు

✆ 77805 87586

యుద్ధ సమయం

తప్పక వస్తాయి మృదుల వర్షాలూ,
మట్టి పరిమళం
మెరుపు సవ్వడితో గిరికీలు తిరిగే
విహంగ సమూహం

మడుగుల్లో మండూక గానం
నిశిరాత్రంతా
ఊగాడుతూ బదరీవృక్షం
శ్వేతంగా

తూలికల నిప్పును
వక్షస్థలంలో ధరిస్తూ రాబిన్ పక్షి
కురుచ కంచె తీగెపై
వెర్రి కోర్కెలను ఈలవేస్తూ

ఏ ఒక్కదానికీ తెలియదు
యుద్ధమంటే, దేనికీ కూడా
అది ఎప్పుడు సంభవించిందనే
స్పృహే లేదు

పిట్ట గానీ చెట్టు గానీ పట్టించుకోవు
నరజాతి సమూలంగా నశించినా

తొలిసంధ్యలో మేల్కొన్న వసంతానికి
తెలియనే తెలియదు
మనం వెళ్లిపోయామని.

ఇంగ్లిష్ మూలం: ■ సారా టీజ్డేల్

అనువాదం: ■ తుమ్మూరి రాంమోహన్ రావు

✆ 97015 22234

ఎంత ప్రాంతీయమైతే అంత విశ్వజనీనం

సాహిత్యం భాషను ఆశ్రయించి మనిషిలో ఉప్పొంగే భావాలకు రూపం ఇచ్చే కళ. ఆ భావాలు ఎక్కడ పుట్టాయో, అవి ఎవరి జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయో తెలియకపోతే, తెలుసుకోకపోతే ఆ సాహిత్యం మూలాల నుంచి దూరమై పరాయిదైపోతుంది. అందుకే ప్రపంచ సాహిత్యంలో ప్రాంతీయతకు విశేషమైన స్థానం ఉంది. ప్రాంతీయత అనేది కేవలం భౌగోళిక పరిమితి మాత్రమే కాదు; అది ఒక భాష, ఒక జీవనశైలి, ఒక సంస్కృతి, ఒక వ్యక్తిత్వం. ప్రాంతీయ సాహిత్యం ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని ప్రజల భాషలో రాసిన సాహిత్యం. ఆ ప్రాంతపు ప్రకృతి, నీటి వనరులు, పంటలు, వృత్తులు ఆ సాహిత్యంలో ప్రధాన పాత్రధారులు. సాంస్కృతిక తత్త్వం, జానపద కళలు, కథలు, నమ్మకాలు, సామెతలు ఇవన్నీ ఆ సాహిత్యంలో బలమైన పాత్ర పోషిస్తాయి. అంతేకాదు సామాజిక ధ్వని–ప్రతిధ్వని, గ్రామీణ జీవితం, వర్గ భేదాలు, కుల వ్యవస్థ, వలసకూలీల కష్టాలు ఇవన్నీ ప్రాంతీయ సాహిత్యంలో లోతుగా ఆవిష్కృతమవుతాయి. అణచివేతకు గురైన ప్రజా చరిత్రను ప్రాంతీయత తిరిగి వెలుగులోకి తెస్తుంది. ఆధిపత్య భావాలకు కథనాలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. అందుకే ఎప్పుడయినా ఎక్కడయినా ప్రాంతీయ సాహిత్యం అనేది శక్తివంతమైన ప్రతిభావంతమైన సాహిత్య ధోరణిగా నిలబడింది. ప్రాంతీయ సాహిత్యం లేకపోతే సాహిత్య ప్రపంచం ఎప్పటికీ సంపూర్ణం కాదు. వర్తమాన ప్రపంచీకరణ కాలంలో ఉప్పెనలా ఎగిసిన సాంకేతికత, ముసురుకుంటున్న విదేశీ సంస్కృతుల నేపథ్యంలో ప్రాంతీయ భాషల ప్రోత్సాహం, పరిరక్షణ మరింత అవసరం.

తెలంగాణ ఉద్యమ సమయంలో వచ్చిన కవిత్వం, వచనం, గేయ సాహిత్యం, ప్రజా నాటకాలు ఆనాటి ఉద్యమ గళంగా మారాయి. గ్రామీణుల బాధలు, నిరుద్యోగ యువతలో విరక్తి, ఆత్మహత్యలు వంటి వాస్తవాలు గాఢంగా వాటిలో ప్రతిబింబించాయి. 'తెలంగాణ తల్లి', 'బతుకమ్మ' వంటి ప్రాంతీయ చిహ్నాలు సాహిత్యంలో ప్రాముఖ్యత పొందాయి. మా భూమి, మా భాష, మా సంస్కృతి అనే నినాదాలు సాహిత్యంలో కవిత్వ రూపంలో, కథల రూపంలో, దాదాపు అన్ని సాహిత్య సాంస్కృతిక రూపాల్లో ప్రతిధ్వనించాయి. ప్రభావితం చేసాయి. ఉద్యమాన్ని ఉధృతలూగించాయి. ఫలితంగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడింది. ఏర్పడి పదేళ్ళు దాటిపోయాయి. చరిత్రలో దేని గురించైనా మంచి చెడ్డా ఆలోచించడానికి, బేరీజు వేయడానికి దశాబ్దం పెద్ద సమయం కాకపోవచ్చు, కాని అత్యంత వేగవంతమైన వర్తమాన కాలంలో పదేళ్ళు తక్కువ సమయమేమీ కాదు. అందుకే తెలంగాణాలో అభివృద్ధి తదితర రంగాల్ని కాకుండా సాహితీ సాంస్కృతిక రంగాల్లో జరిగిన మార్పును అంచనా కట్టాల్సిన అవసరం వుంది. తెలంగాణా అస్తిత్వం, అణచివేత, నిరాదరణ తదితర అంశాల గురించి సాహిత్యం ఎంతగా వేదన చెందిందో, ఉప్పెనలా ఎగసిందో అదే స్థాయిలో ఆ స్థితిని కొనసాగించిందా లేదా అన్నది చూడాల్సి వుంది. అనేకానేక మౌలిక అంశాలపైన సాహిత్యకారులు ఈ పదేళ్ళు ఏమేరకు నిలబడ్డారో ఎవరికివారు పరిశీలించాలి.

తెలంగాణ సాహిత్య వికాసం కోసం విస్తృతంగా కవులను వెలుగు లోకి తేవడానికి 2017లో రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య అకాడమీని ఏర్పాటు చేసింది. తెలంగాణాకు చెందిన అరుదైన, అపురూపమైన గ్రంథాల సేకరణ, ప్రచురణలతో పాటు; సాహిత్య అంశాలపై పరిశోధన; సభలు, సమావేశాలు, శిక్షణా శిబిరాలు, సదస్సుల నిర్వహణలతో పాటు; తెలుగు నుండి ఇతర భాషలలోకి, ఇతర భాషల నుండి తెలుగులోకి అనువాదాలు చేయించడం... వంటి లక్ష్యాలను పెట్టుకున్నారు. పుస్తకాల ప్రచురణ సభలు, ప్రపంచ మహాసభలు లాంటి పనుల్ని అకాడెమీ నిర్వహించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అధికారిక సంస్థ స్థాయిలో అకాడెమీ తన వంతు బాధ్యతల్ని నిర్వహించింది. ఈ కృషి ఎన్నదగిందే అయినా సాహిత్య సభలు శాలువాలు సన్మానాలకు పరిమితం కావడం విచారకరం. ఉద్యమం ఒకసారి విజయవంతమైనాక, నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకున్నాక అంతా సేద దీరిపోయారేమో అనిపిస్తుంది.

ప్రభుత్వ సంస్థల స్థితి అట్లా వుంటే వేదికలు, సంఘాల స్థితి దానికి భిన్నంగా ఏమీ లేదు. తెలంగాణ సాహిత్యంతో వివిధ భారతీయ భాషా సాహిత్యాల సమన్వయం అంతగా జరగలేదు. ఇతర భాషల నుంచి తెలుగులోకి, తెలుగులోంచి ఇతర భాషలలోకి పరస్పర అనువాదాల గురించి వ్యక్తుల ప్రయత్నాలే తప్ప సంస్థలు అంతగా కృషి చేయలేదు. కనీసం ఇంగ్లీష్ లోకైనా తెలంగాణ సాహిత్యాన్ని అనువదించే ప్రయత్నాలు విరివిగా జరగలేదు. 'ఇండియన్ లిటరేచర్' లాంటి అనేక పత్రికల్ని చూస్తున్నప్పుడు వాటిలో తెలంగాణ రచనలు కనిపించడం అరుదు. జాతీయ స్థాయిలో తమిళంలో పెరుమాళ్ మెరుగన్ గురించి, మలయాళంలో సచిదానందన్ గురించి మాట్లాడినంతగా తెలుగు వాళ్ళ గురించి, తెలంగాణా వాళ్ళ గురించి ప్రస్తావనలు అతి స్వల్పం. ఆ దిశలో మనం బాగా వెనుకబడే వున్నాం. దానికి ప్రధాన కారణం అనువాదం మీద వున్న చిన్న చూపు, అనువాదకులకు ప్రోత్సాహం లేకపోవడం. ఇక దృశ్య మాధ్యమాలని వినియోగించుకోవడంలో మరింత వెనుకబడివున్నాం. తెలంగాణా సాహితీ మూర్తుల పైన, వారి కృషి పైనా వీడియోలు డాక్యుమెంటరీలు మన దగ్గర అతి స్వల్పం. కేంద్ర సాహిత్య అకాడెమీ సాహిత్యకారుల డాక్యుమెంటరీ ఫిలిమ్స్ చేస్తున్నప్పుడు మన తెలంగాణా అకాడెమీ ఎందుకు మిన్నకుందో అర్థం కాదు. దానికి ప్రధానంగా ఇతర భాషా సాహిత్యాల పట్ల, ఇతర సృజనాత్మక మాధ్యమాల పట్ల అవగాహన కొరవడడం ప్రధాన కారణం. ఇక తెలంగాణా రాష్ట్రం ఏర్పడినంక అధికశాతం సాహితీ సృజనకారులు మేధావులు పాలకుల పొత్తిళ్లలోకి చేరుకోవడం, పదవుల చుట్టూ పురస్కారాల చుట్టూ పరుగులు పెట్టడం మొదలు పెట్టినంక తెలంగాణా అస్తిత్వం విస్మృతి అన్న అంశాలు వెనుక సీట్లోకి వెళ్ళిపోయాయి.



తెలంగాణా సాహితీ రంగంలో గత దశాబ్ద కాలంలో వందలాది మంది కొత్త కవులు వచ్చారు. వారిలో దళితులు, స్త్రీలు బలహీన వర్గాలు మైనారిటీ కవులూ విస్తృతంగా ప్రభావవంతంగా రాస్తున్నారు. ఇరుగుపొరుగు భాషల్లోకి చూడడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ధోరణులను అర్థం చేసుకోవడం చేస్తే తెలంగాణా సాహిత్యం మట్టి వాసనలతో మరింత వికసిస్తుంది.

మరోవైపు కొత్త తరంలో చదవడమనే అలవాటు దాదాపు అంతరించిపోతున్నది. అంతా చూడడమే, అది కూడా కొన్ని సెకన్లు నిముషాల్లో ముగిసే రీల్స్ మాత్రమే! ఈ స్థితిని మార్చడానికి అకాడెమీలూ, వ్యక్తులుగా సాహిత్యకారుల ప్రయత్నాలు అతి స్వల్పం. నిజానికి సాహిత్యకారులు కాలేజీలకు స్కూళ్ళకు వెళ్ళాలి విద్యార్థుల్లో సిలబస్‌కు ఆవల నాన్ అకాడెమిక్ రీడింగ్‌ను పెంపొందించేందుకు కృషి చేయాలి. బ్లాగులు రాయడాన్ని ప్రోత్సహించాలి. అందమైన దృశ్యాలని అనవసరమైన అంశాల్ని షేర్ చెయడం కాకుండా అర్థవంతమయిన భావాల్ని షేర్ చేసే అలవాటుని యువకుల్లో విద్యార్థుల్లో ప్రోత్సహించాలి. మరోవైపు ఆధునికత సాంకేతికత మొత్తం ప్రపంచాన్ని ఆక్రమిస్తున్నది. తెలంగాణ సాహిత్య ప్రపంచం ఆధునికతను సంతరించుకోవడంలో వెనకబడిందనే చెప్పాలి.

ఇదిలా వుండగా ఇంకో కోణంలో చూసినప్పుడు తెలంగాణ సాహిత్యం నాటి నుంచి నేటి దాకా అనేక సమస్యల్నీ ఆటుపోట్లనీ ఎదుర్కొంది. అనేక ఆంక్షల్ని నిషేధాల్ని కూడా ఎదుర్కొని నిలదీసింది. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్న దాశరథి మాటల ప్రేరణతో అన్నింటినీ తట్టుకుని నిలబడింది. ఓ పక్క ఆధునికత లాంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ తెలంగాణ సాహితీ రంగంలో గత దశాబ్ద కాలంలో వందలాదిమంది కొత్త కవులు వచ్చారు. వారిలో దళితులు, స్త్రీలు బలహీన వర్గాలు మైనారిటీ కవులూ విస్తృతంగా ప్రభావవంతంగా రాస్తున్నారు. నిలబడేవాళ్ళు నిలబడుతూనే వున్నారు. కొత్త దారులు వేసే వాళ్ళూ ఎదిగి వస్తున్నారు. ఇరుగు పొరుగు భాషల్లోకి చూడడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ధోరణులను అర్థం చేసుకోవడం చేస్తే తెలంగాణా సాహిత్యం మట్టి వాసనలతో మరింత వికసిస్తుంది.

(తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా)

■ వారాల ఆనంద్

✆ 94405 01281



ఏకాంత స్పర్శ

నీవు నీ నుండి విడిపోయినా సరే
నీతో కలసి చేసే ప్రయాణమే ఏకాంతం

మెదడు మైదానంలో
మనసు అనుభవించే ఘనమైన స్వేచ్ఛ

నీ తనం తవ్వి తోడే నిజాలు
ఏకాంత స్పర్శకు తడిసి తడిసి

అనుభవం పొలిమేర దాటి
నిజం స్వరంతో విహరిస్తూ పోతే

యాతన అంచులపై
కష్టం కళ్ళు మూసుకుని నడిచే ధైర్యానికి

కలల చిరునామా చూపుతూ
కాలం దారి వదులుతుంది

లోకం ఓ ప్రశ్నాపత్రంగా
ఇష్టాలతో పని లేని పరీక్షలో

ఒక్కో ప్రశ్న రాత్రంత పొడవు
ఓ రోజంత బరువు

వయసుకి రెట్టింపు
ఆలోచన కురిసి

మనిషెత్తు తపన పారితేనే
మనసు పదునెక్కి
బతుకు జీవితమయ్యేది

■ చందలూరి నారాయణరావు

✆ 97044 37247

'తెలుగు జాడలు' పుస్తకంపై చర్చా సమావేశం

తెలుగు రాష్ట్రాలకు వెలుపల ప్రాచీన తెలుగు మూలాలున్న ప్రజల జీవితాల గురించి ఆ ప్రాంతాలకు ప్రయాణించి, ఆ ప్రజలతో సంభాషించిన అనుభవాలతో ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు రాసిన పుస్తకం 'తెలుగు జాడలు'పై చర్చా సమావేశం జూన్ 5 సాయంత్రం 6.30ని.లకు లామకాన్, బంజారాహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. వివరాలకు: 96427 31329.

సుమనస్పతిరెడ్డి

శీలావీ పురస్కార ప్రదానం


శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక 2025 సంవత్సరానికి గాను శీలా వీర్రాజు కథానికా పురస్కారాన్ని 'గారడివాడు' కథా సంపుటి రచయిత కె.ఎ. ముని సురేష్ పిళ్ళెకి, శీలా వీర్రాజు చిత్రకళా పురస్కారాన్ని చిత్రకారుడు పి.ఎస్. చారికి ఇస్తున్నది. రూ.15వేల నగదు, జ్ఞాపికతో పురస్కార ప్రదానం జూన్ 7 సాయంత్రం 5.30ని.లకు రవీంద్ర భారతి (మొదటి అంతస్తు), హైదరాబాద్‌లో జరుగుతుంది. విహారి, మామిడి హరికృష్ణ, ఇంద్రగంటి మోహనకృష్ణ, అమృతలత, ఎమ్వీ రామిరెడ్డి పాల్గొంటారు. శీలావీ చిత్రలేఖనాలపై వ్యాస సంకలనం 'ఒక చిత్రకారుడు – అనేక అవలోకనాలు', శీలా వీర్రాజు ఫాంట్‌తో 250 మంది కవుల కవితా సంకలనం 'శీలాక్షరాలు' ఆవిష్కరణలు జరుగుతాయి.

శీలా సుభద్రాదేవి

కథ, కవిత, వ్యాసం, ఆధ్యాత్మిక సంపుటాలకు ఆహ్వానం

ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ ఇచ్చే సాహితీ అవార్డుల కోసం 2024లో ప్రచురితమైన కథా, కవితా, వ్యాస, ఆధ్యాత్మికా సంపుటాలను పంపాలి. ఒక్కో విభాగానికి రూ.10,116 చొప్పున నగదు పారితోషికం తోపాటు, జ్ఞాపికతో వేములవాడలోని ముక్తేశ్వరి ఫౌండేషన్ ప్రధాన కార్యాలయంలో సత్కారం ఉంటుంది. రచనలు మూడేసి ప్రతులను జూన్ 25 లోపు పంపాల్సిన చిరునామా: ఈశ్వరగారి నరహరి శర్మ, చైర్మన్, ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్, ఓల్డ్ మార్కెట్, వేములవాడ– 505302 ఫోన్: 93966 48880.

మంగారి రాజేందర్





దుర్గగుడిపై ప్రతిపాదిత మినీ ఫ్లై ఓవర్

ఇంద్రకీలాద్రిపై.. మినీ ఫ్లై ఓవర్!

265 మీటర్ల పొడవు, 16 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదన

ప్రతిపాదిత రెండో నూతన ఘాట్ మార్గానికి బదులుగా..

కుమ్మరిపాలెం వైపు నుంచి నేరుగా ఘాట్ మార్గానికి అనుసంధానం

ఎన్‌హెచ్ - 65 నుంచి కొండపైకి మినీ ఫ్లై ఓవర్

ఓం టర్నింగ్ దగ్గర దిగువన 11 అంతస్తుల మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

ఘాట్ మార్గానికి నేరుగా అనుసంధానం

1500 వాహనాలకు పార్కింగ్ అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద దేవస్థానమైన ఇంద్రకీలాద్రిపై ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. కుమ్మరిపాలెం వైపు రెండో ఘాట్ మార్గాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తున్న తరుణంలో ఘాట్ మార్గం స్థానంలో ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

మిగతా 6లో..

నాన్న.. పుస్తకాల బ్యాగ్ చిరిగిపోయింది. కొన్ని రోజుల్లో బడులు తెరుస్తారు. కొత్త బ్యాగ్ కొనాలి.

అమ్మా... టిఫిన్ బాక్స్ తీసుకెళ్లే బ్యాగ్ పాడైపోయింది. కొత్త బ్యాగ్ కొనమని డాడీకి చెప్పు.

డాడీ... షూ సైజు సరిపోవడం లేదు. కొత్త షూ కొనాలి.

జూన్ రావడంతో ప్రతి ఇంట్లోను చిన్నారుల నుంచి ఇవే డైలాగ్‌లు వినిపిస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతోంది. కొన్ని ప్రైవేటు పాఠశాలలు సోమవారం నుంచి తరగతులు ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఈ నెల 12వ తేదీ నుంచి తలుపులు తెరుచుకోబోతున్నాయి. ప్రస్తుతం ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు అడ్మిషన్లను పెంచుకోవడానికి వీధుల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. విద్యాసంవత్సరం కొద్దిరోజుల్లో ప్రారంభమవుతుండడంతో ప్రతి ఇంట్లోను జూన్ బడ్జెట్ కేటాయింపులు మొదలయ్యాయి. కుటుంబ నిర్వహణ ఖర్చులు, పిల్లల చదువులకు ఫీజులు, కొత్తగా విద్యాసంస్థల్లో చేర్పాలంటే డొనేషన్లు, పుస్తకాల కొనుగోళ్లు ఇలా ఒక్కోదానికి ఎంతెంత వెచ్చించాలన్న కేటాయింపులు చేసుకుంటున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలు జూన్ నెల వస్తుందంటే బెంబేలెత్తిపోతున్నాయి.

అమ్మో జూన్!

వణికిపోతున్న పేద, మధ్యతరగతి వర్గాలు

విద్యాసంస్థల్లో అడ్మిషన్ల ఫీజుల భారం

కొత్త విద్యాసంవత్సరంలో నయా నిర్ణయాలు

యూనిఫాం, షూ, బెల్టుల ఖర్చులు

కొత్త పుస్తకాలు.. కొత్త ధరల మోత

వేతనంలో సగం విద్యకే కేటాయింపు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): పేద, మధ్య తరగతి వర్గాల్లో ఎక్కువ మంది ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల వైపు చూస్తున్నారు. ఇక్కడ చదివిస్తే పిల్లలు ఉత్తములుగా ఉంటారని భావిస్తున్నారు. ఆదాయం అటుఇటుగా ఉన్నా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లోనే పిల్లలను చేర్పించడానికి సిద్ధమవుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఎల్‌కేజీకి రూ.40 వేలు ఫీజును వసూలు చేస్తున్నాయి. ఇది కాకుండా పుస్తకాలకు రూ.7వేలు. యూనిఫారానికి రూ.3 వేల నుంచి రూ.4వేలు, అడ్మిషన్ ఫీజును రూ.3 వేల నుంచి రూ.5వేలుగా నిర్ణయించారు. ఇలా తరగతి పెరిగే కొద్దీ ఫీజులను పెంచుతున్నారు. ఒకరిని ఎల్‌కేజీలో చేర్పించాలంటే తల్లిదండ్రులు రూ.40వేలు చేత్తో పట్టుకోవాల్సిందే. ఎందుకంటే మొత్తం ఫీజులో సగాన్ని అడ్మిషన్ తీసుకున్న రోజు చెల్లించాలని యాజమాన్యాలు షరతులు విధిస్తున్నాయి. ఇది కాకుండా మరో రూ.13 వేల నుంచి 15వేలు అదనంగా పట్టుకోవాలి. ఫీజుతోపాటు పుస్తకాలు, యూనిఫాం, అడ్మిషన్ ఫీజులను వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా ఒక పిల్లాడిని ఎల్‌కేజీలో చేర్పించడానికి రూ.40వేలు సిద్ధంగా ఉంచుకోవాలి. అదే ఇద్దరు పిల్లలను చేర్పించాలంటే సుమారుగా రూ.లక్షను పట్టుకోవాలి. పాఠశాల స్థాయిలో ఇబ్బందులు ఇలా ఉంటే ప్రొఫెషనల్ కోర్సులు, ఇంటర్మీడియట్ చదివే వారు ఉన్న కుటుంబాల్లో పరిస్థితి మరోలా ఉంటుంది. పదో తరగతి పూర్తి చేసుకున్న పిల్లలను ఇంటర్మీడియట్‌లో చేర్పించడానికి తల్లిదండ్రులు రూ.లక్షను సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కోర్సుల్లో ఉన్న

మిగతా 6లో..

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మొత్తం కౌన్సిల్ సభ్యులు 20 మంది

ఎమ్మెల్యే ఓటుతో 11కు చేరిన టీడీపీ బలం

చైర్మన్ పదవి టీడీపీకి లాంఛనమే!



బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో కె.మాధురి

తిరువూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మున్సిపల్ ఎన్నికల అధికారి, ఆర్డీవో కె.మాధురి మున్సిపల్ కమిషనర్

మిగతా 6లో..

కల్యాణ మండపాల్లో 'బంగారం శ్రీను'

నగరంలో రెండు చోట్ల లీజుల్లో భాగస్వామ్యం

వాసవీ క్లబ్‌లో పరిచయమైన వారితో వ్యాపారం

6



వాళ్లు విరగ్గొట్టారు.. వీళ్లు కొత్తది కొనిచ్చారు

ఇబ్రహీంపట్నంలో బాలుడి సైకిల్ నాశనం చేసిన వైసీపీ మూకలు

కొత్త సైకిల్ కొనిచ్చిన టీడీపీ నాయకులు

6

ఎట్టకేలకు చిక్కాడు! బాంబు కాల్ నిందితుడు

పూణెలో అరెస్టు చేసిన పోలీసులు

నిందితుడు మానసిక రోగిగా గుర్తింపు

పూణె, షోలాపూర్ కంట్రోల్ రూమ్‌లకు కూడా బెదిరింపు కాల్స్

మోడ్రన్ ఠాణా!

ప్రతి ఎస్‌ఐకి ఒక చాంబర్

133 అంగుళాల వీడియో వాల్

ఎఫ్ఆర్‌సీ ద్వారా రౌడీషీటర్ల హాజరు

పిల్లల కోసం గేమింగ్ జోన్

వ్యాయామానికి ప్రత్యేకంగా జిమ్

ముస్తాబైన సత్యనారాయణ పురం పోలీస్‌స్టేషన్

నేడు ప్రారంభం.. హాజరుకానున్న హోంమంత్రి, డీజీపీ



నిరంతరం ప్రత్యక్ష నిఘాకు ఎదురుగా వీడియోవాల్. ఒక్కో అధికారికి ప్రత్యేక చాంబర్. ఒక్కో సేవకు ఒక్కో విభాగం. సిబ్బందికి విశ్రాంతి గదులు. పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక గేమింగ్ జోన్. సిబ్బంది ఆరోగ్యం కోసం వ్యాయామశాల. ఇవన్నీ వింటుంటే ఇదేదో కార్పొరేట్ కార్యాలయం గుర్తుకొస్తోంది. అలాగని అది కార్పొరేట్ కార్యాలయం కాదు హైటెక్ హంగులతో నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అధునాతన సదుపాయాలతో నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ గృహప్రవేశానికి సిద్ధమైంది. ఈ పోలీస్‌స్టేషన్‌ను హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌గుప్తా సోమవారం ప్రారంభించబోతున్నారు. మొత్తం మూడు అంతస్తులతో నిర్మించిన ఈ స్టేషన్‌లో ఒక్కో అంతస్తుకు ఒక్కో ప్రత్యేకత ఉంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌ను రూ.2కోట్లకు పైబడిన నిధులతో నిర్మించారు. ఈ భవనంలో అధికారులు, సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు సెల్లార్ నిర్మించారు. మొదటి అంతస్తులో స్టేషన్ హౌస్ ఆఫీసర్ చాంబర్ ఉంటుంది. ఇక్కడే గోడకు 133 అంగుళాల వీడియో వాల్ ఉంటుంది. 15-20 మంది ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేలా ఈ వాల్ ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. వాటిని ఈ వీడియో వాల్‌కు అనుసంధానం చేస్తారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉన్న ఇళ్లను స్టేషన్‌లో ఉండి ఈ వాల్‌పై పరిశీలించవచ్చు. సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ధర్నాచౌక్

మిగతా 6లో..

బీసీ వెల్ఫేర్‌లో బదిలీలలు!

ఉమ్మడి కృష్ణాజిల్లా వార్డెన్ల బదిలీల్లో రూ.లక్షల్లో అవినీతి!

డైరెక్టరేట్ ఉత్తర్వులు, బదిలీ నిబంధనలు బేఖాతరు

బదిలీలకు దరఖాస్తు పెట్టుకునే వారికి అధికారుల బెదిరింపులు

ఫ్రీ కౌన్సెలింగ్ పేరుతో బేరసారాలు!

దీనిపై విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌కు ఆ శాఖ ఉద్యోగుల వినతి



బీసీ వెల్ఫేర్(వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ)లో బది'లీల' వ్యవహారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో తీవ్ర వివాదాస్పదంగా మారింది. బదిలీల మాటున రూ.లక్షల్లో బేరసారాలు జరిగినట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకునేవారికి అధికారులే ఫోన్లు చేసి బెదిరిస్తుండటం సంచలనం సృష్టిస్తోంది. డైరెక్టరేట్ ఆదేశాలను ధిక్కరించి.. బదిలీల మార్గదర్శకాలను తుంగలో తొక్కి, కాసులు విదిల్చిన వారికే రెడ్ కార్పెట్ పరుస్తుండటంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి భోజనానికి అనుగుణంగా నిర్దేశించిన బదిలీల జాబితా కలెక్టర్ దగ్గరకు చేరింది. ఈ జాబితాపై కలెక్టర్ విచారణకు ఆదేశించాలని, లేనిపక్షంలో అర్హులకు అన్యాయం చేసినట్టు అవుతుందని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నడూలేని విధంగా బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌ను అవినీతి వివాదాలు ముప్పేట చుట్టుముడుతున్నాయి. తాజా బదిలీల వ్యవహారంలో బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు వ్యవహరిస్తున్న ఏకపక్ష విధానాలు అనేక ఆరోపణలకు కారణమవుతున్నాయి. రూ.లక్షలు కొట్టిన వారికి నిబంధనలకు విరుద్ధంగా కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్‌లు కల్పించటం వివాదం సృష్టిస్తోంది. బదిలీలు పారదర్శకంగా జరగటం లేదని బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసే వరకు వెళ్లటం గమనార్హం.

ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా..

ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. దీని కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి జాబితాను రూపొందించి వెకెన్సీ పొజిషన్‌ను ఉన్నతాధికారులు చూపించాల్సి ఉంటుంది. ఈ వేకెన్సీ పొజిషన్ ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బదిలీల సందర్భంగా ముందుగా ఐదు సంవత్సరాలు ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికే బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. కొన్ని అంశాలకు సంబంధించి రిక్వెస్ట్ బదిలీలు కూడా ఉంటాయి. ఈ రిక్వెస్ట్ బదిలీలు అనేవి ముందు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు కల్పించిన తర్వాత చూడాల్సి ఉంటుంది. కానీ, రిక్వెస్ట్ బదిలీలకు బీసీ వెల్ఫేర్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు ప్రాధాన్యత ఇవ్వటం గమనార్హం. ఈ వ్యవహారంలో కిరికిరి నడిచిందన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. రిక్వెస్ట్ బదిలీల మాటున లక్షలాది రూపాయల ముడుపులు చేతులు మారినట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ పెట్టుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వటం సంచలనం సృష్టిస్తోంది. హాస్టల్ వార్డెన్స్ బదిలీల్లో నిబంధనల ప్రకారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్

మిగతా 6లో..



విద్యాధరపురంలో రేషన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సాఫీగా..

చౌక దుకాణాల దగ్గర నిత్యావసరాల పంపిణీ

ఎన్టీఆర్ జిల్లాలో 67,138 మంది, కృష్ణాజిల్లాలో 56,410 మందికి చేరిన సరుకులు

తొలిరోజు స్వల్పంగా సర్వర్ సమస్యలు.. అధిగమించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రేషన్ దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీ తొలి రోజు ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాఫీగా సాగింది. ఐదేళ్ల తర్వాత మళ్లీ చౌక దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీ నేపథ్యంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను అందించారు. ఈ పోస్‌ల ద్వారా లావాదేవీలు నిర్వహించటానికి స్వల్పంగా సర్వర్ సమస్యలు వచ్చాయి. రేషన్ డీలర్ల దగ్గర నిత్యావసరాలు తీసుకోవటం అన్నది తమకేమీ ఇబ్బంది లేదని పలువురు కార్డుదారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రేషన్ డిపోలు అయితే నచ్చినపుడు వచ్చి నిత్యావసరాలను తీసుకుంటామని, అదే ఎండీయూ వాహనం అయితే ఒక్క రోజు మాత్రమే అన్ని పనులు మానుకుని నిత్యావసరాలు తీసుకోవాల్సి వస్తుందని, అది ఒక రకంగా ఇబ్బందికరంగా ఉండేదని చెప్పారు. తొలి రోజు రాత్రి 9.30 గంటల వరకు చూస్తే .. ఎన్టీఆర్ జిల్లాలో 957 రేషన్ షాపుల వద్ద 5,90,243 మంది కార్డు దారులకు గాను 67,138 మంది నిత్యావసరాలను తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తొలి రోజున 11.06 శాతం మేర నిత్యావసరాల పంపిణీ జరిగింది. కృష్ణా జిల్లా వ్యాప్తంగా చూస్తే మొత్తం 1,059 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,22,589 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరిలో తొలి రోజున 56,410 మంది కార్డుదారులు నిత్యావసరాలను తీసుకున్నారు. కృష్ణాజిల్లాలో 10.39 శాతం నమోదైంది.

15 రోజుల వెసులుబాటు..

గతంలో వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ డోర్ డెలివరీ అని చెప్పినప్పటికీ ఎప్పుడూ అది జరగలేదు. ఏదో ఒక వీధిలో వ్యానును నిలిపి నిత్యావసరాలను పంపిణీ చేసేవారు. దీంతో ఆ వ్యాను దగ్గర ప్రజలు బారులుతీరి కనిపించేవారు. ఇప్పుడు డిపోల దగ్గర ఏమంత పెద్ద రష్ కనిపించలేదు. పదిహేను రోజుల సమయం ఉండటంతో కార్డుదారులు తక్కువ సంఖ్యలోనే వచ్చారు. వెంటనే నిత్యావసరాలు తీసుకుని వెళ్లిపోయారు. అప్పుడంటే ఆప్షన్ లేదు ఆ ఒక్క రోజే సరుకులు తీసుకోవాలి కాబట్టి ఎండీయూ వాహనాల దగ్గర బారులు తీరేవారు. ప్రస్తుతం 15 రోజులలో ఎప్పుడైనా డీలర్ల దగ్గర నిత్యావసరాలు తీసుకోవటం ద్వారా ఆ ఇబ్బందులు లేవని చెబుతున్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

» వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీ2+ 50శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతుల ఆత్మహత్యల నుంచి కాపాడేందుకు 2006లో ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ సిఫార్సులను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, అత్యధిక సాగు చేసే ధాన్యానికి క్వింటాకు కేవలం రూ.69 మాత్రమే పెంచడం దుర్మార్గమన్నారు. మద్దతు ధరల పెంపుకోసం ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పలువురు నేతలు రైతాంగానికి పిలుపునిచ్చారు. సీనియర్ రైతునేత వైకేశవరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ప్రధానకార్యదర్శి పి.జమలయ్య, ఆల్ ఇండియా కిసాన్ మహాసభ నేత డి.హరినాథ్, రైతుకూలీ సంఘం నేత వీరబాబు పాల్గొన్నారు.

వేదపాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగర శివారు పోరంకి గ్రామంలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం స్మార్త వేద పాఠశాల జూన్ 5 నుంచి పునఃప్రారంభమవుతుందని, విద్యాభ్యాసం కొరకు విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ప్రవేశ దరఖాస్తులు పొందవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ వికాసానికి తోడ్పడే వేద విద్య అభ్యున్నతికి, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కల్పించడానికి దేవస్థానం కట్టుబడి ఉందని, వేదవిద్యార్థులకు మరింతగా ప్రోత్సాహం అందిస్తామని ఈవో పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై.. మినీ ఫ్లైఓవర్!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. ఈ ఫ్లైఓవర్ కొండ మీద టర్నింగ్ వరకు 265 మీటర్ల మేర నిర్మించాలన్న ప్రతిపాదనను ఆయన రూపొందించారు. ఓ ప్రైవేటు కన్సల్టెన్సీతో పాటు విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కాలేజీ (స్పా), సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ బృందంతో సంయుక్తంగా ప్రతిపాదిత నూతన ఘాట్ మార్గంలో ఫ్లైఓవర్‌కు ప్రతిపాదన డిజైన్స్ రూపొందించారు. ఇది దిగువన ఉన్న ఎన్‌హెచ్ - 65 నుంచి ప్రతిపాదిత నూతన ఘాట్ అలైన్‌మెంట్ మీదుగా టర్నింగ్ వరకు నిర్మించి ప్రధాన ఘాట్‌మార్గానికి అనుసంధానిస్తారు.

కూటమి ప్రభుత్వం రాకతో..

ఇంద్రకీలాద్రిపై రెండో ఘాట్ మార్గాన్ని అభివృద్ధి పరచాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇది కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనికి అడుగులు పడ్డాయి. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి దుర్గగుడి అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దుర్గగుడికి సంబంధించి రెండో ఘాట్ మార్గాన్ని ఇంతకు ముందు ఆయన ప్రతిపాదించారు. ఘాట్ మార్గాన్ని ఎన్‌హెచ్ - 65 నుంచి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో 10 మీటర్ల వెడల్పున ఘాట్ మార్గాన్ని అభివృద్ధి చేయాలనుకున్నారు. అక్కడ ఉన్న స్థలాభావం రీత్యా చూసినా కూడా 10 మీటర్లకు మించి లేదు. దీంతో ఇది అవసరాలకు తగినట్టుగా లేదని ఆయన భావించారు. దీంతో 16 మీటర్ల వెడల్పుతో కూడిన ఫ్లై ఓవర్ మార్గాన్ని అభివృద్ధి చేయాలని ఆయన నిర్ణయించారు. ఫ్లై ఓవర్ పొడవు ప్రస్తుతం 265 మీటర్లుగా ఉంటుంది.

11 ఫ్లోర్లతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ :

ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న వాహనాల పార్కింగ్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని.. ఈ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. ఘాట్ మార్గంలో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయటం వల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి వీలుగా ఓం టర్నింగ్ మలుపు దగ్గర దానిని అనుకుని కొండ దిగువన 11 అంతస్తులతో కూడిన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌కు ప్రతిపాదించటం జరిగింది. దిగువన 38,949 చదరపు అడుగులు విస్తీర్ణంలో ఈ మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ కాంప్లెక్స్ 40 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఇది ఘాట్ రోడ్డుకు అనుసంధానమవుతుంది. నాలుగు చక్రాల వాహనాలు 800 వరకు, ద్విచక్రవాహనాలు 600కు పైగా పార్కింగ్ చేసుకునేలా మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దనున్నారు.

మోడ్రన్ ఠాణా!

(5వ పేజీ తరువాయి)

అత్యంత కీలకమైన ప్రదేశం. వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు ఇక్కడే ఆందోళన, నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఇక్కడ ఏ మూలన ఏం జరుగుతుందో సీసీ కెమెరాల ద్వారా వీడియో వాల్‌పై వీక్షించవచ్చు. పోలీసులు డ్రగ్స్, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి చేసే ప్రచారం ఈ వీడియోవాల్‌లో డిస్‌ప్లే అవుతుంది. మొదటి అంతస్తులో సెంట్రీ, మహిళా సహాయ కేంద్రం, కోర్టు మానిటరింగ్ విభాగం, సైబర్ సెల్, సీడీఆర్ అనాలసిస్ సెల్, ఎల్‌హెచ్ఎంఎస్‌సెల్‌ఉంటాయి. ఒక్కోసెల్‌కు ఒక్కోప్రత్యేక చాంబర్ ఉంటుంది. రెండో అంతస్తును స్టేషన్ సీసీఎస్ విభాగానికి కేటాయించారు.

ఎఫ్ఆర్‌సీలో హాజరు

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, కేడీ షీటర్లకు ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వాళ్లంతా వచ్చి పుస్తకంలో సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఇలా షీటర్ల హాజరును పుస్తకాలతో కాకుండా టెక్నాలజీతో నిర్వహించడానికి అధికారుల శ్రీకారం చుట్టారు. షీటర్ల హాజరు నమోదుకు ఫేసియల్ రికగ్నైజేషన్ సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. స్టేషన్‌కు వచ్చిన షీటర్లను ఈ కెమెరా ముందు నిలబెడతారు. వారి ముఖాన్ని కెమెరా రీడ్ చేసి కౌన్సెలింగ్‌కు హాజరైనట్టుగా హాజరును నమోదు చేస్తుంది.

మూడో అంతస్తులో ఏసీపీ కార్యాలయం

స్టేషన్ భవనంలో మూడో అంతస్తును ఏసీపీ కార్యాలయానికి కేటాయించారు. సత్యనారాయణపురం ఉత్తర మండలం పరిధిలో ఉంటుంది. ప్రస్తుతం ఈ ఏసీపీ కార్యాలయం లోటస్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అత్యాధునిక హంగులతో సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ సిద్ధమవ్వడంతో మూడో అంతస్తులో ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల నెలకు వేలాది రూపాయల అద్దె మిగులుతుందని అధికారులు భావించారు. లోటస్‌లో ఉన్న ఏసీపీ కార్యాలయాన్ని త్వరలో ఎస్ఎన్‌పురం పీఎస్ పైకి తీసుకురాబోతున్నారు.

విశ్రాంతి గదులు, వ్యాయామశాల

విధుల్లో ఉన్న సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం చేయడానికి స్టేషన్ పైఅంతస్తులో ఏర్పాట్లు చేశారు. కొంతమంది సిబ్బంది రాత్రిపూట విధులు నిర్వర్తిస్తారు. ఇది కాకుండా ఏమైనా భారీ కార్యక్రమాలు, ఆందోళనలు జరిగిన ఇతర స్టేషన్ల నుంచి బందోబస్తుకు సిబ్బందిని తీసుకొస్తారు. ఇలా విధుల్లో ఉండి అలసిపోయిన వారు విశ్రాంతి తీసుకోవడానికి పురుషులు, మహిళలకు వేర్వేరుగా విశ్రాంతి గదులు నిర్మించారు. వ్యాయామం కోసం రూ.10లక్షలతో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు.

పిల్లల కోసం ప్రత్యేకం

మహిళా సిబ్బంది కొంతమంది పిల్లలను తీసుకొస్తారు. అప్పుడప్పుడూ పురుష సిబ్బంది వారిని వెంటబెట్టుకొస్తారు. ఈ సిబ్బంది కాకుండా వివిధ ఫిర్యాదుల నేపథ్యంలో స్టేషన్‌కు కొంతమంది పిల్లలను తీసుకుని వస్తారు. ఇలా స్టేషన్‌కు వచ్చిన పిల్లలు ఏడవకుండా, అల్లరి చేయకుండా భవనం పైఅంతస్తులో గేమింగ్ జోన్ ఏర్పాటు చేశారు.



రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణ, కలెక్టర్ బాలాజీ





విద్యాధరపురం రేషన్ డిపోలో సరుకులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, యనమలకుదురు రేషన్ షాపులో..

బియ్యం అక్రమంగా తరలిపోకూడదనే..

» పారదర్శకంగా డిపోల వద్ద పంపిణీ

» దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దే..

» అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

» షాపుల పునఃప్రారంభంలో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : చౌకబియ్యం పక్కదోవ పట్టకుండా రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం రాజుపేటలో ఆదివారం చౌకడిపోను కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి పునఃప్రారంభించారు. కార్డుదారులకు 5 కిలోల బియ్యం, అరకిలో పంచదార, కిలో కందిపప్పులను మంత్రి అందజేశారు. వృద్ధురాలు బోయిన సుశీల, గొడవర్తి మహాలక్ష్మిల ఇళ్లకు మంత్రి, కలెక్టర్ వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల వినతుల మేరకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు సమీక్షించి చౌకడిపోలను పునఃప్రారంభించారన్నారు. గతంలో బియ్యం పక్కదోవ పట్టిందని, కాకినాడ నుంచి సముద్రమార్గంలో ఇతర ప్రాంతాలకు పోయిందన్నారు. చౌక బియ్యం ఒక స్కాంలా గత ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజలకు పారదర్శకత లక్ష్యంతో చౌక డిపోల ద్వారా రేషన్ సరుకులను పునఃప్రారంభించామన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 70 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా మరో 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. బియ్యం వద్దనుకునే వారికి నగదు, లేదా రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, చౌక డిపోల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా పౌరసరఫరాల అధికారికి ఫోన్ చేయవచ్చన్నారు. డీఎస్‌వో వి.పార్వతి, ఆర్డీవో కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో ప్రారంభించిన కలెక్టర్ లక్ష్మీశ

విద్యాధరపురం : రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం విద్యాధరపురంలోని డీలర్ గురునాథం రేషన్ డిపోలో సరుకులను కార్డుదారులకు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 957 రేషన్ షాపుల ద్వారా 5,90,243 కార్డుదారులకు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో దివ్యాంగులు, 65ఏళ్ల పైబడిన 57,690 మంది కార్డుదారులను గుర్తించామని, వారికి ఇంటి వద్దనే రేషన్ డీలర్లు సరుకులు తీసుకువెళ్లి అందజేస్తారన్నారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు దివ్యాంగులు, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఇంటికే రేషన్ సరుకులు తీసుకువెళ్లి అందజేయాలని ఆదేశించామన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా 1 నుంచి 15లోగా సరుకులు సరఫరా చేయాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చామని, ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచి సరుకులు అందచేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, దానిపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కానింగ్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, డీఎస్‌వో ఎ.పాపారావు, ఎ.ఎస్.వో చల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎం.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు. కాగా, భవానీపురంలోని రేషన్ డిపోలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూడీసీ ఐ.శివ, రేషన్ డీలర్ లీలా ప్రసాద్, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాల్లో 'బంగారం శ్రీను'

» నగరంలో రెండుచోట్ల లీజుల్లో భాగస్వామ్యం

» వాసవీ క్లబ్‌లో పరిచయమైన వారితో వ్యాపారం

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ముచ్చెర్ల శ్రీనివాసరావు.. బంగారం చిట్టీలను నిర్వహించి వందలాది మంది నెత్తిన కుచ్చు టోపీ పెట్టిన వ్యక్తి. ప్రజల్లో ఆశలను రేకెత్తించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన అతడు చేసిన బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తనకు బంగారం, నగదు చిట్టీల వ్యాపారం తప్ప మరొకటి లేదని రెండు రోజుల క్రితం ఖాతాదారులకు వాయిస్ సందేశాన్ని పంపాడు. రెండు, మూడునెలల క్రితం శ్రీనివాసరావు కల్యాణ మండపాల నిర్వహణలోకి దిగాడు. విజయవాడ హనుమాన్‌పేటలో ఉన్న ఆలపాటి కల్యాణ మండపాన్ని, సితార సెంటర్‌లో ఉన్న ఎస్ కన్వెక్షన్ సెంటర్‌ను మరో ఇద్దరు భాగస్వాములతో కలిసి అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. వాసవి క్లబ్‌లో చురుకైన సభ్యుడిగా వ్యవహరిస్తూ అందులోని ఇతర సభ్యులను పరిచయం చేసుకున్నాడు. వారితో తాను చిట్టీల వ్యాపారం చేస్తున్నానని చెప్పి కొత్తగా మరో వ్యాపారం మొదలుపెడుతున్నానని, అందులో భాగస్వాములు కావాలని ప్రతిపాదనలు చేశాడు. అంతా వాసవీ క్లబ్‌లో సభ్యులుగా ఉండటంతో శ్రీనివాసరావు చెప్పిన మాటలు నమ్మారు. సితార సెంటర్‌లో ఉన్న ఎస్ కన్వెక్షన్ సెంటర్‌ను కృష్ణలంకకు చెందిన వాసవి క్లబ్ సభ్యుడు, అతడి వియ్యంకుడితో కలిసి లీజుకు తీసుకున్నారు. ముగ్గురు రూ.15లక్షల చొప్పున పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరి నుంచి రూ.30లక్షలు వసూలు చేసి, కన్వెక్షన్ సెంటర్‌లోకి అవసరమైన ఫర్నీచర్ తాను కొనుగోలు చేస్తానని చెప్పాడు. తీరా రికార్డుల్లో ఆ భాగస్వాములు ఇద్దరూ రూ.10లక్షలు చొప్పున ఇచ్చినట్టు రాశాడు. చిట్టీల వసూలు సొమ్మునే కల్యాణ మండపాల నిర్వహణ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టినట్టు తెలుస్తోంది. రెండు, మూడునెలల క్రితమే ఎస్ కన్వెక్షన్ సెంటర్‌ను లీజుకు తీసుకున్నట్టు తెలిసింది. దీనికి ముందు హనుమాన్‌పేటలోని ఆలపాటి రామారావు హాలును లీజుకు తీసుకున్నారు. ఇందులో రూ.5లక్షలు పెట్టుబడి పెట్టి రూ.9లక్షలు వాడుకున్నాడని భాగస్వాములు చెబుతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వారిలో వేడిని చల్లార్చడానికి వాయిస్ సందేశం పంపాడు. తనకు చిట్టీల వ్యాపారం తప్ప మరే ఇతర వ్యాపారాలు లేవని, రెండు రోజుల్లో వచ్చి డబ్బులు బకాయి ఉన్న వాళ్లందరికి సర్దుబాటు చేస్తానని చెప్పాడు. బాధితులకు భరోసా ఇచ్చేందుకు ప్రయత్నించిన ముచ్చెర్ల శ్రీనివాసరావు వాయిస్ సందేశంలో కల్యాణ మండపాల లీజుల గురించి ఎందుకు ప్రస్తావించలేదన్న ప్రశ్నఉత్పన్నమవుతోంది. శ్రీనివాసరావు సందేశంపై బాధితులు నమ్మకాన్ని వ్యక్తం చేయడంలేదు. బాధితులకు ఐపీ నోటీసులు ఇచ్చేందుకు శ్రీనివాసరావు న్యాయవాదులతో సమాలోచనలు చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. మరోపక్క పోలీసులు మాత్రం అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

బీసీ వెల్ఫేర్‌లో బదిలీలలు!

(5వ పేజీ తరువాయి)

ఆఫీసర్ (ఏబీసీడబ్ల్యూవో) ద్వారా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ (డీబీసీడబ్ల్యూవో)కు వెళ్లాల్సి ఉండగా.. ఈ ప్రొసీజర్‌ను బీసీ వెల్ఫేర్‌లో అస్సలు అనుసరించటం లేదు. జిల్లా బీసీ వెల్ఫేర్ (కృష్ణా) అధికారులు డైరెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం కాలేజీ నుంచి వచ్చిన వారికి కాలేజీలలోనూ, హాస్టల్ వారికి హాస్టల్, ప్రీ మెట్రిక్ వారికి ప్రీ మెట్రిక్ స్థానాలలో మాత్రమే పోస్టింగ్‌లు కల్పించాల్సి ఉంది. కానీఇష్టానుసారంగా కాలేజీ నుంచి వచ్చిన వారికి ప్రీ మెట్రిక్‌లో పోస్టింగ్‌లు కల్పిస్తూ బదిలీలు నిర్వహించారు.

పదేళ్లుగా ఒకే చోట..!

విజయవాడ సెంట్రల్‌లో గుణదల కాలేజీ హాస్టల్‌లో పనిచేసే వార్డెన్ గత పది సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్నారు. గతంలో ఐదేళ్లు పనిచేసిన ఆమెను ఆరో ఏట ఇబ్రహీంపట్నం బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నం వెళ్లిన ఆమె వెంటనే డిప్యూటేషన్ మీద గుణదల వచ్చేశారు. జీతం తీసుకునేది ఇబ్రహీంపట్నం అయినప్పటికీ పనిచేసేది మాత్రం గుణదలలోనే కావటం గమనార్హం. ఇప్పటికి పదేళ్లుగా అదే సీటులో ఉంటున్నారు. తాజా బదిలీల సందర్భంగా ఇబ్రహీంపట్నంలో పనిచేస్తున్నట్టుగా చెప్పుకుంటూ మళ్లీ గుణదలలోనే సెటిల్ అవ్వటానికి బదిలీకి చేసిన ప్రయత్నాన్ని అధికారులు సాకారం చేశారు. ప్రీ కౌన్సెలింగ్ పేరుతో ఆమెకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి.

షాడో బెదిరింపులు

గుడ్లవల్లేరు కాలేజీ హాస్టల్‌లో పనిచేస్తున్న ఓ వార్డెన్‌కు ఇంకా ఐదు సంవత్సరాలు నిండలేదు. ఈ వార్డెన్ చాలా ఓవర్. ఆయనకు డైరెక్టరేట్‌తో, డైరెక్టరేట్‌కు ఆయనతో అవసరం ఉందని చెప్పుకుంటారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేయకపోయినా.. రిక్వెస్ట్ పెట్టుకుని విజయవాడ తూర్పుకు లైన్ క్లియర్ చేసుకున్నట్టు సమాచారం. ఇదే స్థానానికి నిబంధనలకు అనుగుణంగా ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నందిగామ కాలేజీ హాస్టల్ వార్డెన్ విజయవాడ తూర్పుకు ఆప్షన్ పెట్టుకున్నారని తెలిసింది. ఆ వార్డెన్‌కు నాలుగేళ్ల బాబు ఉన్నాడు. ఆటిజంతో బాధ పడుతున్నాడు. విజయవాడలో ఉంటే మెరుగైన వైద్యం చేయించుకోవచ్చన్న ఉద్దేశ్యంతో ఆ వార్డెన్ విజయవాడ తూర్పుకు దరఖాస్తు చేసుకుంటే.. గుడ్లవల్లేరులోని షాడో ఒకరు.. రావటానికి వీల్లేదంటూ ఆ మహిళా వార్డెన్‌పై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. విజయవాడ తూర్పు వద్దంటున్నారు కాబట్టి.. విజయవాడ సెంట్రల్‌కు వెళతానని ఆమె చెప్పినా వినటం లేదని తెలిసింది. విజయవాడ సెంట్రల్‌లోకి రావటానికి కూడా షాడో అంగీకరించటం లేదని సమాచారం. గుడ్లవల్లేరు ఖాళీగా ఉందనుకుంటే దానిని కూడా షాడో బ్లాక్ చేయించినట్టు తెలిసింది. గుడివాడలో కాలేజీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేసే ఒకరు ప్రీమెట్రిక్ విభాగంలో బదిలీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వాస్తవానికి కాలేజీ హాస్టల్స్‌లో పనిచేసే వారిని ప్రీ మెట్రిక్ విధానంలో ఇవ్వకూడదు. కానీ ఆమెకు ప్రీ మెట్రిక్ విధానంలో పంపించటానికి చర్యలు చేపట్టారు.

ప్రీ కౌన్సెలింగ్ పేరుతో అడ్డగోలు బదిలీలు

ప్రీ కౌన్సెలింగ్ ఎక్కడా ఉండదు. ప్రీ కౌన్సెలింగ్ పేరుతో ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు రిక్వెస్ట్ బదిలీలు పెట్టుకున్న వారిని పదే పదే ప్రీ కౌన్సెలింగ్‌కు పిలిచి వారితో బేరసారాలు నడిపినట్టు సమాచారం. ఇలా బేరసారాలు కుదిరిన తర్వాత ఎంపిక చేసిన స్థానాలకు బదిలీలు చేస్తున్నట్టు తెలిసింది.

అమ్మో జూన్!

(5వ పేజీ తరువాయి)

అదనపు కోచింగ్‌లను బట్టి ఈ ధర మరింతగా పెరుగుతుంది. ప్రతిఏడాది పేద, మధ్య తరగతి వర్గాలు బడ్జెట్ కేటాయింపుల కోసం అల్లాడిపోతున్నాయి.

పుస్తకాల ధరలు కొంత మేలు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మొత్తం పుస్తకాలను యాజమాన్యాలే ఇస్తాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో విద్యార్థులు నోట్ పుస్తకాలను బయట కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టుకు కనీసం రెండు రకాల నోట్ పుస్తకాలను కొనుగోలు చేయాలి. విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని బుక్ స్టాల్స్‌లోకి నోట్ పుస్తకాల స్టాక్ చేరుతోంది. గడచిన ఏడాది కంటే ఈ ఏడాది నోట్ పుస్తకాల ధరలు విద్యార్థుల తల్లిదండ్రులకు కొంత ఊరటను ఇవ్వబోతున్నాయి. గడచిన ఏడాది 200 పేజీల తెల్లకాగితాలు, రూల్ పుస్తకం ఒక్కొక్కటి రూ.35లకు విక్రయించారు. ఈ ఏడాది ఈ పుస్తకం ధరను రూ.30లుగా నిర్ణయించారు. పుస్తకాల బ్యాగ్‌లు, టిఫిన్‌బాక్స్ బ్యాగ్‌ల ధరలు మాత్రం యథావిధిగానే ఉన్నాయి. పుస్తకాల బ్యాగ్ ధర రూ.150 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. టిఫిన్ బాక్స్ బ్యాగ్ ధర రూ.100 నుంచి రూ.200 వరకు ఉంది.

చైర్మన్ ఎన్నిక నేడు..

(5వ పేజీ తరువాయి)

జి.లోవరాజుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్ఐ సెక్టార్-1 కె.వి.జి.వి.సత్యనారాయణ,ఎస్ఐ-2 జి.వెంకటేశ్వరరావులకు బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం నుంచే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్లను బారికేడ్లతో మూసివేశారు. కాగా, గతనెల 19, 20 తేదీల్లో ఈ ఉప ఎన్నిక జరగాల్సి ఉండగా, కోరం లేకపోవడంతో ఎన్నిక రద్దుచేశారు. తిరిగి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు సోమవారం ఎన్నిక నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిపి మొత్తం 21 ఓట్లు ఉన్నాయి. ఒక సభ్యురాలు అమెరికాలో ఉండటంతో 20 ఓట్లకు గాను, పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలబడటంతో టీడీపీ బలం అనూహ్యంగా 11కు చేరింది. వైసీపీ బలం 17 నుంచి 9కి పడిపోయింది. సోమవారం జరిగే ఉపఎన్నికలో సంఖ్యాబలం లేకపోయిన వైసీపీ సభ్యులు పాల్గొనే అవకాశం ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో ఇద్దరు టీడీపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ఎట్టకేలకు చిక్కాడు!

» పూణెలో బాంబు కాల్ నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు

» నిందితుడు మానసిక రోగి

» పూణె, షోలాపూర్ కంట్రోల్‌రూమ్‌లకు కూడా బెదిరింపు కాల్స్

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : బెజవాడలో బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్‌లో బాంబులు పెట్టానని బెదిరింపు కాల్స్ చేసిన నిందితుడు ఎవరన్నది తేలిపోయింది. అతడికి పోలీసులు సంకెళ్లు వేశారు. విజయవాడలో పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసిన రోజునే మహారాష్ట్రలోని పూణె, షోలాపూర్ కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేశాడు. ఇలా ఫోన్లు చేసిన వ్యక్తి షోలాపూర్‌కు చెందిన సచిన్ మారుతి షిండేగా గుర్తించారు. గత నెల 24న ఎల్‌టీటీ రైలులో ప్రయాణిస్తూ తన సెల్‌ఫోన్ నుంచి విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో బాంబులు అమర్చినట్టు చెప్పి ఫోన్ కట్ చేశాడు. తర్వాత పోలీసులు తిరిగి ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఈ ఫోన్‌కాల్ చేయడానికి ముందు రోజున పూణె, షోలాపూర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌లకు ఈ విధంగానే బాంబు బెదిరింపు కాల్స్ చేశాడు. సచిన్‌ను పూణె పోలీసులు పట్టుకున్నారు. తర్వాత షోలాపూర్ పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకెళ్లాలని భావిస్తున్నారు. నిందితుడికి వైద్య పరీక్షలు చేయించగా, అతడు మానసిక రోగి అని వైద్యులు నిర్ధారించారు. మహారాష్ట్రలో సచిన్‌పై ఇలాంటి బెదిరింపు కాల్స్ కేసులు ఇంతకు ముందు రెండు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. సచిన్ అరెస్టు సమాచారాన్ని అక్కడి పోలీసులు విజయవాడ పోలీసులకు తెలియజేశారు. సచిన్ మానసిక రోగి కావడంతో పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచినా రిమాండ్ విధించే అవకాశం ఉండదని పోలీసులు భావిస్తున్నారు.

ఇష్టానికి మాట్లాడితే చట్టపరమైన చర్యలు

» గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండిపాటు

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : 'గ్రామ రెవెన్యూ అధికారుల సంఘనేత భూపతిరాజూ.. నీ ఇష్టానికి నువ్వు మాట్లాడితే చట్టపరమైన చర్యలకు కూడా వెనుకాడేది లేదు. నాయకుడివైతే సభ్యుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలి కానీ, ఎవరినో సంతోషపెట్టడానికి ఇలాంటి చౌకబారు మాటలు భవిష్యత్తులో కూడా మాట్లాడొద్దు' అని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.ఆంజనేయకుమార్, అనుపమ హెచ్చరించారు. ఆదివారం వారు విజయవాడలో మీడియాతో మాట్లాడారు. విశాఖ జిల్లాలో జరిగిన మీడియా సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఓపిగ్గా సమాధానాలు చెప్పారన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రిని కలవకపోవడానికి గల కారణాలను వెల్లడించారని తెలిపారు.బొప్పరాజును నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కొంతమంది నాయకులు, ప్రభుత్వ పెద్దల దృష్టిని ఆకర్షించడానికి భూపతిరాజును అడ్డం పెట్టుకుని చౌకబారు వ్యాఖ్యలు చేయించారని ఆరోపించారు. మోసపూరిత ప్రకటనలతోగత ప్రభుత్వ హయాంలో వీఆర్వోలను మోసంచేసిన విషయం రాష్ట్రంలో ప్రతి గ్రామ రెవెన్యూ అధికారికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వం దృష్టిలో హీరో కావడానికి ఒక అసంబద్ధ జీవోతో 3795 మంది గ్రేడ్2 వీఆర్వోల జీవితాన్ని నాశనం చేసిందికాక, వీఆర్వో వ్యవస్థను అస్తవ్యస్తం చేసి, బొప్పరాజు వెంకటేశ్వర్లుపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ గుర్తింపు, సాన్నిహిత్యం పెంచుకోవాడనికి నిబద్ధత కలిగిన నాయకులపై అక్కసు వెళ్లగక్కనవసరం లేదని, బాధ్యతతో పనిచేస్తే గుర్తింపు, పేరు ప్రఖ్యాతలు అవే వస్తాయన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఉండే వ్యామోహంలో ఒక్క శాతమైనా వీఆర్వోల సమస్యలపై ఉంటే సంఘం ఇలా ఉండేది కాదన్నారు. బొప్పరాజు అహర్నిశలు శ్రమిస్తూ, వాటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తూ, చాలా సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడిగా జ్యోతి ప్రకాష్

విజయవాడ స్పోర్ట్స్: మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా జ్యోతిప్రకాష్ ఎన్నికయ్యారు. ఆదివారం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలోని అసోసియేషన్ హాలులో జరిగిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. కార్యదర్శిగా ఎం.హరిగోపాల్ ఎన్నికయ్యారు. ఎలక్షన్స్ స్టేట్ సెక్రటరీ ఎస్.రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలి : సీపీఎం

గవర్నర్‌పేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇళ్లకు అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఆదేశాలు ఇవ్వడం శోచనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక శ్రీశ్రీ భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ మొత్తాన్ని అదానీకి కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని, స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. సీపీడీసీఎల్ పరిధిలో ఉమ్మడి కృష్ణా , గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని ముఖ్య నగరాల్లో మీటర్లు బిగించేందుకు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం నిలిపివేయాలని, ఇప్పటికే వ్యాపార సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, అదానీ సంస్థతో మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, సర్దుబాటు చార్జీల భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న హజరత్తయ్యగుప్తా

అన్న సంతర్పణ సమితి వార్షికోత్సవం

వన్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలిగా ఉన్నవారికి ఆహారం అందించటం మహత్తర కార్యక్రమమని ఆర్య వైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ అన్నారు. అన్న సంతర్పణ సమితి నాలుగో వార్షికోత్సవ వేడుక వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో ట్రస్ట్ అధ్యక్షుడు, వ్యవస్థాపక కార్యదర్శి గుండు దిలీప్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. చైర్మన్ డూండీ రాకేష్, విజయవాడ నార్త్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.స్రవంతి రాయ్, హజరత్తయ్య గుప్తా, వంకదారు వాసుదేవరావు, గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా వేసవి శిక్షణ తరగతులను నిర్వహించి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాలుడి సైకిల్ ధ్వంసం చేసిన వైసీపీ మూకలు

» కొత్త సైకిల్ కొనిచ్చిన టీడీపీ నాయకులు



ఇబ్రహీంపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మీది నాశనం చేసే పార్టీ అయితే మాది బాగు చేసే పార్టీ అని టీడీపీ నాయకులు వైసీపీ నాయకులకు బుద్ధి వచ్చేలా ఓ మంచి పని చేశారు. గత నెల 29న ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడి వివాహ రిసప్షెన్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో, అయన మెప్పు కోసం వైసీపీ మూకలు దారిన పోతున్న ఓ బాలుడి సైకిల్ లాక్కొని దాన్ని గిరగిరా గాల్లో తిప్పి కింద పడేసి కాళ్లతో తొక్కి పైశాచిక ఆనందం పొందారు. బాలుడు నా సైకిల్ పాడు చేయవద్దని బోరున విలపిస్తూ బ్రతిమిలాడినా.. సైకిల్ వద్దకు వెళ్లి దాన్ని తీసుకునే ప్రయత్నం చేస్తున్నా పట్టించుకోకుండా సైకిల్‌ను పాడు చేసి తీవ్ర విమర్శలు మూటగట్టుకున్నారు. పైగా వాళ్లే ఆ వీడియో తీసి సోషల్ మీడియాల్లో పెట్టుకొని పోలీసులు కేసు పెట్టేలా చేసుకున్నారు. బాలుడి సైకిల్ పాడైన విషయం తెలుసుకున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ బాలుడికి కొత్త సైకిల్ కొనివ్వాలని టీడీపీ నాయకులను ఆదేశించారు. దీంతో కొండపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు చుట్టుకుదురు శ్రీనివాసరావు, రావి మణిరాజ్ (ఫణి), ధరణికోట విజయలక్ష్మి, మైలా సైదులు, జల్లి కాంతారావు బాలుడి ఇంటికి వెళ్లి కొత్త సైకిల్‌ను అందజేశారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కృష్ణలంక, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 20వ డివిజన్‌కు చెందిన నేటూరి సరోజినికి గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహనిధి రూ.50 వేల ఎల్వోసీతో పాటు రూ.10 వేల వ్యక్తిగత ఆర్థిక సాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతికుమార్ అందజేశారు. ఆదివారం శ్రీరాం హాస్పిట్‌లో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సరోజినికి నగదు అందజేశారు. తెలియజేసిన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధితో పాటు వ్యక్తిగతంగా సాయం చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, క్రాంతికి పార్టీ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా కృతజ్ఞతలు తెలిపారు. అడపా శివ, గల్లా శ్రీను, సాత కాళీ, గల్లా సుబ్బారావు, గణపతి నాగార్జున పాల్గొన్నారు.



రాణిగారితోటలోని రేషన్ షాపు వద్ద సరుకులు తీసుకునేందుకు వచ్చిన కార్డుదారులు



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ 18వ డివిజన్ నాయకులు, డీలర్లు



20వ డివిజన్‌లో సరుకులు అందిస్తున్న టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా

రేషన్ షాపులు కళకళ

ఉదయం 8 గంటల కంటే ముందుగానే క్యూ కట్టిన జనం

రాణిగారితోట/కృష్ణలంక/మొగల్రాజపురం/పటమట/భారతీనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీని ఆదివారం నుంచి ప్రారంభించడంతో తెల్లరేషన్ కార్డుదారులు తరలి వచ్చారు. దీంతో షాపులు కళకళలాడాయి. ఆదివారం ఉదయం 8గంటల కంటే ముందుగానే షాపుల వద్దకు జనం క్యూకట్టారు. మొదటి రోజు పంపిణీని విజయవంతంగా పూర్తిచేసినట్లు డీలర్లు తెలిపారు

రేషన్ షాపుల పునఃప్రారంభం మంచి పరిణామం

కూటమి ప్రభుత్వం రేషన్ షాపులను తిరిగి ప్రారంభించడం మంచి పరిణామమని టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. రేషన్ షాపుల ద్వారా రేషన్ అందిచడాన్ని స్వాగతిస్తూ రాణిగారితోటలో టీడీపీ నాయకులు, రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వం రేషన్ మాఫియాకు ఎండీయూల ద్వారా ఎర్రతివాచీ వేసిందన్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రజల ఇబ్బందులు తొలగించాలని కూటమి ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా రేషన్ అందించే విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. త్వరలో బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు తదితర 5 రకాల వస్తువులు అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు.

20వ డివిజన్‌లో..

కృష్ణలంక 20వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా అధ్వర్యంలో డివిజన్‌లోని రేషన్ డిపోల వద్ద రేషన్ సరుకులను పంపిణీ చేశారు. అడపా శివ, గల్లా శ్రీను, గల్లా సుబ్బారావు, సాతా కాళిబాబు, గణపతి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏడో డివిజన్‌లో..

మొగల్రాజపురం ఏడో డివిజన్‌లో రేషన్ పంపిణీని టీడీపీ నాయకులు నాగుమోతు రాజా, గుమ్మడి గురుప్రసాద్ ప్రారంభించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పటమట సతీష్ చంద్ర పాల్గొన్నారు.

భారతీనగర్‌లో..

4,11 డివిజన్లు, ఆటోనగర్ ప్రజల కోసం ఏపీఐఐసీ కాలనీలోని డిపోనెంబరు 263 రేషన్ డిపోను ఏర్పాటు చేశారు. రేషన్ కోసం ఉదయమే ప్రజలు బారులు తీరారు.

15 వరకు ఉదయం, సాయంత్రం పంపిణీ

పటమట 12వ డివిజన్‌లోని రేషన్ డిపోల వద్ద సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి ప్రారంభించారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం ఏ రేషన్ షాపునకు వెళ్లైనా సరుకులు తీసుకోవచ్చని ప్రజలకు సూచించారు. కొండవీటి ప్రసాద్, కరీం మేదరమెట్ల నారాయణ, రవికుమార్ పాల్గొన్నారు. అయ్యప్పనగర్ సుబ్రహ్మణ్య వీధిలో 2వ నంబరు రేషన్ షాపు వద్ద కార్డుదారులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొప్పన భవకుమార్ రేషన్ పంపిణీ చేశారు.



జేడీ నగర్-2 రేషన్ షాపు వద్ద నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పేదలకు మేలు చేసేందుకే రేషన్ డిపోల పునఃప్రారంభం

- పేదల బియ్యాన్నీ ఆదాయ వనరుగా మార్చుకుంది గత వైసీపీ ప్రభుత్వం: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో పాలనలో చేసిన స్కామ్‌లన్నీ బయటపడుతున్నాయి. రేషన్ బియ్యాన్ని కూడా ఆదాయ వనరుగా మార్చుకుంది. ఇంటింటికీ రేషన్ బియ్యం సరఫరాకు ఏర్పాటు చేసిన వాహనాల్లోనే ఆ పార్టీ నాయకులు అక్రమంగా బియ్యాన్ని తరలించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు మేలు చేయాలనే రేషన్ డిపోలను పునఃప్రారంభించింది. ప్రజలకు అవసరమైన అన్ని సరుకులు అందిస్తుంది' అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం 13వ డివిజన్ జేడీ నగర్ 2లోని 286వ డిపోలో రేషన్ పంపిణీని ఆయన ప్రారంభించారు. రేషన్ డిపోకు రాలేని దివ్యాంగురాలు శివపు రాజుకు ఆయన సరుకులు అందించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూటమి నేతలు ఇళ్లకు వెళ్లి సరుకులు అందించాలని ఆయన సూచించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, పేరేపి ఈశ్వర్, నాగాయలంక శ్రీను, వేములపల్లి శ్రీను, వీరంకి డాంగియా కుమారి, ముమ్మనేని మానస పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..

- భారతీనగర్ మెయిన్‌రోడ్డులో గుంత
- పైపులైన్ మరమ్మతుల కోసం పదిరోజుల క్రితం గొయ్యి తవ్విన వీఎంసీ సిబ్బంది

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్)

నాలుగో డివిజన్ పరిధిలోని భారతీనగర్ కాలనీ మెయిన్ రోడ్డులో ఉన్న మంచినీటి పైపు లీకవుతోంది. వీఎంసీ వాటర్‌వర్క్స్ సిబ్బంది పైపు మరమ్మతులకు కోసం పది రోజుల క్రితం గుంత తీసి పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. దీంతో అది ప్రమాదకరంగా ఉంది. పది రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డులో నీరు భారీగా చేరుతోంది. ప్రజలు రాకపోకలు సాగించాలంటే గుంత కారణంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



భారతీనగర్ కాలనీ మెయిన్ రోడ్డులో తీసిన గుంత

లీకవుతున్న మ్యాన్‌హోల్

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి)

గుణదల రెండో డివిజన్ చిన్న చర్చి వెనుక కొండపైకి ఉన్న మెట్ల మార్గంలో డ్రెయినేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయింది. దీంతో డ్రెయినేజీలో మురుగునీరు పొంగి పొర్లి మెట్ల మీదకు కారుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. ఇబ్బందులు పడుతున్నామని అనేక పర్యాయాలు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



గుణదల చిన్న చర్చి వెనుక మ్యాన్‌హోల్ నుంచి మెట్లపైకి ప్రవహిస్తున్న మురుగునీరు



యార్లగడ్డ సందీప్‌కు నియామకపత్రం అందిస్తున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సందీప్

పటమట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తరఫున ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా పటమటకు చెందిన యార్లగడ్డ సందీప్ నియమితులయ్యారు. నగరంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్య సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి సందీప్ నియామకపత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు ఆర్.కృష్ణయ్య, డాక్టర్ ఎన్.మారేష్‌కు యార్లగడ్డ సందీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో విజయవాడ వేదికగా బీసీ గర్జనను నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో యార్లగడ్డ శ్రీనివాస్, రాదారపు ఎల్లబాబు, నారగాని శంకర్, మరీదు సతీష్, మరీదు రవి పాల్గొన్నారు.



యోగా చేస్తున్న కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు

యోగా..ప్రపంచానికి ఓ వరం

భారతీనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): యోగా..భారతీయ రుషులు ప్రపంచానికి అందించిన గొప్ప వరమని సత్యం యోగాలయం గురువు శ్రీధారణ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా గురునానక్ కాలనీలోని సత్యం యోగాలయంలో ఆదివారం కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులకు శ్రీ ధారణ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని శ్రీధారణ అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంక్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్యామ్‌మనోహర్, జిల్లా సహకార అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, నగర విభాగ సహకార అధికారి పి.కిరణ్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎన్.రంగబాబు, బ్యాంక్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబమే నా కథలకు ప్రేరణ

- రచయిత్రి పి.సత్యవతి

విజయవాడ కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తన కుటుంబమే తన కథలకు ప్రేరణ అని రచయిత్రి పి.సత్యవతి అన్నారు. తన కుటుంబంలో ఎస్ఎస్ఎల్సీ దాటి పై చదువులు, ఉద్యోగం, రచనలు మొట్టమొదటిసారిగా చేసింది తానే అని, కుటుంబంలో తాను చేసిన తిరుగుబాట్లనే కథా రచన చేశానని రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారగ్రహీత పి.సత్యవతి తెలిపారు. ఆదివారం శిఖర స్కూల్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ, విజయవాడ సాహితీమిత్రులు సంయుక్తంగా నిర్వహించిన కథాసంధి కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఇల్లలకాగానే, గొడుగు, పేరులేని పిల్లలు, సూపర్ మామ్ సిండ్రోమ్, దమయంతి కూతూరు లాంటి అనేక కథలు, ఒక హిజ్రా ఆత్మకథ లాంటివి పాఠకుల ఆదరణ పొందాయని ఆమె చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్, శ్రీ శ్రీ విశ్వేశ్వరరావు, సీతారాం, బండ్ల మాధవరావు పాల్గొన్నారు.



కథాసంధి కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయిత్రి సత్యవతి







హైటెన్షన్ రోడ్డు సమీపంలో ఖాళీ స్థలంలో చెత్త, వీఎంసీ పార్కు సమీపంలోని రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, గుంతలు పడిన మెయిన్ రోడ్డు

సమస్యలతో సతమతం

పూడుకుపోయిన సైడు డ్రెయిన్లు, గుంతలు పడిన తారురోడ్లతో విజయలక్ష్మి కాలనీవాసుల అవస్థలు





వీఎంసీ వోల్గా ఆర్చరీ ఎదురురోడ్డు, వీఎంసీ పార్కు సమీపంలో పూడిపోయిన సైడు డ్రెయిన్లు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): భారతీనగర్ హైటెన్షన్ రోడ్డుకు పక్కన ఆటోనగర్ ప్రాంతానికి చేరువలో మహానాడు రోడ్డుకు ఆనుకుని విజయలక్ష్మి కాలనీ ఉంది. కాలనీలో సమస్యలతో కాలనీవాసులు సతమతమవుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలనీ ఏర్పడిన కొత్తలో నిర్మించి సైడు డ్రెయిన్లు, వేసిన తారురోడ్లు దెబ్బతినడంతో చిన్న వర్షం కురిసినా కాలనీ నీటిలో మునిగిపోతోంది. కాలనీలోని మెయిన్‌రోడ్డు, ఎస్ఎన్ ఆటో ఎంటర్‌ప్రైజెస్ పక్క రోడ్డు..తారురోడ్లు. వీటిని నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో గుంతలు పడి అధ్వానంగా మారాయి. ఈ రోడ్డులో ప్రయాణించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో ఉన్న సైడ్ డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. కాలువలు పూడుకుపోయాయి. దీంతో చిన్న వర్షం కురిసినా వాన నీటితో రోడ్డు మునిగిపోతోంది. మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది.

రాత్రివేళల్లో మందుబాబుల తిష్ట

కాలనీ సమీపంలోని మహానాడు రోడ్డులో మద్యం షాపులు ఉండడంతో కొందరు మందుబాబులు రాత్రి సమయంలో ఆటోలో, ద్విచక్రవాహనాలపై వచ్చి కాలనీలోని వీఎంసీ పార్కు, పలు అంతర్గత రోడ్లలో మద్యం తాగుతున్నారు. గుంపులుగా వచ్చి గంటల తరబడి అక్కడే తిష్ట వేస్తున్నారు. మహిళలు ఆ రోడ్డులో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు.



రేణుక అపార్ట్‌మెంట్ పక్కన తాగిపడేసిన మద్యం సీసాలు

డంపింగ్ యార్డుల్లా ఖాళీ స్థలాలు

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగునీరు చేరడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల గురించి యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు తమ నివాసాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో మినీ డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. వీఎంసీ పార్కు సమీపంలోని రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి.

ఇంద్రకీలాద్రిపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, లీలా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహామండపం 7వ అంతస్థులో ఆదివారం మేళతాళాల మధ్య భక్తి, శ్రద్ధలతో శాస్త్రోక్త, వేదోక్తంగా నిర్వహించారు. అర్చకులు లోక కల్యాణం కోసం సంకల్పం చెప్పారు. దేవేరులకు మాంగళ్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాలను భక్తులు కన్నులారా వీక్షించారు. సేవలో ఈవో శీనానాయక్ పాల్గొన్నారు.

విశేష పూజలు

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరులకు ఆదివారం విశేష పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు.

భక్తుల రద్దీ

కనకదుర్గమ్మ దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి చ్చారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైకి చేరుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. దర్శనం టికెట్ స్కానింగ్ పాయింట్, టికెట్ కౌంటర్లను ఈవో పరిశీలించారు. భక్తులకు అమ్మవారి దర్శనం త్వరగా అయ్యేందుకు అంతరాలయ దర్శనం నిలుపుదల చేసి, ముఖ మండప దర్శనం ఏర్పాటు చేశారు. టోల్ గేట్‌నుంచి వీఐపీ వాహనాలు అనుమతించకుండా, కట్టడి చేసి, సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యమిచ్చారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత లైన్లు సాధారణస్థాయికి చేరాక అంతరాలయ దర్శనం పునఃప్రారంభించారు.



కల్యాణం జరిపిస్తున్న పండితులు, కార్యక్రమంలో పాల్గొన్న ఈవో శీనానాయక్

దుర్గమ్మను దర్శించుకున్న సీపీ

కనకదుర్గమ్మను నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. దేవస్థానం ఏఈవో చంద్రశేఖర్ వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. సీపీ వెంట పశ్చిమ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ ఉన్నారు.



పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో చంద్రశేఖర్

క్యాన్సర్‌తో పోరాడి.. కిరీటాన్ని గెలుచుకుని..

చిన్నప్పుడు ఏదైనా చిన్న దెబ్బతగిలితేనే ఎంతో హైరానా పడిపోతారు అందరూ. కానీ క్యాన్సర్ అంటే ఏంటో సరిగా తెలియని వయసులోనే దాని బారిన పడి పోరాడి గెలిచి నేడు ప్రపంచ సుందరిగా నిలిచారు ఓపల్ సుచాత షుంగ్‌సిరి. క్యాన్సర్‌తో తనలా ఎవరు ఇబ్బంది పడకూడదని 'ఓపల్ ఫర్ హర్' అనే ప్రాజెక్ట్‌ను ఆమె ప్రారంభించారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు ఈ థాయ్‌లాండ్ భామ. ఈ ప్రాజెక్ట్ గురించి పలు సందర్భాల్లో ఆమె పంచుకున్న సంగతులు..



నాకు పదహారవ ఏటనే రొమ్ములో కణితి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలిసినప్పుడు ఎంతో బాధ పడ్డా, భయపడ్డా. నాకిక భవిష్యతే లేదని నిరాశ చెందా. కానీ భయంలో నుంచి నాలో ధైర్యం పుట్టుకొచ్చింది. దానితో క్యాన్సర్‌ను జయించా. అయితే ఆ పరిస్థితుల్లో నా కుటుంబం, చుట్టూ ఉన్న సమాజం నాకెంతో అండగా నిలబడింది. మరి నాలా ఇలాంటి అండ లేని వారి పరిస్థితి ఏంటనే ఆలోచనే 'ఓపల్ ఫర్ హర్' స్థాపనకు పునాది అయింది.

నాలా అండ లేని వారి కోసం

క్యాన్సర్ సంక్లిష్ట సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను తెలిసిన వారితో పంచుకున్నాను. నేను చెప్పిన ఆ అనుభవాలు తమకు స్ఫూర్తినిచ్చిందని, తామూ క్యాన్సర్‌ను జయించామని కొందరు చెప్పారు. అప్పుడే క్యాన్సర్ రోగులకు అవగాహనతో పాటు మనోధైర్యాన్ని అందించాలని అర్థమయింది. నాలానే క్యాన్సర్‌ను జయించిన వారి జీవిత కథలు చెప్పి మరికొందరికి జీవితం మీద ఆశ కలిగించాలని నిర్ణయించుకున్నా. ఆలోచన అయితే ఉంది కానీ దానిని సరైన వేదిక లేదు. 'ఓపల్ ఫర్ హర్' స్థాపనతో ఆ వేదిక దొరికింది.

నా సంపాదన కూడా..


'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్ట్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, దానిని ముందుగా గుర్తించాల్సిన ఆవశ్యకత తెలియజేశా. క్యాన్సర్‌ను జయించిన వారితో పాడ్‌కాస్టలు, వైద్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంతో మందిలో ఆత్మస్థైర్యం నింపడం ప్రారంభించా. అయితే ఆ తరువాత నాకో భయంకరమైన చేదు నిజం తెలిసింది. అదేంటంటే చాలా మందికి ఆస్పత్రులకు వెళ్లేందుకు డబ్బులు లేవని. దాంతో అలాంటి వారి కోసం నిధుల సేకరించడం మొదలుపెట్టా. నా సంపాదన కూడా నిరుపేద మహిళల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేశా. ఆపై ఆస్పత్రులు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, లాభాపేక్ష లేని సంస్థలు ఆర్గనైజేషన్లు, థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖతో కలిసి పనిచేయడం ప్రారంభించా. ఇలా ఇప్పటి వరకూ ఎంతోమంది థాయ్ మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించా. ప్రస్తుతం ఈ మిస్‌వరల్డ్ పోటీల ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన గురించి 'ఓపల్ ఫర్ హర్' స్వరాన్ని ప్రపంచమంతా వినిపించగలిగా.

ఆరోగ్యమే ప్రధానం

క్యాన్సర్ నన్ను, నా ఆలోచనలను ఎంతో మార్చింది. మనిషి జీవితంలో ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ఆరోగ్యం ఉంటేనే తన లక్ష్యాలు చేరుకోగలరు, ఏదైనా సాధించగలరు.

ప్రపంచమంతా విస్తరించాలి..

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. థాయ్‌లాండ్‌లోనే ఏటా సుమారు 2 వేల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీటిలో 5 శాతం కంటే తక్కువ కేసులు మాత్రమే తొలి దశలో బయటపడుతుండడం బాధాకరం. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సులభంగా దానిని జయించవచ్చు. అందుకే 'ఓపల్ ఫర్ హర్' కేవలం థాయ్‌లాండ్‌కు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని అనుకుంటున్నా. ప్రపంచ నలుమూలల ఉన్న రొమ్ము క్యాన్సర్ బాధితులకు జీవితంపై ఆశలు రేకెత్తించాలని భావిస్తున్నా.



క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు!

మన వాళ్లకు క్రికెట్ అంటే పిచ్చి. గ్రౌండ్‌లో అయినా మొబైల్‌లో అయినా.. "ఈ మధ్యకాలంలో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా క్రికెట్ గేమ్ ఆడటం బాగా పెరిగింది.." అంటారు 'రియల్ క్రికెట్' అనే మొబైల్ గేమ్‌ను అభివృద్ధి చేసిన టీమ్‌లో ఒకరైన అంజూ మన్‌కర్. ఆమెను నవ్య పలకరించినప్పుడు ఈ గేమ్‌కు సంబంధించిన అనేక విశేషాలు వెల్లడించారు.

"క్రికెట్ చాలా మందికి జీవితాల్లో ఒక భాగం. వీరిలో ఎక్కువ మంది గ్రౌండ్స్‌కు వెళ్లి ఆడలేరు. దీనితో మానిటర్స్ ముందు.. మొబైల్స్‌లోను ఆడుతూ ఉంటారు. గతంలో ఈ గేమ్స్‌కు కొన్ని పరిమితులు ఉండేవి. మాకు 2013లో ఒక మంచి క్వాలిటీ ఉన్న క్రికెట్ గేమ్‌ను తయారుచేయాలనే ఆలోచన కలిగింది. ఫుట్‌బాల్‌లో మనకు మంచి మంచి మొబైల్ గేమ్స్ ఉన్నాయి. అలాంటిది మనం కూడా తయారుచేస్తే- ప్రపంచమంతా దానిని ఆడతారు అనే ఆలోచనతో రియల్ క్రికెట్‌ను అభివృద్ధి చేయటం ప్రారంభించాం. అప్పుడు మా టీమ్ కేవలం ఆరుగురు మాత్రమే! మేము దీనిని అభివృద్ధి చేసిన తర్వాత 2020లో జాక్‌సన్ డైస్ అనే కంపెనీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఈ మధ్యకాలంలోనే క్రాఫ్టన్ అనే కంపెనీ కూడా భాగస్వామిగా చేరింది. క్రాఫ్టన్ మాతో చేరటం వల్ల అంతర్జాతీయంగా ఈ గేమ్‌కు మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నా. మొదట్లో ఈ గేమ్‌ను తయారుచేసినప్పుడు కొన్ని లక్షల మంది మాత్రమే డౌన్‌లోడ్ చేసేకొనేవారు. ఇప్పుడు ఈ సంఖ్య 50 కోట్లకు చేరింది.

చాలా కష్టం..

గేమింగ్ అంటే చాలా మంది సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తే చాలు అనుకుంటారు. గేమింగ్‌లో సాఫ్ట్‌వేర్ ఎంత ప్రధానమో.. కళాత్మకంగా ఉండటం కూడా అంతే ప్రధానం. క్రికెట్‌లాంటి గేమ్‌ను అభివృద్ధి చేయటం ఒక కోణం నుంచి చూస్తే పెద్ద సవాల్ అనే చెప్పాలి. మరో కోణం నుంచి చూస్తే కొంత సులువు అనే చెప్పాలి. ఈ కారణాలు నేను వివరిస్తాను. షూటింగ్‌లాంటి గేమ్‌ను తయారుచేస్తున్నామనుకుందాం. చాలా మందికి షూటింగ్‌లో రూల్స్ తెలియవు. అందువల్ల వారికి ఆ రూల్స్ సులభంగా అర్థమయ్యేలా గేమ్‌ను తయారుచేయాలి. ఇది ఒక పెద్ద సవాల్. క్రికెట్ లాంటి గేమ్‌లో రూల్స్ అందరికీ తెలుసు. అందువల్ల ఈ రూల్స్‌ను ఆడేవారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఉండదు. అయితే ఈ గేమ్ వాస్తవిక ప్రపంచానికి దగ్గరగా ఉండాలి. భావోద్వేగాలు ఉండాలి. ఆడేవ్యక్తికి నిజంగా గ్రౌండ్‌లో ఉన్నంత భావన కలగాలి. ప్రతి రోజు గ్రౌండ్‌లో ఆడినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో.. వాటన్నింటినీ బేరీజు వేసుకుంటూ ఈ గేమ్‌ను అభివృద్ధి చేయాలి. ఒక రోజులో రెండు గంటలు ఈ గేమ్ ఆడినా బోరు కొట్టకూడదు. లేకపోతే గేమర్స్ దీనిని ఆదరించరు. అందువల్ల మేము ఈ గేమ్‌ను తయారుచేసేటప్పుడు చిన్న చిన్న విషయాలపై కూడా దృష్టి పెట్టాం. లేకపోతే గేమర్స్ దీనిని వదిలేసి ఇతర గేమ్స్‌లోకి వెళ్లిపోతారు.

అమ్మాయిలు కూడా..

ఒకప్పుడు క్రికెట్ కేవలం పురుషుల ఆట మాత్రమే. భారత ఉపఖండంలో ఇప్పటికీ ఎక్కువ మంది అబ్బాయిలే ఈ గేమ్‌ను ఆడతారు. అయితే ఈ మధ్యకాలంలో ఈ గేమ్‌ను ఆడుతున్న అమ్మాయిల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉదాహరణకు ప్రతి రోజూ మా గేమ్‌ను 20 లక్షల మంది ఆన్‌లైన్‌లో ఆడుతూ ఉంటారు. వీరిలో 11 శాతం అమ్మాయిలు ఉంటారు. మా దగ్గర ఉన్న గణాంకాల ఆధారంగా చూస్తే వీరి సంఖ్య పెరుగుతూ వస్తోంది. భవిష్యత్‌లో మరింతగా పెరుగుతుంది. మేము అమ్మాయిల టీమ్‌లతో ప్రత్యేకమైన గేమ్‌ను తయారుచేయాలనుకుంటున్నాం. ఇక ఏ ప్రాంతంలో ఎక్కువగా క్రికెట్ గేమ్‌ను ఆడతారు అనే విషయాన్ని గమనిస్తే- మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు.. హైదరాబాద్ అని చెప్పవచ్చు. ఇక్కడ నుంచి మా గేమ్‌ను ఎక్కువగా ఆడతారు.

గేమింగ్‌లో తక్కువే..

గేమింగ్ అనేది ఒక ప్రత్యేకమైన క్రీడ. ఈ గేమ్స్‌ను తయారుచేసే కంపెనీలు కూడా ప్రత్యేకమైనవే! అయితే మహిళా గేమింగ్ డెవలపర్స్ ప్రస్తుతం తక్కువనే చెప్పాలి. ఒక కంపెనీలో 10 మంది మగ డెవలపర్స్ ఉంటే.. అమ్మాయిలు ఇద్దరు మాత్రమే ఉంటారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ఒకటి- గేమింగ్‌ను ఒక సీరియస్ ఐటీ పరిశ్రమగా భావించకపోవటం. ప్రతి ఏడాది కొన్ని వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న పరిశ్రమ ఇది. కానీ దీనిని ఐటీలో భాగంగా భావించరు. ఈ ధోరణిలో మార్పు వస్తే ఎక్కువ మంది అమ్మాయిలు గేమింగ్ అభివృద్ధిలో పాలుపంచుకుంటారు. ఇక చిన్నప్పటి నుంచి అమ్మాయిలు కళల వైపు వెళ్లాలని.. అబ్బాయిలు ప్లే స్టేషన్స్ వంటివి ఆడాలనే భావన తల్లితండ్రుల్లో ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో ఈ విభజన చెరిగిపోతోంది. అమ్మాయిలు కూడా ప్లేస్టేషన్ల వంటివి ఆడుతున్నారు. ఇంకో పదేళ్లలో ఈ విభజన పూర్తిగా చెరిగిపోతుంది. ఆ సమయానికి గేమింగ్‌కు ఐటీ పరిశ్రమలో ఒక సముచిత స్థానం లభిస్తుంది. అప్పుడు క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు ఉందని చెప్పాలి.

దోమలను పారద్రోలే మొక్కలు ఇవే..!

వానాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం కాగానే గుంపులుగా దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇవి రాత్రిపూట నిద్రపోనివ్వవు. వీటివల్ల పలు రకాల వ్యాధులు కూడా సోకుతాయి. దోమలను నివారించేందుకు ఇంటి చుట్టూ కొన్ని రకాల మొక్కలు పెంచితే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.



- ఇంటి ప్రధాన ద్వారానికి ఎదురుగా తులసి మొక్కను ఏర్పాటు చేస్తే దోమలు లోనికి రావు. బాల్కనీలు, కిటికీల గోడల మీద కూడా చిన్న కుండీల్లో తులసి మొక్కను పెంచవచ్చు.
- ఇంటి పరిసరాల్లో యూకలిప్టస్, నీలగిరి మొక్కలు పెంచితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఈ మొక్కలు విడుదల చేసే ఘాటైన వాసనలకు దోమలు నశించిపోతాయి.
- చాలామంది దోమలు వచ్చే సమయానికి ఇంటి తలుపులు మూసేస్తూ ఉంటారు. అయినప్పటికీ బాల్కనీలు, కిటికీల నుంచి దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు ఆ ప్రదేశాల్లో వెడల్పాటి కుండీలు ఏర్పాటు చేసి పుదీనా, నిమ్మ గడ్డి, రోజ్‌మేరీ, లావెండర్, బంతిపూల మొక్కలు పెంచాలి. ఈ మొక్కల ఆకులు, పూల నుంచి వెలువడే సువాసనలు సరిపడక దోమలు దూరంగా పారిపోతాయి. ఈ మొక్కల కుండీలను ఇంట్లో అమర్చుకుంటే దోమలన్నీ బయటికి వెళ్లిపోతాయి.



- సిట్రోనెల్లా అనేది ఓ గడ్డి మొక్క. ఇది సుగంధాన్ని వెదజల్లుతుంది. ఈ మొక్కని కిటికీల దగ్గర, ఇంటి చుట్టూ గోడల వెంబడి పెంచితే దోమలు దూరంగా వెళ్లిపోతాయి.
- దోమలు ఎక్కువగా తిరిగే ప్రదేశంలో వెల్లుల్లి మొక్కను పెంచితే పది రోజుల్లో దోమలన్నీ నశించిపోతాయి.
- గుమ్మానికి ఇరుపక్కలా హార్స్‌మింట్, స్నేక్‌ప్లాంట్, ఆలియం, సేజ్, జెరేనియం మొక్కల కుండీలు పెడితే దోమలు ఇంట్లోకి రావు.
- గడ్డి చేమంతి మొక్క కూడా దోమలను పారద్రోలుతుంది. దీని పూలు పసుపు, తెలుపు, ఎరుపు, గులాబీ, ఊదా రంగుల్లో ఉంటాయి. ఇంటి ముందు వేలాడే కుండీలను ఏర్పాటు చేసుకుని వాటిలో ఈ మొక్కను పెంచితే ప్రయోజనం ఉండడమే కాకుండా పరిసరాలు అందంగా కనిపిస్తాయి.



న్యూస్‌మేకర్

ఆమె పయనం... సమున్నతం

అంజలి సూద్... భారత సంతతికి చెందిన ఈ అమెరికన్ గురించి ఇప్పుడు నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. కారణం... ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం... 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' (పర్యవేక్షక మండలి) సభ్యురాలిగా ఆమెను ఎంపిక చేయడం. అమెరికా ఓటీటీ 'ట్యూబి' సీఈఓగా ఉన్న అంజలి... గతంలో విమియో, అమెజాన్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పని చేశారు. వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించి... లాభాల బాట పట్టించారు. 'విద్యాశక్తి ద్వారా అమ్మానాన్నలు నా గురించి కన్న కలలను నిజం చేశాను. దాన్ని రేపటి తరానికి అందించాలని కోరుకొంటున్నాను' అంటున్న 41 ఏళ్ల అంజలి విజయ ప్రస్థానం ఇది.



అమెరికాలో ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం... హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య వివాదం తీవ్రస్థాయికి వెళ్లింది. ఈ తరుణంలో అంజలి వర్సిటీ 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' సభ్యురాలిగా ఎంపిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదవిలో ఆమె రెండేళ్లు కొనసాగుతారు. 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్'... హార్వర్డ్ రెండో అత్యున్నత పాలకమండలి. లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికైన మార్క్ కార్నే బోర్డులో తన సభ్యత్వానికి రాజీనామా చేయడంతో, ఆ ఖాళీని అంజలితో భర్తీ చేసింది వర్సిటీ. ఆమె హార్వర్డ్ పూర్వ విద్యార్థిని కూడా.

అదే వర్సిటీలో...

అంజలిది అమెరికాలో స్థిరపడిన పంజాబీ కుటుంబం. డెట్రాయిట్‌లో పుట్టిన ఆమె... ఫ్లింట్ నగరంలో పెరిగారు. పద్నాలుగేళ్ల వయసులో 'ఫిలిప్స్ అండోవర్ అకాడమీ'లో చదివేందుకు మసాచుసెట్స్ వెళ్లారు. 2005లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ పూర్తి చేశారు. 2011లో హార్వర్డ్ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. ఇప్పుడు అదే వర్సిటీ పాలక మండలిలో కీలక బాధ్యతలు చేపట్టారు.

ఉన్నత హోదాలు...

బీఎస్సీ అవ్వగానే ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించిన అంజలి కెరీర్ వాయు వేగంతో దూసుకుపోయింది. 2005- 2014 మధ్యకాలంలో ఆమె సాజెంట్ అడ్వైజర్స్, టైమ్ వార్నర్, అమేజాన్‌లలో ఫైనాన్స్, మీడియా విభాగాల్లో పని చేశారు. తరువాత 'విమియో' గ్రూప్‌లో గ్లోబల్ మార్కెటింగ్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల తిరక్కుండానే ఆ కంపెనీకి సీఈఓ అయ్యారు. అంజలి సారథ్యంలో కంపెనీ కంటెంట్ ప్రొడక్షన్ నుంచి కంటెంట్ క్రియేటర్లకు సాఫ్ట్‌వేర్ టూల్స్ అందించే స్థాయికి ఎదిగింది. ఎన్నడూ చూడని లాభాలను ఆర్జించింది. ప్రత్యక్ష ప్రసారాలకు ఉద్దేశించిన 'లైవ్ స్ట్రీమ్', వీడియో ఎడిటింగ్ కోసం తెచ్చిన 'మ్యాజిస్టో' యాప్‌లతో పాటు 'వైర్‌మ్యాక్స్, విబ్బిట్' సాఫ్ట్‌వేర్ స్టార్టప్‌లను 'విమియో' సొంతం చేసుకోవడంలో అంజలిదే ప్రముఖ పాత్ర.

కొత్త బాధ్యతలు...

తాజాగా హార్వర్డ్ వర్సిటీ బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్‌కు ఎంపిక కావడంతో తన కల నెరవేరిందంటారు అంజలి. 'మా అమ్మానాన్న నా గురించి ఎన్నో కలలు కన్నారు. విద్యాశక్తి ద్వారా ఆ కలలను నేను సాకారం చేయగలిగాను. దీన్ని తరువాతి తరాలవారికి అందించాలనేది నా సంకల్పం' అంటున్న అంజలి... హార్వర్డ్ అందుకు సరైన వేదికగా భావిస్తున్నారు. అంతేకాదు... ఆమె ప్రస్తుతం 'సిరియస్ ఎక్స్‌ఎమ్, డోల్బీ లేబరెటరీస్'కు బోర్డు మెంబర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'చేంజ్ డాట్ ఓఆర్జీ'కి చైర్మన్‌గా ఉన్నారు.

విజయ పరంపర...

దాదాపు పదేళ్లపాటు విమియో విజయాల్లో భాగస్వామి అయిన అంజలి... 2023లో కంపెనీ నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే ఫాక్స్ కార్పొరేషన్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. దాని అనుబంధ సంస్థ అయిన 'ట్యూబి' సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో ఉచితంగా సినిమాలు, టీవీ షోలు అందించే ఓటీటీ వేదిక ఇది. అంజలి చేరికతో కంపెనీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. నెలకు దాదాపు పది కోట్ల మంది దీన్ని ఉపయోగిస్తున్నారంటే.. అందులో ఆమె కృషి గురించి ప్రధానంగా చెప్పుకోవాలి.

అందరిలో ఆసక్తి...

హార్వర్డ్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థుల సమాచారం ప్రభుత్వానికి ఇచ్చేందుకు వర్సిటీ నిరాకరించడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీంతో అటు వర్సిటీకి, ఇటు ట్రంప్ ప్రభుత్వానికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వర్సిటీ పాలక మండలిలో అంజలి కీలక బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె కార్యాచరణ ఎలా ఉంటుందనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.

అవార్డులు ఎన్నో...

ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ 40 అండర్ 40' జాబితాలో చోటు దక్కించుకున్న అంజలి ఎన్నో అవార్డులు, గౌరవ సత్కారాలు అందుకున్నారు. 2019లో ఆమెకు 'న్యూయార్క్ ఉమెన్ ఇన్ ఫిలిమ్ అండ్ టెలివిజన్' అవార్డు లభించింది. గత సంవత్సరం 'ది హాలీవుడ్ రిపోర్టర్' ప్రకటించిన వినోద రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో అంజలికి చోటు దక్కింది. అంచెలంచెలుగా ఎదుగుతూ కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆమె నికర ఆదాయం దాదాపు రూ.73 కోట్లు. ఇదంతా వివిధ కంపెనీలకు అందించిన సేవల ద్వారా పొందిన ప్రతిఫలం. సాధించాలన్న పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే ఏ లక్ష్యం పెద్దది కాదని అంజలి నిరూపించారు. కలలను ఛేదించి... భావితరాలకు స్ఫూర్తిమంత్రం అయ్యారు.

శాండ్‌విచ్‌లు అందంగా...


మనం సాధారణంగా శాండ్‌విచ్‌లు చేసుకుని తింటూ ఉంటాం. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు మాత్రం వాటిని అందంగా రూపొందించి చక్కగా పళ్లెంలో అమర్చాలని అనుకుంటాం. చూడగానే ఆకట్టుకునేలా శాండ్‌విచ్‌లను ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...



- ఒక బ్రెడ్‌ను తీసుకుని రెండు త్రిభుజాకారపు ముక్కలుగా కోయాలి. రెంటినీ ఒకదాని పక్కన మరోదాన్ని కాస్త ఎడంగా పెట్టాలి. వీటిపైన పాలకూర ఆకును పెట్టాలి. దీనిమీద టమాటా ముక్కలు, చీజ్ తురుం, కొత్తిమీర చీలికలు, ఇతర కూరగాయల ముక్కలు (కేరట్, కీరా, బీట్‌రూట్ లాంటివి) అమర్చాలి.



- ఈ రెండు త్రిభుజాకారపు బ్రెడ్ ముక్కలను ఒకదానితో మరోదాన్ని మూసివేయాలి. లోపల ఉన్న కూరగాయల ముక్కలు పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఒక పొడవాటి ప్లాస్టిక్ కవర్‌తో ఈ రెండు ముక్కలను కలిపి చుట్టాలి.
- ఒక శాండ్‌విచ్ పేపర్‌ను తీసుకుని పొడవాటి దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించాలి. ఈ పేపర్‌తో ముందుగా తయారుచేసుకున్న శాండ్‌విచ్‌ను కోన్ మాదిరి చుట్టాలి. తరవాత ఒక పళ్లెంలో జాగ్రత్తగా పెట్టాలి. శాండ్‌విచ్ పేపర్‌మీద సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఏదైనా రాయవచ్చు.



- పళ్లెంలో ఖాళీ ఉన్నట్లయితే కూరగాయల ముక్కలను అందమైన ఆకృతుల్లో పేర్చవచ్చు. అవసరమైతే మొలకలు, డ్రైఫ్రూట్స్ కూడా చేర్చవచ్చు.

ఎండుద్రాక్ష నీళ్లతో ప్రయోజనాలు



డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. అందుకే చాలామంది ఉదయాన్నే నానబెట్టిన బాదం, ఎండుద్రాక్ష తింటుంటారు. అయితే పరగడుపున నల్ల ఎండుద్రాక్ష నీళ్లను తాగడం వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..

- ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. అది అజీర్తి సమస్యలను దూరం చేస్తుంది.
- ఈ నీళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.
- ఈ నీళ్లలో సహజసిద్ధంగా ఉండే చక్కెర, కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.
- ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తహీనత దరిచేరకుండా చేస్తాయి.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం బీపీని నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగిస్తాయి. దాంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ఈ నీళ్లలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దూరం చేస్తాయి
- 10- 15 నల్ల ఎండు ద్రాక్షలను తీసుకుని నీళ్లతో బాగా కడిగాలి. ఇప్పుడు వాటిని ఓ గ్లాసుడు మంచి నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం పరగడుపున ఆ నీటిని తాగేయాలి. నానబెట్టిన ఎండుద్రాక్షలను కూడా తినేయవచ్చు.

దిక్సూచి

బెంగళూరు ఐఐఎస్సీలో బీఎస్సీ మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్

బీటెక్ మేథ్స్ అండ్ కంప్యూటింగ్ కోర్సుల అడ్మిషన్‌కు దరఖాస్తులను బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) స్వీకరిస్తోంది. నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీలు, ఫీచరిస్టిక్ డిసిప్లెయిన్స్‌కు ఉద్దేశించిన ఈ కోర్సులను 2022లో ప్రారంభించారు. ఆసక్తిగల అభ్యర్థులు iisc.ac.in/admissions వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. క్లాసులు ఆగస్టు 1 నుంచి మొదలవుతాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ నిర్వహిస్తారు.
చివరి తేదీ: 2025 జూన్ 6

ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్'(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.
కోర్సు కాలవ్యవధి: 18 నెలలు
అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.
కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది)
చివరి తేదీ: జూలై 31 **వెబ్‌సైట్:** www.nirdpr.org.in
ఫోన్: 040 24008442, 7416860345,
Email: dec.nird@gov.in.

నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్

నర్సింగ్ అడ్మిషన్లకు ఉద్దేశించిన ఏపీ ఎన్‌సెట్-2025 నోటిఫికేషన్ వెలువడింది. డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 2025-26 విద్యా సంవత్సరానికి నాలుగు సంవత్సరాల బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది.
అర్హత: కనీసం 45 శాతం మార్కులతో, బైపీసీతో ఇంటర్మీడియేట్ పూర్తి చేసి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు 40 శాతం చాలు.
వయస్సు: 2025 డిసెంబర్ 31 తేదీ నాటికి 17 సంవత్సరాలు నిండి ఉండాలి.(2008 డిసెంబర్ 31 తేదీ కంటే ముందు జన్మించి ఉండాలి.). ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
చివరి తేదీ: 2025 జూన్ 20
దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.1180/-, బీసీ/ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులకు రూ. 944/-
వెబ్‌సైట్: drntr.uhsap.in/index/



డిప్లొమాలు అనేవి ప్రత్యేక రంగాలకు సంబంధించిన ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలను అందించే కోర్సులు. ఇతర కోర్సుల కంటే డిప్లొమా చేసిన వారు కెరీర్‌లో త్వరగా స్థిరపడగలుగుతారు. మరింత ఆసక్తి ఉన్నవారు సంబంధిత రంగంలో గ్రాడ్యుయేషన్ కూడా పూర్తిచేయవచ్చు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఫిషరీస్, అగ్రికల్చరల్, హార్టికల్చర్ డిప్లొమా నోటిఫికేషన్లు వెలువడ్డాయి.



అగ్రి, హార్టి & ఫిషరీస్ డిప్లొమాలు



ఏపీ ఫిషరీస్ వర్సిటీ

ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.
డిప్లొమా ఇన్ ఫిషరీస్: రెండు సంవత్సరాల కాలపరిమితి గల కోర్సు. మొత్తం 385 సీట్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో 55 సీట్లు, ప్రైవేటు కాలేజీల్లో 330 సీట్లు ఉన్నాయి.
విద్యార్హత: పదో తరగతి
వయస్సు: 2025 ఆగస్టు 31 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 15 నుంచి 22 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2003 ఆగస్టు 31 నుంచి 2010 ఆగస్టు 31 తేదీల మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూన్ 20 **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
దరఖాస్తు ఫీజు: రూ.800/- (ఎస్టీ/ఎస్సీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.400/-)
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూన్ 20
వెబ్‌సైట్: apfudiplomaadmissions.aptonline.in/



డా.వైఎస్ఆర్ వర్సిటీ

పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న డా.వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీలో 2025-26 సంవత్సరానికి సంబంధించి వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో 'డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. ఈ ప్రోగ్రామ్స్ వ్యవధి రెండు సంవత్సరాలు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. బోధన పూర్తిగా ఇంగ్లీషులోనే ఉంటుంది.

కోర్సులు

డిప్లొమా ఇన్ హార్టికల్చర్: మొత్తం 352 సీట్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ సీట్లు 220 కాగా, ప్రైవేటు సీట్లు 132.
డిప్లొమా ఇన్ హార్టికల్చర్(లాండ్ స్కేపింగ్ అండ్ నర్సరీ మేనేజ్‌మెంట్): మొత్తం 55 సీట్లు ఉన్నాయి.
అర్హత: పదో తరగతి పాసై ఉండాలి. (ఇంటర్ పాసైనవారు దరఖాస్తునకు అనర్హులు.
వయస్సు: విద్యార్థుల వయస్సు 15 నుంచి 22 సంవత్సరాల మధ్యలో ఉండాలి.(2003 ఆగస్టు 31 తేదీ, 2010 ఆగస్టు 31 తేదీల మధ్యలో జన్మించినవారు అర్హులు)
చివరి తేదీ: 2025 జూన్ 19
వెబ్‌సైట్: https://drysrhu.ap.gov.in/

ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు, మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 2378 సీట్లు ఉండగా, ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో 638, ప్రైవేటు కళాశాలల్లో 1690 సీట్లు ఉన్నాయి.
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: రెండు సంవత్సరాల కాలపరిమితి కోర్సు. ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు 578, అఫ్లియేటెడ్ కాలేజీలో సీట్లు 1420.
డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ: రెండు సంవత్సరాల కాలపరిమితి కోర్సు. ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు 25, అఫ్లియేటెడ్ కాలేజీలో సీట్లు 120.
డిప్లొమా ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్: రెండు సంవత్సరాల కాలపరిమితి కోర్సు. ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు 25.
డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: మూడు సంవత్సరాల కాలపరిమితి కోర్సు. ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు 60, అఫ్లియేటెడ్ కాలేజీలో సీట్లు 150.
విద్యార్హత: పదో తరగతి
వయస్సు: అభ్యర్థుల వయస్సు 15 నుంచి 22 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2003 ఆగస్టు 31 నుంచి 2010 ఆగస్టు 31 తేదీల మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 16 **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
దరఖాస్తు ఫీజు: రూ.800/- (ఎస్టీ/ఎస్సీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.400/-)
వెబ్‌సైట్: https://polytechnicadmissionsangrau.aptonline.in/

SCHOLARSHIP ALERT

Gururayaru Foundation Scholarship

Description: Gururayaru Foundation Scholarship 2025-26 is provided by the Gururayaru Foundation to Indian students pursuing undergraduate studies in recognised institutions. It aims to ensure provisions of quality education to meritorious students through academic scholarships, available to all genders and categories.
Eligibility: Application is open to Indian citizens below 22 years old at the time of application. Applicants must have secured admission for the academic year 2025-26 in a recognised institution for graduation. They should be able to demonstrate strong academic achievements along with supporting documents. Annual family income of the applicants should not exceed 6,00,000.
Prizes & Rewards: Full scholarships towards tuition fee for the selected course of study.
Last Date: 30-06-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/GRFS1

Dr. Reddy's Foundation Sashakt

Description: Dr. Reddy's Foundation Sashakt Scholarship 2025 is the initiative of Dr. Reddy's Foundation (NGO) that empowers female students in India, who have passed Class 12 and are willing to pursue a BSc. in Natural/Pure Sciences, B.Tech, or MBBS degree programs in one of the specified institutions.
Eligibility: Application is open to Indian female students who have passed Class 12 from a recognised Board with a strong academic record and are willing to pursue a B.Tech in Natural/Pure Sciences, MBBS, or BSc. degree program in one of the specified institutions across India.
Prizes & Rewards: 80,000 per annum for three years of study.
Last Date to Apply: 30-10-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFTS4

National Overseas Scholarship Scheme for ST Students

Description: National Overseas Scholarship Scheme for ST Students 2025-26 is an opportunity offered by the Ministry of Tribal Affairs, Government of India, for Master's, PhD, and post-doctoral degree holders belonging to the ST category. It aims to provide opportunities for ST students to pursue higher education in institutes or universities abroad.
Eligibility: Application is open to students belonging to the Scheduled Tribes (ST) category and holding a Master's degree, PhD or postdoctoral degree. The applicants must have secured 55% marks or equivalent in the previous qualifying examination and satisfy their respective age requirements. They must have an annual income of less than 6,00,000.
Prizes & Rewards: Annual maintenance allowance of USD $15,400 and other benefits.
Last Date to Apply: 30-06-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/NOSF1

buddy4study.com

చిత్రజ్యోతి

SINCE 1965

ఆఖరి చిత్రం అదే కావచ్చు



ఆమిర్ ఖాన్

బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆయన తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారతం' గురించి మాట్లాడారు. నటుడిగా ఆ సినిమానే తనకు ఆఖరిది కావొచ్చని పేర్కొన్నారు. "సితారే జమీన్ పర్ విడుదల తర్వాత 'మహాభారతం' ప్రాజెక్ట్‌పైనే పూర్తి దృష్టి సారిస్తాను. భారీ స్థాయి నిర్మాణ విలువలతో పాటు ఎన్నో సవాళ్లతో కూడుకున్న ప్రాజెక్ట్ ఇది. ఎన్నో ఏళ్లుగా ఈ కథతో ప్రయాణిస్తున్నాను. ప్రపంచంలోని ప్రతీ విషయం 'మహాభారతం'లో ఉంటుంది. ఇది ఎలాంటి ప్రాజెక్ట్ అంటే, ఈ సినిమా తర్వాత నేను నటుడిగా ఏదీ చేయాల్సిన అవసరం లేదనే భావోద్వేగానికి గురిచేసేంత గొప్పది" అని అన్నారు.



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్వయంభు'. భువన్ శ్రీకర్ నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆదివారం నిఖిల్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం కదనరంగంలో విజృంభిస్తున్న నిఖిల్, సంయుక్త పోస్టర్‌ను విడుదల చేసింది.

కాలమే అన్నింటినీ బయట పెడుతుంది



బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు సతీమణి శ్యామలీ దే తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన స్టోరీ ఒకటి వైరల్ అవుతోంది. "కాలం అన్నింటినీ బయటపెడుతుంది. కర్మ సమాధానం చెబుతుంది. ఈ విశ్వం దీనిని నిశితంగా చూస్తుంటుంది" అని రాసి ఉన్న సందేశాన్ని ఆమె పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌ను ఆమె రాజ్‌నిడిమోరు, సమంత కలసి పికిల్‌బాల్ గేమ్ ఆడుతూ ఉన్న ఫొటోలను షేర్ చేసిన సమయంలోనే షేర్ చేయడం గమనార్హం.

ఎంతో గర్వపడుతున్నాం




తమిళ హీరో ధనుష్, రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య గతేడాది విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరూ కలసి దిగిన ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. తమ తనయుడు యాత్ర గ్రాడ్యుయేషన్ డేలో వీరు పాల్గొన్నారు. ఈ ఫొటోను ధనుష్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'యాత్ర తల్లిదండ్రులుగా ఈ రోజు మేమిద్దరం ఎంతో గర్వపడుతున్నాం' అని క్యాప్షన్ పెట్టారు. ఈ ఫొటోపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. 'చాలా రోజుల తర్వాత మీ ఇద్దరినీ ఇలా ఒకే ఫ్రేమ్‌లో చూడడం సంతోషంగా ఉంది' అని కామెంట్ పెట్టారు. కాగా, ఇదే ఫొటోని రజనీకాంత్ కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నా మనవడు జీవితంలో మొదటి మైలురాయి దాటాడు. కంగ్రాట్స్ యాత్ర కన్నా' అని రాసుకొచ్చారు.

కామెడీ.. మిస్టరీ కలబోతగా



సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకత్వంలో సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మిస్తున్నారు. ఈనెల 6న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ బృందావనం మాట్లాడుతూ 'గతంలో మా సంస్థలో ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ గారి దర్శకత్వంలో 'శ్రీవల్లి' అనే చిత్రాన్ని నిర్మించాం. ఇప్పుడు వైవిధ్యమైన కథాంశంతో 'గ్యాంబ్లర్స్' చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల మనసు దోచుకుంటుంది' అని అన్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ నటనలో కొత్తకోణాన్ని ప్రేక్షకులు చూడబోతున్నారు అని సునీత చెప్పారు. కామెడీ, మిస్టరీ, గ్లామర్ కలబోతగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు.

విడుదలకు సిద్ధం



సత్యం రాజేశ్, శ్రవణ్, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'పాడేరు 12వ మైలు రాయి'. ఎన్.కే దర్శకత్వంలో తోలేటి కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈనెల 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం శ్రీ మోదకొండమ్మ తల్లి ఆశీస్సులతో ఈ సినిమాను తెరకెక్కించాం. సస్పెన్స్‌తో పాటు చక్కని ప్రేమ కథతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుంది' అని చెప్పారు. బీభత్సరసం ప్రధాన కథాంశంగా పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: పీ ఆర్, సినిమాటోగ్రఫీ:జి. అమర్.

మంచి అనుభూతినిస్తుంది



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్కై'. నాగిరెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీజర్‌ని లాంచ్ చేశారు. హీరోయిన్ శృతి శెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. త్వరలోనే మీ ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం' అని అన్నారు. హీరో, నిర్మాత మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ 'నన్ను నేను హీరోగా కంటే ఒక నటుడిగా భావిస్తా. అనుభవజ్ఞులతో కలసి పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం మంచి అనుభూతినిస్తుంది' అని అన్నారు.



ప్రేక్షకుల ఆదరణ
మరువలేనిది

పలు కుటుంబ కథా చిత్రాలను రూపొందించి పరిశ్రమకు మర్చిపోలేని విజయాలను అందించిన దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. 32 ఏళ్ల కెరీర్‌లో 42 చిత్రాలను రూపొందించి ప్రేక్షకుల మెప్పు పొందారు. ఆదివారం ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన సినిమాల్లో నటించిన నటీనటులు అంతా కలసి కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'నన్ను మొదట్నుంచి ప్రోత్సహిస్తూ, అండగా నిలుస్తున్న అచ్చిరెడ్డి గారికి రుణపడి ఉంటాను. అలాగే నా తొలి చిత్రంలో హీరోగా నటించేందుకు అంగీకరించిన రాజేంద్రప్రసాద్ గారిని ఎప్పటికీ మరువలేను. అలాగే ఇన్నేళ్లుగా ప్రేక్షకులు నా పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలను మరువలేను. వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను' అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, రోజా, ఆమని, ఇంద్రజ, లయ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు నటీనటులపై రాజేంద్రప్రసాద్ అసభ్య పదజాలం ఉపయోగించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సంగీతానికే తొలి ప్రాధాన్యం



నరేశ్ అగస్త్య, రబియా ఖతూన్ జంటగా విపిన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఉమాదేవి కోట నిర్మిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఒక ప్రతిభావంతుడైన సంగీతకారుని చుట్టూ చిత్రకథ తిరుగుతుంది. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు విపిన్ మాట్లాడుతూ 'మా సినిమాలో ప్రిన్స్ రామ వర్మ అనే పెద్ద సంగీత విద్వాంసులు అతిథి పాత్రలో నటించారు. ఆయన సినిమాలో పాట కూడా పాడారు.' అని అన్నారు. నిర్మాత ఉమాదేవి మాట్లాడుతూ 'ప్రతి సినిమాలో కళని కనెక్ట్ చేయాలనేది నా ఆశ. అందుకే ఈ సినిమాలో సంగీతానికే తొలి ప్రాధాన్యం ఇచ్చాం. సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారికి ఈ చిత్రాన్ని అంకితం ఇస్తున్నాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మోహన కృష్ణ. సంగీతం : జస్టిన్ ప్రభాకరన్.

అయ్యారే.. పంజాబ్

ముంబైపై అద్భుత విజయం
ఫైనల్లో ప్రవేశం
శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్


శ్రేయాస్ అయ్యర్ (87 నాటౌట్)

అహ్మదాబాద్: ఉత్కంఠభరితంగా సాగిన క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ అదరగొట్టింది. తమ చివరి మ్యాచ్‌లో కేవలం 101 పరుగులకే కుప్పకూలిన ఈ జట్టు అత్యంత కీలకమైన ఈ మ్యాచ్‌లో మాత్రం విజృంభించింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 87 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్ కారణంగా.. ఆదివారం ముంబై ఇండియన్స్‌పై పంజాబ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా ఈనెల 3న జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 203 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ (44), తిలక్ వర్మ (44), బెయిర్‌స్టో (38), నమన్ (37) రాణించారు. ఒమర్జాయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు చేసి నెగ్గింది. నేహల్ (48), ఇన్‌గ్లిస్ (38) ఆకట్టుకున్నారు. అశ్వనికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శ్రేయాస్ నిలిచాడు.

శ్రేయాస్ ధనాధన్

కెప్టెన్ శ్రేయాస్ సూపర్ ఇన్నింగ్స్‌తో భారీ ఛేదనలో పంజాబ్ దూసుకెళ్లింది. మిడిలార్డర్ అద్భుతంగా రాణించడంతో లక్ష్యం వైపు వేగంగా సాగింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (6) నిరాశపర్చగా.. ఇన్‌గ్లిస్ ఆరంభంలో చెలరేగాడు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో తను 4,6,4,6తో 20 పరుగులు రాబట్టాడు. ఆరో ఓవర్‌లో ప్రియాన్ష్ (20) వెనుదిరిగినా పవర్‌ప్లేలో 64/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత మూడు ఓవర్లలో వీరి ఆట నెమ్మదించగా ఇన్‌గ్లిస్ వికెట్ కూడా కోల్పోయింది. అయితే నేహల్-శ్రేయాస్ జోడీ ముంబై బౌలర్లపై జోరు చూపింది. 13వ ఓవర్‌లో శ్రేయాస్ హ్యాట్రిక్ సిక్సర్లతో విజృంభించాడు. అటు బౌల్ట్ ఓవర్‌లో నేహల్ రెండు ఫోర్లు సాధించడంతో ముంబైలో ఉత్కంఠ పెరిగింది. అయితే 16వ ఓవర్‌లో నేహల్‌ను స్పిన్నర్ అశ్వని అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు శ్రేయాస్ మాత్రం 27 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. శశాంక్ (2) రనౌట్ కాగా 18వ ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చాడు. కానీ 19వ ఓవర్‌లో శ్రేయాస్ నాలుగు సిక్సర్లతో 26 పరుగులు రాబట్టి మ్యాచ్‌ను ముగించాడు.

కలిసికట్టుగా.. :టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్ మెరుపు వేగంతో సాగింది. ఓపెనర్ రోహిత్ (8) మూడో ఓవర్‌లోనే వెనుదిరిగినా.. బెయిర్‌స్టో-తిలక్ జోడీ ఎదురుదాడికి దిగింది. అటు సూర్యకుమార్.. చివర్లో నమన్ ధిర్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో జట్టు భారీ స్కోరు అందుకుంది. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన తిలక్ వచ్చీ రావడంతోనే రెండు సిక్సర్లతో చెలరేగాడు. ఆరో ఓవర్‌లో బెయిర్‌స్టో 4,6తో పవర్‌ప్లేలో జట్టు 65/1 స్కోరుతో నిలిచింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే వైశాక్ నకుల్ బాల్‌కు బెయిర్‌స్టో వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత తిలక్‌కు సూర్యకుమార్ జత కట్టడంతో రన్‌రేట్ పది రన్స్‌కు తగ్గకుండా సాగింది. స్పిన్నర్ చాహల్ లక్ష్యంగా సూర్య పదో ఓవర్‌లో 6,4.. 12వ ఓవర్‌లో మరో సిక్సర్‌తో ధాటిని కనబర్చాడు. అయితే ఎడాపెడా షాట్లతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీకి చాహల్ చెక్ పెట్టాడు. 14వ ఓవర్‌లో సూర్య 4,6 బాదినా ఐదో బంతికి వెనుదిరిగాడు. అప్పటికే మూడో వికెట్‌కు 72 పరుగులు జత చేరాయి. తర్వాతి ఓవర్‌లోనే తిలక్‌కు పేసర్ జేమిసన్ షాకిచ్చాడు. కాసేపటికే కెప్టెన్ హార్దిక్ (15)ను ఓ బౌన్సర్‌తో పేసర్ ఒమర్జాయ్ అవుట్ చేశాడు. కానీ నమన్ ధిర్ మాత్రం చివర్లో బౌండరీలతో జోరు చూపాడు. ఆఖరి ఓవర్‌లో తను అవుటైనా ముంబై 200 స్కోరు దాటగలిగింది.

రెండున్నర గంటలు ఆలస్యంగా..

వర్షం కారణంగా ఈ మ్యాచ్ నిర్ణీత సమయంకన్నా రెండున్నర గంటలు ఆలస్యంగా ఆరంభమైంది. టాస్ వేసేటప్పుడు వాతావరణం మెరుగ్గానే ఉన్నా సరిగ్గా మ్యాచ్ సమయానికి వర్షం ఆరంభమైంది. దీంతో ఎలాంటి ఓవర్ల కోత లేకుండా రాత్రి 9.45కి మ్యాచ్ ఆరంభమైంది.

1

ఐపీఎల్ సీజన్‌లో ఓపెనర్‌గా ఆడకుండానే ఎక్కువ పరుగులు (717) సాధించిన బ్యాటర్‌గా సూర్యకుమార్.

ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో ఒక్క ఆటగాడి హాఫ్ సెంచరీ లేకుండానే ఓ జట్టు (ముంబై) 200+ స్కోరు సాధించడం ఇదే తొలిసారి.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (సి) వైశాఖ్ (బి) స్టొయినిస్ 8, బెయిర్‌స్టో (సి) ఇంగ్లిస్ (బి) వైశాఖ్ 38, తిలక్ (సి) ప్రియాన్ష్ (బి) జేమీసన్ 44, సూర్యకుమార్ (సి) వధేరా (బి) చాహల్ 44, హార్దిక్ (సి) ఇంగ్లిస్ (బి) ఒమర్జాయ్ 15, నమన్ (సి) స్టొయినిస్ (బి) ఒమర్జాయ్ 37, రాజ్ బవ (నాటౌట్) 8, శాంట్నర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 203/6; వికెట్ల పతనం:** 1-19, 2-70, 3-142, 4-142, 5-180, 6-197; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-44-0, జేమీసన్ 4-0-30-1, స్టొయినిస్ 1-0-14-1, ఒమర్జాయ్ 4-0-43-2, విజయ్‌కుమార్ వైశాఖ్ 3-0-30-1, చాహల్ 4-0-39-1.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) హార్దిక్ (బి) అశ్వని కుమార్ 20, ప్రభ్‌సిమ్రన్ (సి) టోప్లే (బి) బౌల్ట్ 6, ఇంగ్లిస్ (సి) బెయిర్‌స్టో (బి) హార్దిక్ 38, శ్రేయాస్ (నాటౌట్) 87, నేహల్ (సి)శాంట్నర్ (బి) అశ్వని కుమార్ 48, శశాంక్ (రనౌట్) 2, స్టొయినిస్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19 ఓవర్లలో 207/5; వికెట్ల పతనం:** 1-13, 2-55, 3-72, 4-156, 5-169; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-1, టోప్లే 3-0-40-0, బుమ్రా 4-0-40-0, అశ్వని కుమార్ 4-0-55-2, శాంట్నర్ 2-0-15-0, హార్దిక్ 2-0-19-1.



8న రింకూ నిశ్చితార్థం

జాన్‌పూర్ (యూపీ): సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో క్రికెటర్ రింకూ సింగ్ నిశ్చితార్థం ఈ నెల 8న లఖ్‌నవూలో జరగనుంది. ప్రియ తండ్రి తుఫానీ సరోజ్ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. నవంబరు 18న వారణాసిలోని తాజ్ హోటల్‌లో వీరి వివాహం జరుగుతుందన్నారు. ఈ వేడుకకు సన్నిహితులను మాత్రమే ఆహ్వానించినట్టు చెప్పారు. ప్రియ, రింకూలకు కొంతకాలంగా పరిచయం ఉందని.. ఇరు కుటుంబాల అంగీకారంతో పెళ్లిని ఫిక్స్ చేసినట్టు సరోజ్ తెలిపారు. 26ఏళ్ల ప్రియ ఉత్తరప్రదేశ్‌లోని మచిలీషహర్ నియోజవర్గం నుంచి తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. రింకూ అదే రాష్ట్రంలోని అలీగఢ్‌కు చెందినవాడు.

రెండో రోజు టాపర్..మోహన్

- రూ. 78 లక్షలకు ముంబా వశం
- ముగిసిన ప్రొ కబడ్డీ వేలం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ వేలం రెండో రోజు ఆనిల్ మోహన్ అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం జరిగిన సి, డి కేటగిరీ ఆటగాళ్ల బిడ్డింగ్‌లో ఆల్‌రౌండర్ మోహన్‌ను యు ముంబా రూ. 78 లక్షలకు కొనుగోలు చేసింది. ఆకాశ్ షిండే (బెంగళూరు), ఉదయ్, నితిన్ రావల్ (జైపూర్) రూ. 50 లక్షల మార్క్ అందుకున్నారు. మొత్తంగా 12వ సీజన్ కోసం రెండు రోజులపాటు జరిగిన వేలంలో నమోదు చేసుకొన్న 529 మంది ఆటగాళ్లలో 121 మంది అమ్ముడయ్యారు. వేలంలో ఇద్దరు ప్లేయర్లే రూ. 2 కోట్ల మార్క్ దాటారు. అత్యధికంగా మహమద్ రెజా రూ. 2.23 కోట్లు పలకగా.. దేవాంక్ దలాల్ రూ. 2.20 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కాగా, స్టార్ రైడర్లు పర్‌దీప్ నర్వాల్, సిద్ధార్థ్ దేశాయ్ అన్‌సోల్డ్‌గా మిగిలారు.

చాంపియన్.. విహాన్



హైదరాబాద్: టెన్నిస్ ఆటగాడు విహాన్ ములుకుట్ల.. ఫ్రాన్స్‌లో జరిగిన టెన్ ప్రో గ్లోబల్ జూనియర్ టూర్ ఈవెంట్‌లో అండర్-12 సింగిల్స్ టైటిల్ విజేతగా అవతరించాడు. ఈ హైదరాబాద్ చిన్నారి ఫైనల్లో 6-3, 6-3తో మార్టినెజ్‌పై నెగ్గాడు. అండర్-13 విభాగంలో విహాన్ రన్నరప్‌గా నిలిచాడు.





పౌలినీకి స్వితోలినా షాక్

క్వార్టర్స్‌కు స్వియటెక్, సబలెంక, అల్కారజ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్, టాప్ సీడ్ సబలెంక క్వార్టర్స్‌కు చేరుకున్నారు. అయితే, గతేడాది రన్నరప్ జాస్మిన్ పౌలీనికి 13వ సీడ్ స్వితోలినా షాకిచ్చింది. మ్యాచ్ పాయింట్ నుంచి మలుపు తిప్పిన ఉక్రెయిన్ భామ స్వితోలినా 4-6, 7-6(6), 6-1తో నాలుగో సీడ్ పౌలినీపై అద్భుత విజయంతో ముందంజ వేసి క్వార్టర్స్ చేరింది. మరో ప్రీక్వార్టర్స్‌లో స్వియటెక్ 1-6, 6-3, 7-5తో 13వ సీడ్ రిబకినాపై నెగ్గింది. సబలెంక 7-5, 6-3తో 16వ సీడ్ అనిసిమోవాపై, 8వ సీడ్ క్విన్‌వెన్ జాంగ్ 7-6(5), 1-6, 6-3తో సమ్‌సనోవాపై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ 7-6(8), 6-3, 4-6, 6-4తో 13వ సీడ్ బెన్ షెల్టన్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-3, 6-3, 6-3తో అలెక్సీ పాపిరన్‌పై గెలిచి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

అర్జున్ విజయం.. టాప్‌లో హంపి

నార్వే చెస్

స్టావంగర్ (నార్వే): నార్వే చెస్ ఐదో రౌండ్‌లో అర్జున్ ఇరిగేసి గెలవగా, గుకేష్‌కు పరాజయం పాలయ్యాడు. అర్జున్-నకమురా మధ్య క్లాసికల్ గేమ్ డ్రా కావడంతో ఆర్మగెడాన్ టైబ్రేకర్ నిర్వహించారు. అందులో నకమురాకు అర్జున్ షాకిచ్చాడు. వీఈ -గుకేష్ మధ్య గేమ్ కూడా డ్రా కావడంతో టైబ్రేకర్‌కు మళ్లింది. అయితే టైబ్రేకర్‌లో గుకేష్ ఓటమి పాలయ్యాడు. ఈ రౌండ్ తర్వాత అర్జున్ (6), గుకేష్ (5.5) వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నారు. మహిళల్లో హంపి ఐదో రౌండ్ టైబ్రేకర్‌లో లీ టింగ్జీని చిత్తు చేసింది. ప్రస్తుతం హంపి (8.5) టాప్‌లో ఉండగా, సారాపై నెగ్గిన వైశాలి (6.5) నాలుగో స్థానానికి ఎగబాకింది.

ఇంగ్లండ్ లయన్స్ 527/7

కాంటర్‌బరీ: ఇండియా 'ఎ'తో నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ లయన్స్ దీటైన బదులిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 237/2తో ఆదివారం, మూడోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన లయన్స్ ఆట ఆఖరికి 7 వికెట్లకు 527 రన్స్ చేసింది. హెయిన్స్ (171), హోల్డెన్ (101), డాన్ మోస్లే (113) శతకాలు సాధించారు. ముకేశ్ 3 వికెట్లు తీశాడు. ఇండియా 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 557 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.

బిజినెస్

25,150 పైన బుల్లిష్

(జూన్ 2-6 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 24,650-25,067 పాయింట్ల మధ్యన కదలాడి 103 పాయింట్ల నష్టంతో 24,751 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,150 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,770, 24,791, 24,809, 24,555 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,150 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,350
నిరోధ స్థాయిలు: 24,950, 25,050, 25,150 (24,850 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,550, 24,450, 24,350 (24,650 దిగువన బేరిష్)

రెండేళ్లలో ఐపీఓకి మలబార్ గోల్డ్

న్యూఢిల్లీ: ఆభరణాల రిటైలింగ్‌లోని మలబార్ గోల్డ్ 2027-28 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి రావాలని భావిస్తోంది. బంగారం ధరలు రికార్డు గరిష్ఠ స్థాయిలకు చేరినప్పటికీ ఈ ఏడాది ఆదాయాల్లో 20 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎంపీ అహ్మద్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.62,000 కోట్లుంది. విస్తరణ వ్యూహంలో భాగంగా దేశంలో 60, విదేశాల్లో 30 స్టోర్లు ప్రారంభించాలని యోచిస్తున్నట్టు ఆయన తెలిపారు. కాగా స్టాక్ మార్కెట్లో లిస్టింగ్‌కు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయన్నారు. దేశవిదేశాల్లో ప్రస్తుతం మలబార్ గోల్డ్ 391 స్టోర్లను నిర్వహిస్తోంది.

విస్తరణ బాటలో విమానయాన సంస్థలు



- 30 ఏ350 విమానాలకు ఇండిగో ఆర్డర్
- అదేబాటలో ఎయిర్ ఇండియా!

న్యూఢిల్లీ: విమానాల తయారీ సంస్థలైన ఎయిర్‌బస్, బోయింగ్‌లకు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా మారుతోంది. ఇండిగో ఎయిర్‌లైన్స్.. ఎయిర్‌బస్ నుంచి మరో 30 ఏ350 రకం విమానాలు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) సదస్సుకు హాజరైన సందర్భంగా ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఈ విషయం వెల్లడించారు. గత ఏడాది ఏప్రిల్‌లోనూ ఇండిగో.. ఎయిర్‌బస్ నుంచి 30 ఏ350 రకం విమానాలు కొనేందుకు ఆర్డర్ పెట్టింది. తాజా ఆర్డర్‌తో ఎయిర్‌బస్ నుంచి ఇండిగో కొనే ఏ350 విమానాల సంఖ్య 60కి చేరింది. ఇండిగో ఈ విమానాలను విదేశాల్లోని సుదూర ప్రాంతాలకు నడుపుతుంది. వ్యాపార విస్తరణలో భాగంగా ఇండిగో రానున్న సంవత్సరాల్లో 900కు పైగా కొత్త విమానాలను సమకూర్చుకోనుంది.

ఎయిర్ ఇండియా 200 విమానాలకు!

టాటాల నిర్వహణలోని ఎయిర్ ఇండియా (ఏఐ) కూడా పెద్దఎత్తున విస్తరణ చేపడుతోంది. ఇందుకోసం పెద్ద మొత్తంలో కొత్త విమానాల కొనుగోలుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే ఎయిర్‌బస్, బోయింగ్ కంపెనీలతో కంపెనీ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ ఆర్డర్ కూడా దాదాపు 200 విమానాల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాల కొనుగోలుకు ఏఐ ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకుంది. పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులతో పాటు సరుకు రవాణా కోసం కొత్త విమాన సర్వీసులు ప్రారంభిస్తామని కంపెనీ సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ ఐఏటీఏ సదస్సులో ప్రకటించడం ఇందుకు మరింత బలం చేకూరుస్తోంది. 2028కల్లా దేశీయ విమానయాన మార్కెట్లో కనీసం 30 శాతం వాటా సాధించడమే తమ లక్ష్యమన్నారు.

పెరుగుతున్న భాగస్వామ్యాలు

మరోవైపు మన దేశానికి చెందిన విమానయాన సంస్థలు విదేశీ విమానయాన సంస్థలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. తాజాగా ఇండిగో.. డెల్టా ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఫ్రాన్స్-కేఎల్ఎం, వర్జిన్ అట్లాంటిక్ సంస్థలతో భాగస్వామ్యం ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో యూరప్, ఉత్తర అమెరికా ఖండాల్లో దేశాలతో ఇండిగోకు మరింత కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో టిక్కెట్ల బుకింగ్‌లో ఈ సంస్థలన్నీ పరస్పరం సహకరించుకుంటాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రపంచంలోని 10 ప్రముఖ నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నట్టు ప్రకటించింది. కాగా ఎయిర్ ఇండియా.. టాటా గ్రూప్ చేతికి వచ్చిన తర్వాత 20 అంతర్జాతీయ విమానయాన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది.

- క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్స్ ఎలక్ట్రికల్స్ మార్కెట్లోకి 'సైలెంట్ ప్లూజో వేవ్ సిరీస్' పేరుతో సరికొత్త ఫ్యాన్లను విడుదల చేసింది. ప్రపంచ ఇంటీరియర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని తీసుకువచ్చినట్టు వెల్లడించింది. ఆరు మోడళ్లతో అందుబాటులో ఉండనున్న ఈ ఫ్యాన్ల ధరలు రూ.9,799 నుంచి రూ.16,249 మధ్యన ఉన్నాయి.
- కుక్‌వేర్ సంస్థ బెర్గ్‌నర్ ఇండియా 'పీట్‌లామ్' పేరుతో సరికొత్త వంటసామాగ్రిని మార్కెట్లోకి తీసుకువచ్చింది. భారతీయ వంటలకు అనుగుణంగా పీట్‌లామ్ శ్రేణిలో తడ్కా పాన్, సాస్‌పాన్, సాటెపాన్, రోటీ తవా, దోశ తవా, కడాయ్, ఫ్రైపాన్ ఉత్పత్తులను విడుదల చేసింది.
- వీ-గార్డ్ ఇండస్ట్రీస్.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.1.23 కోట్ల మొత్తాలను ఖర్చు చేసినట్టు ప్రకటించింది. ప్రధానంగా వైద్యం, విద్య తదితర రంగాల్లో ఈ మొత్తాలను వినియోగించింది. దేశవ్యాప్తంగా సీఎస్ఆర్ కార్యకలాపాలకు రూ.5.50 కోట్లు వెచ్చించింది.
- డెటాల్.. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని ప్రచారకర్తగా నియమించుకుంది. డెటాల్ శ్రేణిలోని సబ్బులు, హ్యాండ్ వాష్, బాడీ వాష్ ఉత్పత్తులతో పాటు డెటాల్ ఐస్ కూల్‌కు ధోనీ ప్రచారం చేయనున్నారు.
- సెయింట్ గోబెన్ జిప్‌రాక్ ఇండియా.. మార్కెట్లోకి తక్కువ కార్బన్ ప్లాస్టర్‌తో కూడిన ఈపీడీ (ఎన్విరాన్‌మెంటల్ ప్రొడక్ట్ డిక్లరేషన్)ను విడుదల చేసింది. భారత్‌లో ఈ తరహా ఉత్పత్తిని విడుదల చేయటం ఇదే తొలిసారని కంపెనీ వెల్లడించింది. జిప్‌రాక్ చెన్నై ప్లాంట్‌లో ఈ ఉత్పత్తిని తయారు చేసినట్టు తెలిపింది.


మే నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.2.01 లక్షల కోట్లు

ఏపీలో రూ.3,803 కోట్లు, తెలంగాణలో రూ.5,310 కోట్లు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్ల జోరు కొనసాగుతోంది. గత నెల (మే)లో జీఎస్‌టీ వసూళ్లు రూ.2.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.1,72,739 కోట్లతో పోలిస్తే ఇది 16.4 శాతం ఎక్కువ. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో వసూలైన రూ.2.37 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం ఇది రూ.36,000 కోట్లు తక్కువ. మే నెలలో వసూలైన రూ.2.01 లక్షల కోట్ల జీఎస్‌టీలో రూ.35,434 కోట్లు సీజీఎస్‌టీ రూపంలో, రూ.43,902 కోట్లు ఎస్‌జీఎస్‌టీ రూపంలో, రూ.1.09 లక్షల కోట్లు ఐజీఎస్‌టీ రూపంలో వసూలయ్యాయి. సెస్సు కింద మరో రూ.12,879 కోట్లు వసూలయ్యాయి.

తెలుగు రాష్ట్రాల్లో: గత నెల రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జీఎస్‌టీ కింద రూ.9,113 కోట్లు వసూలయ్యాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.3,803 కోట్లు వసూలు కాగా, తెలంగాణ నుంచి రూ.5,310 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది మే నెలతో పోలిస్తే తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు ఆరు శాతం పెరగ్గా, ఏపీలో రెండు శాతం తగ్గాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

ఆచితూచి అడుగేయండి!

ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల గమనం అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉంది. దేశీయ జీడీపీ వృద్ధి రేటు అంచనాలకు తగ్గట్టుగా ఉండటం సానుకూల అంశం. అల్యూమినియం, స్టీల్ దిగుమతులపై ట్రంప్ సుంకాలు మరింత పెంచుతామని ప్రకటించటం, ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలతో అనిశ్చితికి అవకాశం ఉంది. ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతున్న నిఫ్టీ 25,000 ఎగువన నిలదొక్కుకోవటం అత్యంత కీలకం. ఈవారం బ్యాంకింగ్, ఫైనాన్స్, రైల్వే వ్యాగన్స్, షిప్ బిల్డింగ్, ఫిన్‌టెక్ షేర్లు బుల్లిష్‌గా కనిపిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జైడస్ లైఫ్‌సైన్సెస్: ఏడాది కాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ఫిబ్రవరి నుంచి మంచి బేస్ ఏర్పడింది. అక్యుములేషన్ కొనసాగుతోంది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా కనిపిస్తోంది. మూమెంటమ్ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.930 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.910 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.880 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎటర్నల్: ఆరు నెలలుగా ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో చలిస్తోంది. ప్రస్తుతం మూమెంటమ్, డెలివరీ క్రమంగా పెరుగుతోంది. సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ షేరుపై ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.238 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.230 వద్ద ఎంటరై రూ.285 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ: ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ ఆసక్తికరంగా కనిపిస్తోంది. మూమెంటమ్, డెలివరీ క్రమంగా పెరుగుతున్నాయి. గత వారం గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. గత శుక్రవారం రూ.812 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.800 స్థాయిలో ఎంటరై రూ.880 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.అయితే రూ.775 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అనంత్‌రాజ్: ఈ రియల్టీ కంపెనీ షేరు ప్రస్తుతం 10,20,50 ఈఎంఏ పై స్థాయిల్లో చలిస్తోంది. షార్ట్‌టర్మ్, మీడియం టర్మ్ మూమెంటమ్ చాలా బాగుంది. గత శుక్రవారం రూ.561 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.550 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.660 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: ప్రస్తుతం ఈ కౌంటర్‌లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. కొన్ని రోజులుగా రూ.850-900 శ్రేణిలో చలిస్తోంది. రూ.900, రూ.1,000 వద్ద బలమైన నిరోధం ఉంది. వీటిని అధిగమిస్తే మరింత పుంజుకోవటం ఖాయం. 55 రోజుల రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.890 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.850 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.




- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మార్కెట్లో కన్సాలిడేషన్ ధోరణి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 స్థాయిలో మరోసారి విఫలమై అప్రమత్త ట్రెండ్ సంకేతం ఇచ్చింది. 100 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయికి చేరువలో 24,750 వద్ద ముగిసింది. గత మూడు వారాలుగా కూడా 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొంటూనే ఉంది. మే నెల చార్టుల ప్రకారం సైతం మార్కెట్లో అప్రమత్త ట్రెండ్ నెలకొని ఉంది. మిడ్‌క్యాప్-100 సూచీకి 58,000, స్మాల్‌క్యాప్-100 సూచీకి 18,000 వద్ద నిరోధం ఎదురవుతోంది. మార్కెట్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. సానుకూలత కోసం నిఫ్టీ తప్పనిసరిగా బౌన్స్‌బ్యాక్ అయి 25,000 వద్ద బ్రేకౌట్ సాధించాలి. లేదంటే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ప్రస్తుతం 25,000-24,500 మధ్యన కదలాడుతోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 24,900 తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ఆ పైన నిరోధం 25,100. ఇదే మే 15న నమోదైన గరిష్ఠ స్థాయి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,600 వద్ద విఫలమైతే మరింత బలహీనతను ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,450. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం నిలకడగా పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శిస్తూ వచ్చిన ఈ సూచీ ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయి 56,100 చేరువలో ఉంది. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడు మాత్రమే మరింత కొత్త శిఖరాలకు పురోగమిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పు ఏర్పడుతుంది.

పాటర్న్: గత రెండు వారాల్లో 25,100 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. సానుకూలత కోసం దీన్ని ఛేదించాలి. అలాగే 24,450 వద్ద డబుల్ బాటమ్ పాటర్న్ కూడా ఏర్పడింది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,840, 24,900
మద్దతు	24,660, 24,600

రీవ్యాలిడేషన్‌పై దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయ్

» లోకేశ్, జగన్ మధ్య వాదనలపై షర్మిల ఎద్దేవా



అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల రీవ్యాలిడేషన్‌పై ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మధ్య వాదనలు చూస్తుంటే.. దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. ఆదివారం ఆమె ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. 'వైసీపీ హయాంలో ఏటా రీకౌంటింగ్‌లో ఫెయిలైన విద్యార్థుల్లో 20 శాతం మంది తిరిగి అధికమార్కులతో పాసయ్యారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో 30 వేల మందిలో 11 వేల మందికి తిరిగి ఫస్ట్ క్లాస్ మార్కులు వచ్చాయంటే, పేపర్ల మూల్యాంకనంలో చిత్తశుద్ధి ఎంతుందో అర్థమవుతోంది. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేంకావాలి. వాస్తవానికి ఫెయిలైంది విద్యార్థులు కాదు ..పేపర్లు దిద్దలేని నాటి వైసీపీ ఫెయిలైంది. ఇప్పుడు పూర్తిగా కూటమి ప్రభుత్వం ఫెయిలైంది. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ ఫెయిలైనట్లే. దీనిపై వెంటనే విచారణ చేయండి. పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికీ ఉచితంగా వెరిఫికేషన్ చేయండి' అని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలు కాపాడాలి

» సీఎంకు ఏపీ ఆయిల్‌పామ్ రైతు సంఘం విజ్ఞప్తి

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రంతో సంప్రదింపులు జరపాలని ఏపీ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీవీ రాఘవరావు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కేంద్రప్రభుత్వం జారీ చేసిన కస్టమ్స్ సుంకం తగ్గింపు నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకుని, ముడి వంట నూనెలపై 50% కస్టమ్స్ సుంకాన్ని తిరిగి విధించేలా కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. ఈ మేరకు సీఎంకు ఆదివారం ఆయన లేఖ రాశారు. గత రెండు నెలల్లో సీపీవో ధర టన్నుకు రూ.లక్షా10వేలకు పడిపోవడంతో ఎఫ్ఎఫ్‌బీ ధర భారీగా తగ్గిందని, గత 30ఏళ్లలో సీపీవోపై దిగుమతి సుంకం తగ్గించినప్పుడు, ఎఫ్ఎఫ్‌బీ ధర తగ్గినప్పుడు, సాగు ఖర్చులు పెరిగినప్పుడల్లా రైతులు ఆయిల్ పామ్ తోటల్ని తీసేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

భద్రాచలం దేవస్థానంలో అన్యమత ప్రచారం

» వస్త్రాల కౌంటర్‌లో సంచిపై అన్యమత వాక్యాలు



అన్యమతానికి సంబంధించిన వాక్యాలు ముద్రించిన సంచి ఇదే

భద్రాచలం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో అన్యమత ప్రచారం జరగడం కలకలం రేపుతోంది. వస్త్రాలు కొనుగోలు చేసే భక్తులకు ఇచ్చిన సంచిపై అన్యమతానికి చెందిన వాక్యాలు ఉండటం వివాదానికి కారణమైంది. గుంటూరుకు చెందిన మేళ్లచెరువు జనార్దనరావు అనే భక్తుడు ఆదివారం తమ కుటుంబ సభ్యులతో సీతారామచంద్రుల దర్శనం చేసుకున్నారు. శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో రెండు చీరలతో పాటు ఇతర వస్త్రాలను కొనుగోలు చేశారు. కౌంటర్ నిర్వాహకులు వస్త్రాలను పెట్టి ఇచ్చిన సంచులపై అన్యమతానికి సంబంధించిన వాక్యాలు ముద్రించి ఉండటంతో జనార్దనరావు కుటుంబసభ్యులు అవాక్కయ్యారు. ఈ ఘటనపై భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఘటన దురదృష్టకరమని, దేవస్థానంలో అన్యమత ప్రచారం జరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. దీంతో ఈవో తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కౌంటర్‌లో మరికొన్ని అన్యమత ప్రచార సంచులు కూడా లభ్యమైనట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టరు ఎస్‌వీసీహెచ్ సుబ్బారావుకు నోటీసు జారీ చేసి 24 గంటలలో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

లోకేశ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించాలి

» వాషింగ్టన్ మినీ మహానాడులో తీర్మానం

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు పూర్తిస్థాయిలో పార్టీ బాధ్యతలు అప్పగించాలని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు కోరారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని వర్జీనియా సిటీలో ఆదివారం నిర్వహించిన మినీ మహానాడులో ఆయన పాల్గొన్నారు. నారా లోకేశ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించాలని ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులు తీర్మానం చేశారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ 102వ జయంతి, సినీ వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భానుప్రకాశ్ మాగులూరి, మేరీల్యాండ్ పార్టీ ప్రతినిధి రాజా రావులపల్లి, కిశోర్ కంచెర్ల తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం కాదు.. వైసీపీకి తద్దినం..!

» మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

కొండపి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ సిగ్గులేకుండా వెన్నుపోటు దినం నిర్వహిస్తుందట. ప్రజలు ఆ పార్టీకి పాడెకట్టినరోజు కనుక వైసీపీ తద్దినం చేసుకోవడం మంచిది' అని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఎద్దేవా చేశారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం కె.ఉప్పలపాడులో రేషన్ దుకాణాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'నువ్వు, నీ పార్టీ వల్ల ఉపయోగంలేదని ప్రజలు 11 స్థానాలకు కుందించారు. ఇప్పుడు ఆ పదకొండు కూడా ఎందుకు ఇచ్చామా..? అని బాధపడుతున్నారు' అని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి స్వామి వ్యాఖ్యానించారు. 'ప్రజల ఆస్తి పత్రాలపై నీ బొమ్మలు వేసుకుని.. అందరికీ అమ్మఒడి అని ఒక్కరికే ఇచ్చి.. పెంచిన పింఛన్ డబ్బులు విడతల వారీగా ఇవ్వడం వల్ల నీ పార్టీకి ప్రజలు తద్దినం పెట్టారు. కనుక వైసీపీ నాయకులు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి ఈ నెల 4న పిండ ప్రదానం చేసుకుని, పార్టీని మూసివేసుకోవడం మంచిది' అని ఘాటుగా విమర్శించారు. పొగాకు రైతుల కోసం వస్తున్నానని చెప్పి.. ఆ తర్వాత వాతావరణం బాగాలేదని వాయిదా వేసుకోవడం జగన్‌కే చెల్లిందన్నారు. తన ప్రభుత్వంలో చేసిన నిర్వాకానికి రైతులు తిరగబడి తగిన బుద్ధి చెబుతారనే భయంతోనే వాయిదా వేసుకున్నారని విమర్శించారు.

లిక్కర్ స్కాంలో సూత్రధారి తాడేపల్లి బిగ్‌బాస్

» దర్యాప్తులో ఆధారాలన్నీ జగన్ వైపే: పట్టాభిరాం



కడప మారుతీనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ లిక్కర్ స్కాంలో ప్రధాన సూత్రధారి తాడేపల్లి బిగ్‌బాస్ అని.. దర్యాప్తులో అన్ని వేళ్లూ ఆయన వైపే చూపుతున్నాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తులో పలు విషయాలు బయటపడుతున్నాయని, మాజీ సీఎం జగన్‌కు కళ్లు, చెవులుగా వ్యవహరిస్తున్న కీలక వ్యక్తులు ఆధారాలతో సహా దొరికిపోయారని అన్నారు. మహానాడు జరిగిన ప్రదేశాన్ని ఆదివారం ఆయన సందర్శించి అక్కడున్న వ్యర్థాలను కార్పొరేషన్ సిబ్బందితో శుభ్రం చేయించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో దొరికిన జగన్ అనుయాయులు బిగ్‌బాస్ పేరు చెప్పేందుకు భయపడుతున్నారని అన్నారు. త్వరలోనే ఆధారాలతో సహా సిట్ దర్యాప్తు బృందం తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకోనుందని చెప్పారు. బిగ్‌బాస్‌ను పట్టుకునేందుకు పోలీసులు తాడేపల్లి గోడలు దూకరని, చట్టవ్యతిరేకంగా, అప్రజాస్వామికంగా వ్యవహరించరని అన్నారు. జగన్ అర్ధరాత్రి ధైర్యంగా నిద్రపోవచ్చని చెప్పారు. దర్యాప్తు చట్టప్రకారం జరుగుతుందని తెలిపారు. కాగా.. కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమైందని.. అది చూసి వైసీపీ నేతలకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయిందని పట్టాభి వ్యాఖ్యానించారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, మంత్రి లోకేశ్‌పైనా విషప్రచారం చేస్తున్నారన్నారు. కడపలో నిర్వహించిన మహానాడు ప్రదేశంలో ఎటువంటి చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలని సీఎం, మంత్రి లోకేశ్ చెప్పడంతో ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామన్నారు.

అన్ని రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు

సరుకుల పంపిణీలో పారదర్శకత

» ఫిర్యాదులకు క్యూఆర్ కోడ్ స్కాన్..

» ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు

» పోర్టుల వద్ద చెక్‌పోస్టులతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట

» కొత్తగా 7 లక్షల దరఖాస్తులు: మంత్రి నాదెండ్ల

» రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ ప్రారంభం



కాకినాడ జిల్లా పిఠాపురంలోని రేషన్ షాపులో సరుకుల పంపిణీని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

పిఠాపురం,/పిఠాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అన్ని రేషన్ డిపోల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఫిర్యాదులు, సలహాలు, సూచనలు పంపవచ్చని తెలిపారు. వీటిని పౌరసరఫరాల శాఖ కమిషనరు నేతృత్వంలోని కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీని ఆదివారం ఆయన ప్రారంభించారు. కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డులోని రేషన్ షాపులో కార్డుదారులకు మంత్రి నాదెండ్ల సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 29,761 రేషన్ షాపుల ద్వారా 1.44కోట్ల మంది కార్డుదారులు, 4.42 కోట్ల మంది ప్రజలకు సరుకుల పంపిణీని ప్రారంభించామన్నారు. 15.65 లక్షల మంది దివ్యాంగులు, 65 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు 5వ తేదీలోగా డీలర్లు ఇంటింటికి వెళ్లి సరుకులు అందజేస్తారని చెప్పారు. పోర్టబులిటీ విధానం అమలు కోసం ప్రతి రేషన్ డిపోకు అదనంగా 10శాతం సరుకులు ఇచ్చామన్నారు. కార్డుదారులు ఎక్కడి నుంచైనా తమకు అందుబాటులో ఉన్న రేషన్ షాపు ద్వారా సరుకులు తీసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీని అడ్డుకునేందుకు పలువురు కోర్టుల ద్వారా ప్రయత్నం చేశారని, వాటిని ప్రభుత్వం అధిగమిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. పోర్టుల వద్ద చెక్‌పోస్టులు, నిఘా ఏర్పాటుచేసి బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన కార్డులు, కుటుంబసభ్యుల చేర్పు, తొలగింపులు, చిరునామా మార్పు తదితరాల కోసం 7 లక్షల దరఖాస్తులు వచ్చాయని, 21 రోజుల్లోగా వీటిని పరిష్కరించి కొత్త కార్డులు అందజేస్తామని చెప్పారు. ఎండీయూ వాహనాలు తొలగించి, రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీని పునరుద్ధరించడంతో ప్రభుత్వానికి రూ.385 కోట్లు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, ఆ శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు ఏడాది..

4న రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు..

సుపరిపాలనకు ఏడాది, రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై ఏడాది పేరుతో ఈనెల 4న జనసేన శ్రేణులంతా సంక్రాంతి, దీపావళి పండుగలు ఒకే రోజున చేయాలని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం కుమారపురంలో జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ 4న ఉదయం రంగవల్లుల పోటీలు, సాయంత్రం బాణసంచా కాల్చి ఆ చిత్రాలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు.

కొత్త జిల్లాలు.. పాత పద్ధతులు

(మొదటి పేజీ తరువాయి)

లేఖరాయాల్సిఉంది. అదేమిటోగానీ, జగన్‌కు కరోనా సమయంలో ఎన్నికల నిర్వహణపై ఉన్న శ్రద్ధ జిల్లాల ఏర్పాటుకు కేంద్రం నుంచి ఆమోదం తెచ్చుకునే విషయంలో లేకుండాపోయింది. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన 18నెలల తర్వాత అంటే, 2023 నవంబరులో రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ కోరుతూ కేంద్ర హోమ్‌శాఖకు లేఖ రాశారు. 2024 జనవరిలో మరోసారి లేఖ రాశారు. అప్పటికే ఎన్నికల వాతావరణం వచ్చేసింది. కేంద్రం వద్ద నాడు జగన్ తనకున్న ప్రాబల్యాన్ని ఉపయోగించి ఈ విషయంలో సానుకూల నిర్ణయం పొందలేకపోయారు.

ఆ ఉత్తర్వును సవరించండి ప్లీజ్

కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉపాధ్యాయ నియామకాల కసరత్తు మొదలుపెట్టింది, కొత్త జిల్లాల ఆధారంగానే నియామకాలు చేపట్టాలని ప్రయత్నించగా, రాష్ట్రపతి ఉత్తర్వులు ఇంకా సవరణ కాలేదని, పెండింగ్‌లోనే ఉందని తెలిసింది. దీంతో వెంటనే కొత్త జిల్లాల అంశాన్ని రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చాలని కోరుతూ 2024 సెప్టెంబరులో కేంద్రానికి ప్రభుత్వం లేఖ రాసింది. ఈ లేఖను పరిగణనలోకి తీసుకొని కేంద్రం అదేనెల 25న ఒకసారి, అక్టోబరులో మరోసారి ఏపీ సర్కారుకు లేఖలు రాసింది. కొత్త జిల్లాల ఏర్పాటు అంశంపై పలు సందేహాలు లేవనెత్తి వివరణలు కోరింది. వెంటనే రాష్ట్ర సర్కారు గత అక్టోబరు 24న, ఈ ఏడాది ఫిబ్రవరి 10న లిఖితపూర్వక వివరణలు పంపించింది. దీనిపై కేంద్ర హోమ్‌శాఖ స్పందించలేదు. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ ఫైలు ఇంకా కేంద్ర హోమ్‌శాఖ పరిశీలనలోనే పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో సీఎస్ కె.విజయానంద్ ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ, 'ఇంకెప్పుడు సమస్యను పరిష్కరిస్తా'రంటూ గత గురువారం కేంద్ర హోమ్ శాఖ కార్యదర్శికి లేఖరాశారు. "మీరు అడిగిన అనేక సందేహాలకు సవివరమైన వివరణలు ఇచ్చాం. ఎలాంటి తప్పుడు అవగాహనకు వీలులేకుండా ఉండేలా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (ఉద్యోగుల స్థానికత, నియామకాలు) ఆర్డర్ 2025 ముసాయిదాను మీకు పంపించాం. కాబట్టి వీలైనంత త్వరగా దాన్ని ఆమోదించి గజిట్ ఆఫ్ ఇండియాలో ప్రచురించగలరు. ఆ సమాచారం మాకు వెంటనే అందించగలరు" అని సీఎస్ ఆ లేఖలో కోరారు.

బదిలీల నుంచి స్థానికత దాకా.. సమస్యలే

కేంద్రం సకాలంలో కొత్త జిల్లాల ఏర్పాటు అంశాన్ని రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చకపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడి మూడేళ్లు దాటినా ఇంకా ఉద్యోగుల విభజన జరగలేదు. ఉద్యోగుల స్థానికత ఏమిటో సర్కారు తేల్చలేకపోయింది. 2022లో ఉద్యోగుల సర్దుబాటు ఉత్తర్వులే అమల్లో ఉన్నాయి. ఫలితంగా బదిలీల సమస్య జటిలమవుతోంది. కొత్త జిల్లాల ఉద్యోగులు తమ సొంత ప్రాంతంలో బదిలీ పొందలేకపోతున్నారు. ఉద్యోగ నియామకాల్లో స్థానికతా అంశం తీవ్రంగా ఉంది. పాత జిల్లాల కేంద్రంగానే ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు ఇవ్వాల్సి వస్తోంది. దీంతో నియామకాలు అదే ప్రాతిపదికన చేపడితే, ఇక కొత్త జిల్లాల ఏర్పాటువల్ల కలిగే ప్రయోజనం ఏమీ దక్కే అవకాశం లేదు.

సిక్కిం వరదల్లో విజయనగరం తహసీల్దార్

» ప్రత్యేక సహాయక చర్యలు: ఏపీ భవన్

న్యూఢిల్లీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సిక్కిం వరదల్లో చిక్కుకున్న తెలుగు కుటుంబాలను సురక్షితంగా తీసుకొచ్చేందుకు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో ప్రత్యేక సహాయక చర్యలు చేపడుతున్నట్లు ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ ఎ.శ్రీకాంత్ తెలిపారు. వరదల్లో చిక్కుకున్న వారిలో విజయనగరం తహసీల్దార్ కూర్మనాథరావు, భార్య ఉమ, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర ఆదేశాలతో, సిక్కింలోని మంగన్ జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా ఇతర అధికారులతో సంప్రదింపులు జరిపామని పేర్కొన్నారు. సిక్కిం డీజీపీ శ్రీధరరావు బాధితుల సహాయక చర్యల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కొండచరియలు విరిగి పడడంతో రాకపోకలు స్తంభించిపోయాయని, సోమవారం లోపు పునరుద్ధరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పింఛన్, రేషన్ పంపిణీ.. ఇప్పుడే బాగుంది

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో కంటే సజావుగా సాగుతోంది. గత జూన్ నుంచి వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయడం లేదు. అయినా ప్రతి నెలా ఒకటో తేదీ లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఉద్యోగులు అందజేస్తున్నారు. ఈ నెలలో పెన్షన్‌ను ఒక రోజు ముందుగానే మే 31న పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ఒక్కరోజులోనే 92శాతం పూర్తి చేశారు. పెన్షన్‌ను రూ.3 వేలుకు పెంచుతామన్న హామీని జగన్ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లకు నెరవేరిస్తే.. రూ.4వేలుకు పెంచుతామన్న మాటను చంద్రబాబు సీఎం అయిన వెంటనే నిలబెట్టుకున్నారు. మాట తప్పను, మడమ తిప్పను అని గొప్పలు చెప్పుకొనే జగన్ సర్కారుకు, చంద్రబాబు ప్రభుత్వానికి పాలనలో తేడా చెప్పడానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమేనని అంటున్నారు. వలంటీర్లను తొలగించడం వల్ల ప్రజలకు ఏ సేవలు కూడా నిలిచిపోలేదని చెబుతున్నారు.

ఎన్నికల ముందు రాద్ధాంతం

పెన్షన్ల పంపిణీపై ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం రాద్ధాంతం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక వలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేపట్టరాదని ఈసీ ఆదేశించింది. వలంటీర్లు ఉండటం వల్లనే పెన్షన్ ప్రతినెలా ఒకటో తేదీ వస్తోందని, ఇక నుంచి సకాలంలో రాదని అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేసింది. గతంలో పెన్షన్లు ఇంటికొచ్చేవని, చంద్రబాబు ఫిర్యాదుతో సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పెన్షన్‌దారులు అనుకునేలా, టీడీపీ పట్ల వ్యతిరేకత పెంచేలా ఉధృతంగా ప్రచారం చేసింది. ఎన్నికల్లో లబ్ధిపొందాలని కుట్ర చేసినా ప్రజలు నమ్మలేదు.

వలంటీర్ల పని.. సచివాలయ సిబ్బందితో

వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లను నియమించింది కేవలం ఆ పార్టీ కోసమే. సొంత పార్టీ కార్యకర్తలను నియమించుకోవడం ద్వారా వారికి ఉపాధి కల్పించడంతో పాటు వారి ద్వారా పార్టీ పనులు చేయించుకోవాలన్నది అసలు వ్యూహం. వలంటీర్లంతా 'మన వాళ్లే' అని స్వయానా నాటి సీఎం జగన్, విజయసాయిరెడ్డిలు పలు సమావేశాల్లో చెప్పారు. వీరు ప్రభుత్వానికి ఏ రకంగా ఉపయోగపడలేదు. రాష్ట్రవ్యాప్తంగా 15వేల గ్రామ, వార్డు సచివాలయాల్లో సుమారు 1.26లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. పెద్ద పంచాయతీల్లో బిల్లు కలెక్టర్లు, ఇతర సిబ్బందితో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 1.62 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. ఇప్పుడు వారి సేవలను ఉపయోగించుకోవడం ద్వారా ప్రతి లబ్ధిదారుకూ పెన్షన్ రంచన్‌గా అందుతోంది. రాష్ట్రంలో పెన్షన్‌దారులతో చంద్రబాబుకు, టీడీపీకి విడదీయరాని బంధముంది. వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలన్న ఆలోచన ఎన్టీఆర్‌దే. మొదటిసారిగా ఎన్టీఆర్ హయాంలో రూ.75 పెన్షన్ మంజూరు చేశారు. తర్వాత వైఎస్ హయాంలో రూ.200చేయగా, చంద్రబాబు రూ.2 వేలకు, దివ్యాంగులకు రూ.3వేలకు పెంచారు. 2019 ఎన్నికల ముందు పెన్షన్ రూ.3 వేలకు పెంచుతామన్న వైసీపీ అధికారంలోకి వచ్చాక మాట మార్చింది. ఏటా రూ.250 పెంపు అంటూ మెలిక పెట్టింది. అది కూడా సక్రమంగా ఇవ్వలేదు. ఐదేళ్లకు రూ.3 వేలు పెంచింది. జగన్ మాట తప్పడంతో ఒక్కో పెన్షన్‌దారు రూ.13,500 నష్టపోయారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచారు. టీడీపీ పాలనలోనే పెన్షన్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

> ప్రతి నెలా 1వ తేదీనే... ఆ రోజు సెలవు అయితే అంతకుముందు రోజే ఠంచనుగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నారు. గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ పెన్షన్ల పంపిణీ సవ్యంగా సాగిపోతోంది. వలంటీర్లు లేకపోతే పెన్షన్లే ఇవ్వరన్నట్లుగా ఎన్నికల ముందు జగన్ ప్రచారం చేశారు. మరి.. పెన్షన్ల పంపిణీ ఆగిందా? ఇప్పుడు సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు ఇచ్చేవారు. వాళ్లు అందించిన ఏకైక సేవ ఇదొక్కటే. ఇందుకోసం వలంటీర్లకు నెలకు రూ.5 వేలు జీతం ఇచ్చేవారు. ఏటా రూ.1200 కోట్లు కేటాయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ డబ్బంతా ఆదా అవుతోంది. ఇప్పుడు ఆగింది ఏదైనా ఉందా అంటే.. వలంటీర్లుగా పనిచేసిన వైసీపీ కార్యకర్తలకు జీతాలు మాత్రమే.

వైసీపీకి అలవాటే

ఎన్నికల సమయంలో టీడీపీపై అభాండాలు వేయడం వైసీపీకి కొత్తేమీ కాదు. 2019 ఎన్నికల్లో కూడా జన్మభూమి కమిటీలపై ఎన్నో ఆరోపణలు చేసింది. జన్మభూమి కమిటీలు పెన్షన్లు, ఇళ్ల మంజూరుకు లంచాలు తీసుకుంటున్నాయని, డబ్బులిస్తేనే పెన్షన్లు, ఇళ్లు ఇస్తారని ప్రచారం చేసింది. పలువురు ఇది నిజమని నమ్మారు కూడా. అదేవిధంగా డీఎస్పీ పదోన్నతుల విషయంలో వైసీపీ ఇలాంటి తప్పుడు ప్రచారమే చేసింది. 37మంది కమ్మ సామాజికవర్గానికి మాత్రమే పదోన్నతులు కల్పించారని ప్రచారం చేసింది. చివరకు అవన్నీ అవాస్తవాలు అని తేలింది. ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండటంతో ఇప్పుడు కూడా అదే పంథా అవలంబిస్తోందని చెబుతున్నారు.

సేవలు సమాధి చేయడమే విజనా?


వలంటీర్లను రోడ్డున పడేశారు: జగన్



అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ వాహనాలు, వలంటీర్ల వ్యవహారంపై వైసీపీ అధినేత జగన్ ఎక్స్‌లో స్పందించారు. రేషన్ వాహనాలను నిలిపి వేయడంతో విమర్శలు గుప్పించారు. 'ప్రజల ఇంటికే అందుతున్న సేవలపై మీకు ఎందుకు కక్ష? మళ్లీ ప్రజలకు రేషన్ కష్టాలు ఎందుకు తెస్తున్నారు? ప్రభుత్వ సేవల డోర్ డెలివరీ విధానాన్ని సమాధి చేయడం విజన్ అవుతుందా? రేషన్ డోర్ డెలివరీని రద్దు చేయడం, పేదలను దోపిడీ చేయడానికి మళ్లీ ద్వారాలు తెరిచినట్లు కాదా? 9,260 రేషన్ వాహనాలపై ఆధారపడ్డ దాదాపు 20వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాలను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసం?' అని పేర్కొన్నారు. వలంటీర్లను మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నెలకు రూ.10 వేలు ఇస్తామంటూ వలంటీర్లను మీవైపు తిప్పుకొని ఎన్నికల్లో వాడుకొని, అధికారంలోకి వచ్చాక పచ్చి అబద్ధాలు ఆడుతూ వారిని రోడ్డుమీద నిలబెట్టారు. వలంటీర్లుగా పనిచేస్తున్న 2.6 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.' అని జగన్ ఎక్స్‌లో పేర్కొన్నారు..

జగ్గయ్యపేట వైసీపీలో బాహాబాహీ

» దళిత నేతపై నియోజకవర్గ ఇన్‌చార్జి అనుయాయుల దాడి



తన్నుకుంటున్న వైసీపీ కార్యకర్తలు

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వైసీపీలో విభేదాలు రచ్చకెక్కాయి. పార్టీ కార్యాలయంలోనే శ్రేణులు బాహాబాహీకి దిగాయి. వైసీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, దళిత నేత, జగ్గయ్యపేట పట్టణ ఇన్‌చార్జి మనోహర్ అనుచరుడైన వినోద్‌పై నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అనుయాయులు దాడిచేశారు. వైసీపీ తలపెట్టిన 'వెన్నుపోటు' కార్యక్రమానికి సన్నాహకంగా ఆదివారం రాత్రి సమావేశం జరిగింది. దీనికి మనోహర్ ఆలస్యంగా వచ్చారు. అప్పటికే తన్నీరు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. తనను పార్టీ వాట్సాప్ గ్రూప్‌లో నుంచి ఎందుకు తొలగించావంటూ మనోహర్.. తన్నీరు అనుచరుడు రవిని నిలదీశారు. ఈ సమయంలో మనోహర్ పక్కనే ఉన్న వినోద్‌పై తన్నీరు అనుచరులు దాడికి దిగారు. ఆపై రెండు వర్గాలు చాలాసేపు కొట్టుకున్నాయి. అనంతరం వ్యవహారం పోలీసు స్టేషన్‌దాకా వెళ్లింది.

రేషన్ తిప్పలు తప్పాయి

ఇకపై రేషన్ డీలర్ల వద్దే సరుకుల పంపిణీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పేరుకే... 'ఇంటింటికీ రేషన్ పంపిణీ'! సరుకుల బండి ఇంటింటి ముందూ ఆగిందీ లేదు. సరుకులు ఇచ్చిందీ లేదు. వీధి చివర్లో ఓ మూలకు ఆగి.. సైరన్ కొడితే, లబ్ధిదారులు బిరాబిరా పరిగెత్తుకుంటూ రావాలి. నడిరోడ్డుపై క్యూలో నిలబడి సరుకులు తీసుకోవాలి. ఆ రోజు తప్పిందంటే... మళ్లీ బండి ఎప్పుడు వస్తుందో తెలియదు! ఇదీ జగన్ హయాంలో పరిస్థితి! ఇప్పుడు ఆ కష్టాలకు కూటమి సర్కారు చెల్లు చీటీ రాసేసింది. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు ఆదివారం మళ్లీ తెరుచుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన ఎండీయూ వ్యవస్థ రద్దయింది. రేషన్‌కార్డులు కలిగి ఉన్న 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు తిరిగి 29,796 రేషన్ షాపుల ద్వారా సరుకులు అందిస్తోంది. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేయనున్నారు. ఆదివారాలు, పండుగలు, ఇతర సెలవు రోజుల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయి. లబ్ధిదారులు 15వ తేదీలోపు ఎప్పుడైనా తమకు తీరిక దొరికినప్పుడు సమీప రేషన్ షాపు వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవచ్చు. రేషన్ షాపులకు రాలేని దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు రేషన్ డీలర్లు వారి ఇళ్ల వద్దకే సరుకులను అందిస్తారు.

ఇదేనా జగన్ 'సేవ'?

జగన్ 'గొప్ప'గా ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీతో తిప్పలు తప్పలేదు. ఇంటింటికీ సరుకులు సరఫరా చేయకుండా.. ఎక్కడో వీధి చివర్ల వాహనాన్ని నిలిపి సరుకులు పంపిణీ చేయడంతో డోర్ డెలివరీ కాస్తా వీధి డెలివరీగా మారింది. వాహనం ఎప్పుడు వస్తుందోనని పనులు మాని పడిగాపులు కాయాల్సి వచ్చేది. వాహనం వచ్చినప్పుడు కార్డుదారులు అందుబాటులో లేకుంటే ఇక ఆ నెలకు సరుకులు పొందే అవకాశం కోల్పోయినట్టే. లేదా వాహనం ఎక్కడుందో అంటూ వీధుల వెంట తిరగాల్సిన దుస్థితి. వరుసగా మూడు నెలలు రేషన్ తీసుకోకపోతే కార్డులు రద్దయిపోతాయన్న భయంతో కూలిపనులు, చిరుద్యోగాలకు సెలవు పెట్టి మరీ రేషన్ వాహనాల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. అందరికీ పంపిణీ చేయకపోవడంతో మిగిలిపోయిన బియ్యాన్ని కూడా పంపిణీ చేసినట్లు దొంగ లెక్కలు రాసుకుని కాజేసేవారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు కిలో పది రూపాయల చొప్పున రేషన్ వాహనాల నిర్వాహకులే కొనుగోలు చేసి.... అవే వాహనాల్లో అక్రమ రవాణా చేసిన ఉదంతాలూ బయటపడ్డాయి. కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం తదితర పోర్టుల ద్వారా వేలాది టన్నులు తరలిపోయాయి. ఇలా వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం చెలరేగిపోయింది.

ప్రభుత్వంపై పెను భారం...

ఇంటింటికీ రేషన్ పంపిణీ... రాష్ట్ర ప్రభుత్వానికి పెను భారంగా పరిణమించింది. 9,260 రేషన్ వాహనాల కొనుగోలుకు సంబంధించిన బ్యాంకు వాయిదాలు, వడ్డీల భారం, జీతాల చెల్లింపు... మూడేళ్లలో దాదాపు రూ.1800 కోట్లు ఖర్చుపెట్టారు. వాహన నిర్వాహకులకు ప్రతినెలా రూ.21వేలు జీతం చెల్లించాలి. ఇంత చేసినా లబ్ధిదారులకు మేలు జరుగుతోందా అంటే అదీ లేదు. దీనిని దృష్టిలో పెట్టుకునే, ఎండీయూ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. అదే సమయంలో... వాటి డ్రైవర్లు ఇబ్బంది పడకుండా ఆ వాహనాలపై ఉన్న బ్యాంకు రుణ బకాయిలను సుమారు రూ.200 కోట్లు ప్రభుత్వమే చెల్లించనుంది. ఆ వాహనాలు పూర్తిగా డ్రైవర్ల సొంతం కానున్నాయి. వాటి ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

పండుగ వాతావరణంలో పంపిణీ

తొలిరోజే సరుకులు తీసుకున్న 15 లక్షలకుపైగా కార్డుదారులు

రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని ప్రభుత్వం పునరుద్ధరించడంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో రేషన్ పంపిణీ జరిగింది. డీలర్లు రేషన్ షాపులను పూలతో అలంకరించారు. స్థానిక కూటమి నాయకులను ఆహ్వానించి వారి చేతుల మీదుగా సరుకుల పంపిణీని ప్రారంభించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా పునఃప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షలకుపైగా కార్డుదారులు సరుకులు తెచ్చుకున్నారు. ఒక్క అనంతపురం జిల్లాలో ఆదివారం సాయంత్రం 6 గంటలలోపు లక్ష మందికిపైగా రేషన్ తీసుకున్నారు.



తిరుమల నగర్‌లో ఏపీఐఐసీకి చెందిన స్థలం చుట్టూ రూ.13.5 లక్షలతో నిర్మించిన ప్రహరీ

నేడు గాజువాకలో 'అక్షరమే అండగా...' సభ

» హాజరు కానున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య

» ఎమ్మెల్యే పల్లాతో కలసి అభివృద్ధి పనుల పరిశీలన

విశాఖపట్నం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' సభను విశాఖ జిల్లా గాజువాక నియోజక వర్గ పరిధిలోని తిరుమల నగర్‌లో సోమవారం నిర్వహించనున్నారు. స్థానిక ఆర్యవైశ్య సామాజిక భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, స్థానిక కార్పొరేటర్ బొండా జగన్‌తో పాటు ఆర్డీసీ, జీవీఎంసీ, ఈపీడీసీఎల్ సిబ్బంది హాజరు కానున్నారు. జనవరి 28న 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా...' కార్యక్రమంతో తిరుమలనగర్ వాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈ ప్రాంతానికి ఆనుకొని ఉన్న ఆటోనగర్ ఈ-బ్లాక్‌లో పలు కర్మాగారాల నుంచి వెలువడే వ్యర్థాలను ఏపీఐఐసీకి చెందిన ఖాళీ స్థలంలో పడేసి సాయంత్రం వేళ నిప్పు పెట్టేవారు. రసాయనాలతో కూడిన పొగ స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేసేది. కాలనీలోని పలుచోట్ల రాత్రిళ్లు వీధి దీపాలు వెలిగేవి కావు. లోటెజీ సమస్య కూడా ఉంది. పార్కుల్లో ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉండేవి. ఈ ప్రాంతం మీదుగా ఆర్టీసీ బస్సులు నడిచేవి కాదు. స్థానిక కార్పొరేటర్ బొండా జగన్, జీవీఎంసీ, ఏపీఐఐసీ, పోలీసు అధికారులు 'ఆంధ్రజ్యోతి' సదస్సుకు హాజరై సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా వాటి పరిష్కారానికి చొరవ చూపారు. దీంతో డంపింగ్ యార్డుగా మారిన ఏపీఐఐసీ స్థలం చుట్టూ రూ.13.5 లక్షలతో ప్రహరీ నిర్మించారు. అక్కడి వ్యర్థాలన్నీ తరలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి కాలనీలో వెలుగులు పంచారు. పోలీసులు గస్తీ ఏర్పాటుచేసి ఆకతాయిల బెడదను నివారించారు. వడ్లపూడి మీదుగా బస్సు ప్రారంభానికి ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. తొలుత కణితి మీ-సేవా కేంద్రం వద్ద ఆర్టీసీ బస్సును అతిథులు ప్రారంభిస్తారు. అనంతరం ఏపీఐఐసీ స్థలం ప్రహరీని పరిశీలిస్తారు. అనంతరం సభలో పాల్గొంటారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

» పాఠ్యపుస్తకాల పంపిణీ కూడా నేడే

» ఈ విద్యా సంవత్సరం నుంచే ఎంబైపీసీ

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కాలేజీలు సోమవారం తెరుచుకోనున్నాయి. ఈ ఏడాది నుంచి విద్యా సంవత్సరం సమయాల్లో ఇంటర్ బోర్డు మార్పులు తీసుకొచ్చింది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1నే ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహించి, ఆపై వేసవి సెలవులు ఇచ్చారు. తిరిగి 2025-26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు నేటి నుంచే పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభిస్తున్నారు. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

డీఎస్సీ పరీక్షలకు హాల్ టికెట్లపై తేదీలే ప్రామాణికం

» ఎంపిక సమయంలో ఈడబ్ల్యూఎస్ వర్తింపు: కన్వీనర్

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షల తేదీల విషయంలో అభ్యర్థులకు జారీచేసిన హాల్ టికెట్లు మాత్రమే ప్రమాణికమని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి స్పష్టంచేశారు. పరీక్షల తేదీలపై వివిధ మాధ్యమాల్లో ప్రచారమవుతున్న టైమ్‌టేబుళ్లు తాము జారీ చేయలేదని, హాల్‌టికెట్లపై పేర్కొన్న తేదీల ఆధారంగా మాత్రమే అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఈ మేరకు డీఎస్సీలో పలు సందేహాలకు ఆదివారం ఆయన స్పష్టత ఇచ్చారు. ఈడబ్ల్యూఎస్ కోటా అభ్యర్థులకు హాల్‌టికెట్లలో ఓసీ అని మాత్రమే ఉంటుందని, ఎంపిక సమయంలో కోటా వర్తిస్తుందని వివరించారు. టీజీటీ, పీజీటీ నాన్ లాంగ్వేజ్ పోస్టులు, ప్రిన్సిపాల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ పరీక్ష ఉంటుందని, సాంకేతిక కారణాల వల్ల మొదట జారీచేసిన హాల్ టికెట్లలో అది చూపించలేదని, సవరించిన హాల్ టికెట్ల జారీచేశామని పేర్కొన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి వీలైనంత వరకు ఒకే జిల్లాలో పరీక్షా కేంద్రాలు కేటాయించామని తెలిపారు. పీఈటీ, పీఈటీ-వీహెచ్/హెచ్‌హెచ్(దృష్టిలోపం, శ్రవణ లోపం) పోస్టులకు ఒకే సిలబస్ ఉన్నందున పరీక్షలు కూడా ఒకేరోజు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మా వాడే.. వదిలేయండి!

(మొదటి పేజీ తరువాయి)

కీలక సెక్షన్ల కింద నేరం నిరూపితమైతే నేరుగా జైలుకే! అదే.. శాఖాపరమైన విచారణ జరిగితే తూతూమంత్రపు చర్యలే! మచ్చుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే! వైసీపీ హయాంలో తప్పులు చేసి దొరికిపోయి, అవినీతికి సంబంధించి ఆధారాలు సేకరించి, వివిధ దశల్లో అక్రమాలను నిర్ధారించిన తర్వాత ప్రాసిక్యూషన్ కోసం సిఫారసు చేసిన అనేక కేసులను నీరుగార్చేందుకు నేతలు రంగంలోకి దిగుతున్నారు. వైసీపీ హయాంలో భూములు, రహదారులు, మైన్స్, పురపాలన, సర్వే, సెటిల్‌మెంట్, పరిశ్రమలు, మౌలిక వనరులు, వైద్య, ఆరోగ్యం, ఎక్సైజ్, పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార రంగాల్లో అనేక అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా శాఖల వారీగా జరిగిన తప్పులపై విచారణ చేయిస్తోంది. నేరుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఈ కేసులను పరిశీలిస్తోంది. డిప్యూటీ కలెక్టర్ నుంచి గ్రామస్థాయి రెవెన్యూ అధికారి వరకు.. గనుల శాఖలో సర్వేయర్ నుంచి జిల్లా స్థాయి అధికారి దాకా.. ఇలా ఆయా శాఖల్లో కలిపి 32మందిపై ప్రాసిక్యూషన్ కోరుతూ ఏసీబీ లేఖలు రాసింది. పక్కా ఆధారాలు ఉండి కోర్టు విచారణ తప్పనిసరని నిర్ధారించుకున్న తర్వాతే ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరుతుంది. అయితే ప్రాసిక్యూషన్ కేసుల నుంచి బయటపడేందుకు అక్రమార్కులైన అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కీలక పోస్టుల్లో ఉన్న మంత్రులతో, బాగా పరపతి ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంత్రాంగం నడుపుతున్నారు. భారీ డీల్స్ మాట్లాడుకుని సెటిల్ చేసుకుంటున్నారు. 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం ఇప్పటిదాకా ఆరుగురు మంత్రులు ఈ వ్యవహారంలో తలదూర్చారు. ఇక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలయితే లెక్కేలేదు. ఆ లేఖలు కొందరు ప్రజాప్రతినిధులకు ఆదాయవనరుగా మారిందని అంటున్నారు. మచ్చుకు కొన్ని ఉదంతాలు..

మైకుల ముందే భారీ డైలాగులు!

ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి.. ఓ డిప్యూటీ కలెక్టర్ విషయంలో లేఖ రాశారు. ప్రాసిక్యూషన్ వద్దు.. శాఖాపరమైన విచారణే చేయండని పదేపదే ఒత్తిడి చేశారు. ఈయనే రెవెన్యూలో ఓ మండల స్థాయి అధికారి విషయంలోనూ మరో లేఖ రాశారు. డిస్మిస్ చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, తిరిగి ఉద్యోగం ఇచ్చి మంచి ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని ఈ ఏడాది రెండు పేజీల లేఖరాశారు. జగన్ జమానాలో అనేక అవినీతి చర్యలకు పాల్పడిన ఓ పురపాలక శాఖ అధికారిని కూడా వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి సుద్దపూస.. అవినీతి ఎలా ఉంటుందో కూడా తెలియదని లేఖలో కితాబిచ్చారు. ఈ లేఖను ఉన్నతాధికారి చదువుతారో లేదోనన్న సందేహం వచ్చి ఫోన్‌లోనూ వివరించారట! ఆయన దగ్గర పనిచేస్తున్న ఆత్మీయుడైన ఓఎస్డీ ఇంకో రెండాకులు ఎక్కువే చదివారు. విజిలెన్స్ కేసుల ఆధారంగా అభియోగాలు ఎదుర్కొంటున్న వారిని కాపాడేలా మంత్రి పేరిట కొన్ని లేఖలు రాశారు.

ప్రత్యేక టీంతో సెటిల్‌మెంట్లు!

కోస్తాకు చెందిన మరో మంత్రి తీరే వేరు. ఏరికోరి ఏసీబీ, విజిలెన్స్ కేసుల పరిష్కారానికి ఓ ప్రత్యేక టీంను వేసుకున్నారు. ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులను నియమించి.. తన వద్దకు వచ్చే పిటిషన్లను పరిశీలించే బాధ్యత అప్పగించారు. వాటిలో కాసులు కురిపించే వాటిని సెటిల్ చేస్తున్నారు. అందులో ఏసీబీ ప్రాసిక్యూషన్ కేసులకు ప్రత్యేక కౌంటర్ తెరిచారు. ఓ మున్సిపల్ అధికారి ఏసీబీకి పట్టుబడిన కేసులో శాఖాపరమైన విచారణ మాత్రమే చేపట్టాలని లేఖ పంపించారు.

సిఫారసు లేఖలు తెచ్చుకోండి..

కోస్తాకే చెందిన ఇంకో మంత్రి శైలే వేరు. ఆయన వద్ద కీలక శాఖలున్నాయి. వాటిలోని ఉద్యోగులు.. లేదా ఆ శాఖలతో ప్రభావితమవుతున్న సాధారణ ప్రజలు.. తమ సమస్యల పరిష్కారానికి ఆయన వద్దకు వెళ్తే.. 'మీ ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఉందా? మీ జిల్లా మంత్రి సిఫారసు లేఖ ఉందా? అవి ఉంటే మాట్లాడండి. లేదంటే వెళ్లి తెచ్చుకోండి' అని అంటారు. ఆయన దగ్గర పనిచేసే ఓ కీలక రిటైర్డ్ అధికారి కూడా ఇదే చెబుతారు. దీంతో ప్రజలు విధిలేక ఎమ్మెల్యే సిఫారసు లేఖలకోసం తిరుగుతున్నారు. ఇటీవలి కాలంలో తనకు సహచర మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాసిన లేఖలను క్రోడీకరించి వాటిల్లోని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. తనపై ఏదైనా ఆరోపణ వస్తే.. సహచర మంత్రులు, ఎమ్మెల్యేల కోరిక మేరకే కొన్నిపనులు చేయాల్సి వస్తోందని.. ఇందులో వ్యక్తిగత లాభమేమీ లేదని అమాయకత్వం ప్రదర్శించినట్లు సమాచారం.

అవినీతి సర్వేయరుకు అండ..

తీవ్ర అవినీతిలో కూరుకుపోయిన ఓ రాయలసీమ సర్వేయర్‌ను అదే ప్రాంతానికి చెందిన అధికార పార్టీ ఎమ్మెల్సీ వెనకేస్తున్నారు. అతడిపై అవినీతి కేసు నిర్ధారణ అయినందున ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని రెవెన్యూ శాఖకు ఏసీబీ చీఫ్ లేఖ రాశారు. అయితే ఈ కేసును ఏసీబీ సరిగా విచారించలేదని.. ఆ సర్వేయర్ ఉత్తముడని, ప్రాసిక్యూషన్‌కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వకూడదని ఆ ఎమ్మెల్సీ జనవరిలో సర్కారుకు లేఖ రాశారు. గతంలోనూ ఆయన బెరైటీస్, ఇతర ఖనిజాల కాంట్రాక్టు సంస్థలు, కంపెనీలను తన లేఖాస్త్రాలతో భయపెట్టారు. పార్టీ అధిష్ఠానం మందలించడంతో ఇప్పుడు ఏసీబీ, విజిలెన్స్ కేసులపై కన్నేశారు.

దేనికైనా చేయి తడపాల్సిందే..!

కోస్తాకు చెందిన ఓ ఎమ్మెల్యే గతంలో మంత్రిగా కూడా పనిచేశారు. తిరుమల దర్శనార్థం లేఖల నుంచి ఏసీబీ కేసుల్లో రక్షణ కోరే సిఫారసు లేఖల వరకు డబ్బు వసూలు చేస్తారన్న పేరుంది. సొంత పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలపై ఫిర్యాదులుంటే.. ఉన్నత స్థాయి వర్గాలను రాచిరంపానపెట్టి చివరకు సెటిల్‌మెంట్ చేసుకుంటారని టీడీపీ నేతలే ఆయనపై మండిపడుతుంటారు. స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ సీసీఎల్ఏ, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో అనేక మంది డిప్యూటీ కలెక్టర్లకు తహశీల్దార్లుగా.. తహశీల్దార్లకు డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలుగా రివర్షన్ ఇచ్చారు. ఇలా రివర్షన్ పొందిన ఇద్దరు తహశీల్దార్లపై తీసుకున్న చర్యలను నిలిపివేసి.. వారిని తిరిగి అసలైన పోస్టుల్లో కూర్చోబెట్టాలంటూ సదరు ఎమ్మెల్యే గతేడాది ఒకటి, ఈ ఏడాది ఫిబ్రవరిలో మూడు లేఖలు రాశారు. తన సిఫారసుల ఆధారంగా చర్యలు తీసుకోకపోతే ప్రజాందోళనలు చేస్తామని హెచ్చరించారాయన.

బీఎండబ్ల్యూ కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

» స్తోమత లేదని చెప్పినా వీడని మంకుపట్టు



జాని (ఫైల్)

జగదేవ్‌పూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తనకు బీఎండబ్ల్యూ కారు కొనివ్వడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బొమ్మ కనకయ్య, కనకమ్మల కుమారుడు బొమ్మ జానీ (21) పదో తరగతి వరకు చదివాడు. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. తనకు బీఎండబ్ల్యూ కారు కొనివ్వాలని లేదంటే చనిపోతానని కొద్దిరోజులుగా వారిని బెదిరించేవాడు. అతడి బాధ భరించలేని తల్లిదండ్రులు శుక్రవారం సిద్దిపేటలోని కారు షోరూంకు తీసుకెళ్లి మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు కొనిస్తామని చెప్పగా తనకు నచ్చిన కారు కొనివ్వడం లేదని జానీ మనస్తాపం చెందాడు. వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు.

నిరసన వీడియో తీసింది టీటీడీ ఉద్యోగే!

తిరుమల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సర్వదర్శన క్యూలైన్‌లో భక్తుల నిరసనల వీడియో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించింది టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేసే ఉద్యోగేనని తెలిసింది. అన్నప్రసాదాలు, పాలు అందడం లేదంటూ గత శుక్రవారం రాత్రి కాకినాడకు చెందిన అచ్చారావు టీటీడీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు పక్కనే మరికొంతమందితో కూడా నిరసనలు చేయించారు. దీంతో అచ్చారావుపై బైండోవర్ కేసు నమోదు కాగా, క్యూలైన్ వెలుపల నుంచి వీడియో తీసింది ఎవరనే అంశంపై టీటీడీ విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేసే ఉద్యోగే ఈ వీడియోను చిత్రీకరించినట్టు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. టీటీడీలో పనిచేస్తూ.. ఎందుకు వీడియో తీశారు? ఎందుకు బయటపెట్టారనే అంశాలపై విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నట్టు సమాచారం.

తెలంగాణ, ఏపీతో విన్ గ్రూప్ చర్చలు!

» ఈవీ ప్లాంట్ నెలకొల్పే యోచనలో వియత్నాం సంస్థ


» ఇప్పటికే తమిళనాడులో ప్లాంట్ ఏర్పాటు

హయ్ ఫాంగ్ (వియత్నాం), జూన్ 1: వియత్నాంకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీసంస్థ విన్‌ఫాస్ట్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతోంది. విన్ గ్రూప్‌కు చెందిన విన్‌ఫాస్ట్ రూ.17 వేల కోట్లతో ఈవీల తయారీ యూనిట్‌ను ఇప్పటికే తమిళనాడులోని తూతుకుడిలో ఏర్పాటు చేస్తోంది. "మేం భారత్‌లో చాలా రాష్ట్రాల్లో పర్యటించాం. అనేక ప్రాంతాలను పరిశీలించాం. చివరికి తూతుకుడిలో ఈవీల ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ మౌలిక సదుపాయాలు బాగున్నాయి. సమీపంలోనే నౌకాశ్రయం, విమానాశ్రయం ఉన్నాయి" అని విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో ఫామ్ సాన్ చౌ చెప్పారు. ఈ ఏడాది పండగ సీజన్‌లోపే వీఎఫ్6, వీఎఫ్7 ఈవీలను భారత మార్కెట్లో ప్రవేశపెడతామని తెలిపారు. తాము ఇతర రాష్ట్రాలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో కూడా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత మార్కెట్ చాలా కీలకమని, తాము మరింత విస్తరించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. తమిళనాడుతో పాటు తెలంగాణ, ఏపీల్లో కూడా ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. గత 15 నెలలుగా తమిళనాడులో ప్లాంట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. భారత, తమిళనాడు ప్రభుత్వాలు తమకు ఎంతగానో సహకరిస్తున్నాయని చెప్పారు. భారత్, వియత్నాం మధ్య ఎన్నో ఏళ్ల నుంచి దృఢమైన సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు.

శ్రీశైలంలో డ్యామేజీ ఎంతో తేలుద్దాం!

» ఎల్లుండి తర్వాత రానున్న పుణే శాస్త్రవేత్తలు

» భూగర్భ జలాల వీడియోగ్రఫీ.. ఓ విశాఖ ప్రైవేటు సంస్థ కూడా..



అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో జరిగిన మొత్తం నష్టమెంతో తేల్చడానికి రంగం సిద్ధమైంది. పుణేకు చెందిన కేంద్ర జల-విద్యుత్ పరిశోధన కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందాలు మరోసారి శ్రీశైలం వస్తున్నాయి. అత్యాధునిక కెమేరాల సాయంతో భూగర్భ జలాల్లో వీడియోలు తీయనున్నాయి. జలాశయానికి ఏర్పడిన నష్టాన్ని సమూలంగా తెలుసుకుంటే.. అవసరమైన మరమ్మతులు చేపట్టడానికి ఆస్కారం ఉంటుందని జలవనరుల శాఖ భావిస్తోంది. ఇప్పటికే అక్కడ కేంద్ర జల సంఘం, సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందాలు పర్యటించి ప్లంజ్‌పూల్, యాప్రాన్, అప్రోచ్ రోడ్డు, ఎత్తిపోతల పథకంతో పాటు డ్యాం పునాదుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సిలెండర్లు తదితరాలను కూలంకషంగా పరిశీలించాయి. మొత్తం 62 సిలెండర్లలో 22 దెబ్బతిన్నాయని తేల్చాయి. ప్లంజ్‌పూల్ కంటే యాప్రాన్ దెబ్బతినడం వల్లే అత్యధిక నష్టం జరుగుతుందని సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం పేర్కొంది. యాప్రాన్ ఏమేరకు దెబ్బతిందో తెలుసుకునేందుకు వీలుగా డ్రిల్లింగ్‌తో రంధ్రాలు చేయాలని, ఆ శబ్దం ద్వారా డ్యాం పటిష్ఠతను అంచనా వేయొచ్చని తెలిపింది. సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల బృందాలు బుధవారం తర్వాత శ్రీశైలం డ్యాం పరిశీలనకు వస్తామని సమాచారం ఇచ్చాయి. వీరితోపాటు విశాఖకు చెందిన ఒక ప్రైవేటు సంస్థ కూడా అత్యాధునికమైన కెమేరాల సాయంతో అండర్‌గ్రౌండ్ వాటర్‌లో వీడియోలు తీస్తుంది. కింద పునాది భాగంలో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తాయి. డ్యాం పటిష్ఠానికి ఏర్పాటు చేసిన 62 స్టీల్-కాంక్రీట్ సిలెండర్లలో 22 దెబ్బతిన్నాయి. మిగిలిన సిలెండర్లు కూడా ఏ మేరకు దెబ్బతిన్నాయో ఈ వీడియో ద్వారా తెలుసుకుంటారు. వీటిని పరిశీలించాక ఇచ్చే సమగ్ర నివేదిక ఆధారంగా మరమ్మతులు చేపట్టాలని జల వనరుల శాఖ నిర్ణయించింది.

మద్యంపై మరింత నిఘా!

» పనివేళల ఉల్లంఘనలపై సర్కారు సీరియస్

» ప్రతిరోజూ ఉదయం, రాత్రి తనిఖీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మద్యం షాపులు ఉదయం 10నుంచి రాత్రి 10 వరకు, బార్లు ఉదయం 11 నుంచి రాత్రి 11గంటల వరకు పనిచేయాలి. కానీ చాలాచోట్ల ఉదయం 10గంటలకు ముందే షాపులు తెరిచి అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. అలాగే రాత్రి 10తర్వాత కూడా మరో అరగంట అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇక బార్లు అయితే అధికారిక పనివేళలకు ఎప్పుడో మంగళం పలికాయి. 'ఏ సమయంలో వెళ్లినా మద్యం దొరుకుతుంది' అనే స్థాయిలో అనధికారికంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఈ ఉల్లంఘనలపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఐదురోజుల కిందట ఉన్నతాధికారులు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎక్సైజ్ సమీక్ష సమావేశంలో ఈ అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. మద్యం షాపులు, బార్ల పనివేళల ఉల్లంఘనలు, షాపుల వద్ద తాగుడుపై అధికారులు నిఘా పెట్టారు.

ఫొటోలు తీసి పంపాలి

నిఘా అంటే ఏదో మాటల్లో చేశాం అన్నట్టు కాకుండా ఆధారాలు కూడా ఉండాలని అధికారులు ఈ సమావేశంలో స్పష్టంచేశారు. అందులో భాగంగా ప్రతిరోజూ షాపులు, బార్ల పనివేళలు ప్రారంభానికి ముందు, ముగిసే సమయంలో కానిస్టేబుళ్లను పంపి ఫొటోలు తీయించాలని ఆదేశించారు. జియో కోఆర్డినేట్స్ రికార్డ్, సమయం రికార్డు అయ్యేలా ఫొటోలు తీసి కానిస్టేబుళ్లు స్టేషన్ల సీఐలకు పంపుతున్నారు. వారు వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. కొందరు అధికారులు వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఉండటం లేదనే ఫిర్యాదులు అందాయి. దీంతో సీఐలు, ఆపై స్థాయి అధికారులు కూడా ఇకపై రోజూ ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి పంపాలని ఉన్నతాధికారులు స్పష్టంచేశారు.

ఇంటికి తీసుకెళ్లే తాగాలి

గతంలో మద్యం షాపుల వద్ద తాగేందుకు వీలుగా పర్మిట్ రూమ్‌లు ఉండేవి. దీనిపై ఎక్సైజ్ అధికారులు సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో నూతన మద్యం పాలసీలో పర్మిట్‌రూమ్‌లకు అవకాశం ఇవ్వలేదు. అయినా అనధికారికంగా షాపుల వద్ద తాగే విధానం కొనసాగుతోంది. ఒకవేళ పర్మిట్‌రూమ్‌లకు అవకాశం ఇచ్చి ఉంటే ఏడాదికి రూ.170 కోట్లకు పైగా ఆదాయం సమకూరేది. అయితే, ఇటీవల కాలంలో షాపుల వద్ద తాగుడుపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో చర్యలు చేపట్టారు. షాపుల వద్ద ఎవరూ తాగకూడదని, కొనుకున్న మద్యాన్ని ఇంటికి తీసుకెళ్లి తాగాలని స్పష్టంచేస్తున్నారు. పర్మిట్‌రూమ్‌లకు అనుమతి ఇస్తేనే బాగుండేదని, ఇంటికెళ్లి తాగడం సాధ్యంకాదని వినియోగదారులు చెబుతున్నారు.

3 జిల్లాలపై అసంతృప్తి

ఉమ్మడి తూర్పు, పశ్చిమ, ప్రకాశం.. జిల్లాల అధికారుల పనితీరుపై ప్రభుత్వ స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ జిల్లాల అధికారులపైనే తాజా సమావేశంలో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ జిల్లాలో ఎమ్మార్పీ ఉల్లంఘనలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో నాటుసారాను నియంత్రించాల్సిన ఓ అధికారి వారికి సహకరించారని చర్యలు తీసుకున్నారు. ప్రకాశం జిల్లాలో ఓ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పైనా ఆరోపణలు పెరిగాయి. రాబోయే రోజుల్లో పనితీరు మెరుగుపడకపోతే, చర్యలకు వెనకాడకూడదని ప్రభుత్వం భావిస్తోంది.

ఎక్సైజ్‌లో వైసీపీ కంపెనీ తిష్ఠ!

» 'కుంభత్ హోలోగ్రాఫిక్స్'పై అధికారుల ప్రేమ

» నెలకు 5 కోట్లకు పైగా బిల్లుల చెల్లింపు

Kumbhat HOLOGRAPHICS

అమరావతి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చక్రంతిప్పిన కంపెనీలపై ఎక్సైజ్ శాఖ అధికారులు అమితమైన ప్రేమ చూపిస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా పాత కంపెనీలనే కొనసాగిస్తూ... చివరికి ఆ కంపెనీల టెండరు కాలం ముగిసినా కొనసాగించడం విమర్శలకు దారితీస్తోంది. మద్యం సీసాలపై అతికించే హీల్ కోడ్‌లు సరఫరా చేసే కంపెనీని వైసీపీ హయాంలో ఎంపిక చేశారు. 2020లో తమిళనాడుకు చెందిన కుంభత్ హోలోగ్రాఫిక్స్ అనే కంపెనీ టెండరు దక్కించుకుంది. టెండరు కాలపరిమితి ఈ ఏడాది మార్చితో ముగిసింది. అయినా ఇప్పటికీ అదే కంపెనీని ఎక్సైజ్ అధికారులు కొనసాగిస్తున్నారు. వాస్తవానికి కొత్త టెండర్లు పిలిచేందుకు ఈ ఏడాది మొదట్లోనే ప్రక్రియ ప్రారంభించినా, అది మధ్యలోనే ఆగిపోయింది. సదరు కంపెనీ కాలపరిమితి ముగిసిన తర్వాత ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. మరో నెల పొడిగించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఒక్కో హీల్‌కు 40 పైసల వరకు చెల్లిస్తున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన ప్రతి సీసాపై అతికించిన హీల్స్‌కుగానూ ఆ కంపెనీకి నెలకు రూ.5 కోట్లకు పైగా బిల్లులు చెల్లిస్తున్నారు. కుంభత్ కంపెనీపై కూటమి ప్రభుత్వంలో సీఐడీ కేసు నమోదైంది. తమిళనాడుకు చెందిన వ్యక్తి ఫిర్యాదు మేరకు అక్రమంగా టెండరు దక్కించుకొన్నారనే ఆరోపణలతో కేసు నమోదు చేశారు. టెండర్ల సమయంలోనే మరో రెండుడమ్మీ కంపెనీలతో టెండరు వేయించి.. ఈ మూడు కంపెనీలే ఎల్1, 2, 3గా వచ్చేలా ప్లాన్ చేసి, ఆ తర్వాత ఎల్1గా ఉన్న కుంభత్‌కు టెండరు దక్కేలా చేశారనేది అభియోగం. అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి నేతృత్వంలో ఈ టెండర్ల ప్రక్రియ జరిగింది.

కొత్త టెండర్లపై అధికారుల మౌనం

ప్రభుత్వం మారిన వెంటనే ఆ కంపెనీని సాగనంపుతారని భావించారు. కానీ టెండరు గడువు ఉందనే కారణంతో మార్చి వరకు కొనసాగించారు. కాలపరిమితి ముగుస్తున్నా కొత్త టెండర్ల ప్రక్రియ ప్రారంభించ కుండా మౌనం దాల్చారు. మొత్తం గడువు ముగిసిన తర్వాత ట్రాక్ అండ్ ట్రేస్ విధానం అమలు, హీల్స్ సేకరణపై ఏప్రిల్ 28న కమిటీని నియమిస్తూ ముఖ్యకార్యదర్శి ఎంకే మీనా ఉత్తర్వులు ఇచ్చారు. వాసుదేవరెడ్డి తెచ్చిన, సీఐడీ విచారణ జరుగుతున్న కంపెనీపై అంత ప్రేమ ఎందుకనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల ఎవరికి లబ్ధి చేకూరుతోంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కుంభత్‌ను ఎందుకు కొనసాగించాల్సి వచ్చిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. సమాధానం చెప్పేందుకు నిరాకరించారు.



బౌద్ధ ఆరామం 'తొట్లకొండ'పై యోగా

» పాల్గొన్న మయన్మార్, కాంబోడియా బౌద్ధ గురువులు

విశాఖపట్నం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'యోగాంధ్ర' మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం విశాఖపట్నం పరిధిలోని బౌద్ధ ఆరామం తొట్లకొండపై యోగాసనాలు వేశారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌తోపాటు విదేశాలకు చెందిన బౌద్ధ గురువులు రాజదమ్మ(మయన్మార్), బర్మరే(కాంబోడియా) పాల్గొన్నారు. అదేవిధంగా విశాఖకు చెందిన బౌద్ధ సంఘం సభ్యులు ధర్మచారితోపాటు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత మాధుర్, నేవీ అధికారులు, బ్రహ్మకుమారి సంస్థ సభ్యులు, యోగా సంఘం ప్రతినిధులు, రాష్ట్ర పర్యాటక, ఆయుష్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.